www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

సంపుటి 29, సంచిక: 94 | బుధవారం | 23 -09-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

ప్రజాపక్షం 8th ANNIVERSARY 22nd October, 2026

11

## నెల రోజులు 5,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయండి

కృష్ణా జలాలు విడుదల చేయాలని కర్ణాటక సిఎంకు తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేల విజ్ఞప్తి

జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఆయకట్టు పంటలను కాపాడేందుకే భేటీ



ఆసియా క్రీడల క్రికెట్‌లో భారత మహిళల జట్టుకు స్వర్ణం 09

# రిమ్స్‌లో అగ్ని ప్రమాదం

ఊపిరాడక ముగ్గురు పసికందులు మృతి



- ఎసి పేలి అలుముకున్న దట్టమైన పొగ
- ప్రమాద సమయంలో హాస్పిటల్‌లోని ఎన్ఐసియులో 27 మంది చిన్నారులు
- ప్రమాద అనంతరం మిగిలిన 24మంది పిల్లలను ప్రైవేటు అసుపత్రికి తరలింపు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారం
- ఘటనపై సమగ్ర విచారణ
- ఆస్పత్రిని సందర్శించిన మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాపక్షం/ఆదిలాబాద్/ హైదరాబాద్

ఆదిలాబాద్ రిమ్స్ (రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆసుపత్రిలో పిల్లలవార్డులోని నియోనాటల్ స్పెషల్ కేర్ యూనిట్(ఎన్ఐసియు) ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. సోమవారం అర్ధరాత్రి ఎసి పేలి దట్టంగా పొగ అలుముకుంది. ఆ సమయంలో ఇంక్యుబెటర్లలో 27 మంది పసికందులు చికిత్స పొందుతుండగా, పొగ కారణంగా వారికి ఊపిరి ఆడని పరిస్థితి నెలకొంది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, వైద్యాధికారులు, అద్దాలను పగలగొట్టి పసికందులను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే ఇచ్చోడకు చెందిన తరువాయి 8లో

# జూరాలకు 5 టిఎంసిల నీరు ఇవ్వండి

- కర్ణాటక సిఎం డి.కె.శివకుమార్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి విజ్ఞప్తి
- రేవంత్‌రెడ్డి ఫోన్‌కాల్‌కు డికె సానుకూల స్పందన
- బెంగళూరులో శివకుమార్‌తో మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ
- విడతల వారీగా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి




ప్రజాపక్షం/హైదరాబాద్

ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. జూరాల ప్రాజెక్టుకు ఐదు టిఎంసిల నీటిని విడుదల చేయాలని కర్ణాటక సిఎం డి.కె.శివకుమార్‌ను కోరారు. ఈ మేరకు కర్ణాటక సిఎం శివకుమార్‌కు మంగళవారం సిఎం రేవంత్ రెడ్డి ఫోన్ చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల ను ఆయనకు వివరించారు. జూరాల నుంచి సాగునీరు అందక ఇప్పటికే సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఐదు టిఎంసిల నీటిని జూరాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పం దించినట్లు సమాచారం. జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదల అంశంపై కర్ణాటక ప్రభుత్వంతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి మంగళ తరువాయి 8లో

# తీవ్ర వాయుగుండం

## రాష్ట్రంలో ఐదు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు

- ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ
- పలుచోట్ల గంటకు 40–60 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- వాతావరణ కేంద్రం హెచ్చరిక



### హైదరాబాద్‌లో దంచి కొట్టిన వాన

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంపై వర్షాల ముప్పు మరింత ముదిరింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రానున్న 12 గంటల్లో తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముండటంతో రెడ్ ఆరెంజ్ అలర్టు జారీ చేశామన్నారు. పలుచోట్ల గంటకు 40 — 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం ఉదయం వరకు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్ధిపేట, జనగామ, నల్లగొండ, సూర్యాపేటతో పాటు తరువాయి 12లో

### పూర్తిస్థాయిలో అప్రమత్తం

హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, హైడ్రా, పోలీసు కమిషనర్లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రధాన రహదారులు, జంక్షన్లు, కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో వెంటనే సిబ్బంది, యంత్రాలను రంగంలోకి దించాలని చెప్పారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, ట్రాఫిక్ నిలిచిపోకుండా తరువాయి 12లో

## ఎల్‌నినో ప్రభావం కంటే..

## బిఆర్ఎస్ నిర్లక్ష్యం వల్లే... నీటి ఇబ్బందులు

- మీడియా చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపాటు
- ప్రణాళికా లోపాలు, ప్రాజెక్టుల అంచనాల పెంపు, పెండింగ్ ప్రాజెక్టుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆరోపణ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఇబ్బందులకు ఎల్‌నినో ప్రభావం ఒక్కటే కారణం కాదని, బిఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో జరిగిన ప్రణాళికా లోపాలు, ప్రాజెక్టుల అంచనాల పెంపు, పెండింగ్ ప్రాజెక్టుల నిర్లక్ష్యమే ప్రధాన కారణాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం సచివాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా ఆయన మాట్లాడారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని తొలుత ప్రతిపాదించిన విధంగా జూరాల నుంచి చేపట్టి ఉంటే ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ప్రస్తుత స్థాయి నీటి సంక్షోభం ఉండేది కాదని ఉత్తమ్ పేర్కొన్నారు. జూరాల పరిధిలో వరద జలాలను నిల్వ చేసేందుకు రిజర్వాయర్లు తరువాయి 8లో

## నాలుగు డిమాండ్లపై సర్కార్ సానుకూలం..!

- ఉద్యోగ సంఘాలతో చర్చలు మరో సారి వాయిదా....
- నేడు సిఎస్‌తో చర్చలు.. అనంతరం ప్రకటన..?

12

## దసరాకు ముందే కొత్త పెన్షన్‌లు

అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం 03

# జర్మనీలో వామపక్షాల అద్భుత విజయం

- బెర్లిన్ రాష్ట్ర ఎన్నికల్లో డీ లింకే (డిఎల్) పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరణ
- మూడవ స్థానంలోకి ఎ.ఎఫ్.డి. పార్టీ
- ఎలిఫ్ ఎరాల్ఫ్‌కే మేయర్ పదవి అవకాశం



**బెర్లిన్:** జర్మనీలోని బెర్లిన్ రాష్ట్ర ఎన్నికల్లో వామపక్ష 'డీ లింకే' (డిఎల్)పార్టీ అద్భుత విజయం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది.సెప్టెంబరు ఆరో తేదీన తూర్పు జర్మనీ శాగ్సొనీ–అన్హాల్ట్ రాష్ట్రంలో 44 శాతం ఓట్లతో చారిత్రక విజయం సాధించిన జాత్యాహంకార పచ్ఛిమితవాద ఎ.ఎఫ్.డి.పార్టీని వామపక్ష డీ లింకే పార్టీ మూడోస్థానంలోకి నెట్టి చిత్తుగా ఓడించింది.బెర్లిన్ ఎన్నికల్లో కూడా తామే సంపూర్ణ విజయం సాధిస్తామని మితిమీరిన విశ్వాసం ప్రదర్శించిన ఎ.ఎఫ్.డి, వామపక్షాల ఘన విజయం చూసి తీవ్ర దిగ్భ్రాంతిలో మునిగిపోయింది. అదేసమయంలో జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ నాయకత్వంలోని అధికార సిడియు (సోషల్ డెమోక్రటిక్ యూనియన్)పార్టీ రెండోస్థానంలోకి వెళ్ళింది. డీ లింకే పార్టీ అధినేత్రి ఎలిఫ్ ఎరాల్ఫ్ (45) జర్మనీ రాజధాని నగర మేయర్ పదవీ బాధ్యతలు చేపట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. విచిత్రమైన విషయం ఏమిటంటే టర్కీ నుండి వలసవచ్చి జర్మనీలో తలదాచుకున్న వామపక్ష కుటుంబానికి చెందిన ఎలిఫ్ ఎరాల్ఫ్ జర్మనీలో కూడా వామపక్ష తరువాయి 12లో



## అక్టోబర్ తొలి వారం నుంచే ధాన్యం కొనుగోళ్లు

- 8,283 కేంద్రాల్లో 65 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం
- బోనస్‌కు అగ్రిస్టాక్ ఫార్మర్ ఐడి తప్పనిసరి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లకు తెలంగాణ పౌరసరఫరాల శాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబర్ మొదటి వారం నుంచి కొనుగోళ్లను ప్రారంభించనుండగా ఇందుకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 8,283 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నారు. కొనుగోలు కేంద్రాలకు అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, రవాణా వాహనాలను సిద్ధం చేస్తున్నారు. ధాన్యాన్ని వాతావరణ మార్పుల నుంచి రక్షించేందుకు తేమ కొలిచే యంత్రాలు, క్లీనర్లు, డ్రైయర్లను అందుబాటులో ఉంచుతున్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం పౌరసరఫరాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్‌అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం. స్టీఫెన్ రవీంద్ర (ఐపీఎస్) అన్ని జిల్లాల పౌరసరఫరాల అధికారులు, మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ తరువాయి 12లో

# ఎస్‌సి, ఎస్‌టిలపై అణిచివేత ధోరణి వద్దు

- వారి అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాలి
- సిఎం రేవంత్ రెడ్డి పిలుపు
- ప్రభుత్వ పథకాలు.. కార్యక్రమాల్లో పెద్దపీట
- ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల బాధితులకు సత్వరన్యాయం




ప్రజాపక్షం/హైదరాబాద్

దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, ఎస్‌సి, ఎస్‌టిలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని సిఎం పిలుపునిచ్చారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం1989 అమలుపై రాష్ట్ర ఉన్నత స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, న్యాయస్థానాల్లో విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న ఆర్థిక సహాయం, పునరావాస చర్యలను సిఎం సమీక్షించారు. కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరుతో పాటు చట్టంపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాయి 8లో

# 'క్యూర్' బిల్లుకు గవర్నర్ ఆమోదం

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో పరిపాలనా వ్యవస్థలో కీలక మార్పులకు మార్గం సుగమమైంది. క్యూర్ బిల్లుకు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆమోదం తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లుపై గవర్నర్ సంతకం చేయడంతో క్యూర్2026 చట్టం అమల్లోకి రానుంది. దీంతో ఇప్పటివరకు అమల్లో ఉన్న జిహెచ్‌ఎంసి1955 చట్టం స్థానంలో కొత్త చట్టం అమలు కానుంది. హైదరాబాద్ నగరానికి సమగ్ర, ఏకీకృత పాలనా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం క్యూర్ చట్టాన్ని తీసుకొచ్చింది. 'ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం' అనే ఉద్దేశంతో జిహెచ్‌ఎంసితో పాటు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి), సైబరాబాద్ మున్సిపల్ తరువాయి 12లో



## లక్ష్మీ భాస్కర్‌పై ఎసిబి కొరడా

- ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై నిమ్స్‌వైద్యులు, అదనపు సూపరింటెండెంట్ అరెస్టు
- రూ.6.13 కోట్లకు పైగా అక్రమ ఆస్తుల గుర్తింపు
- ఇళ్లు, ఫ్లాట్లు, లగ్జరీ కార్లు స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్

నిమ్స్ అదనపు వైద్య సూపరింటెండెంట్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) కొరడా ఝుళిపించింది. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఆయనపై కేసు నమోదు చేసిన ఎసిబి తరువాయి 8లో

# సువేందు అధికారిపై నందిగ్రాం వేడి

నందిగ్రాం అసెంబ్లీ ఉప ఎన్నిక ఆసక్తిదాయకంగా, ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రతిష్టకు పరీక్షగా పరిణమించింది. ప్రత్యర్థి తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి సంచిత ప్రధాన్ దేను బుజ్జగించి లేదా బెదిరించి పోటీ నుంచి తప్పించిన ముఖ్యమంత్రి, కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు మమతా బెనర్జీ తోడ్పాటు ప్రకటించగానే, ఎప్పుడో 2007లో లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన (దాని నాయకులు మమతా బెనర్జీ, సువేందు అధికారి అని గుర్తు చేసుకోవటం అవసరం) భూపోరాటంలో ఒక హత్యకేసును త్రవ్వి తీసి దానిలో నిందితుడుగా ఉన్న మిలన్ ప్రధాన్‌ను అరెస్టు చేయటం ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా ఉంది. ఆరునెలల క్రితం అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి చరిత్ర సృష్టించిన బిజెపి పక్షాన ముఖ్యమంత్రిగా ఉన్న సువేందు అధికారి ఇటువంటి అనైతిక చర్యకు ఎందుకు పాల్పడినట్లు? మమతా టిఎంసి అభ్యర్థిని పోటీనుంచి తప్పించి ఆమెను నిరాయుధం చేశానని చంకలెగరేసిన ముఖ్యమంత్రికి, ఆయన పూర్వ అధినేత మమతా బెనర్జీ ఊహించని షాక్ ఇచ్చారు. అది ఆయనలో బెదురుపుట్టించి ఉంటుంది. తన బిజెపి అభ్యర్థి పొరపాటున ఓడిపోతే అది తను జాగ్రత్తగా నిర్మించుకున్న రాజకీయ భవిష్యత్‌కు ముప్పు తెచ్చిపెట్టవచ్చు. ఆ ఊహే భరించలేనిది. అందుకే కాంగ్రెస్ అభ్యర్థికి ప్రచారం చేసుకునే అవకాశం లేకుండా కటకటాల వెనుక కూర్చోబెట్టాడు. అయితే మమతా బెనర్జీ ఏమిటో, ఆమె పోరాట పటిమ, ప్రజాకర్షణ అధికారికి తెలుసు. చిత్రమేమంటే కాంగ్రెస్ నుంచి మమతా బెనర్జీతో పాటు బయటకు వచ్చి లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం నిర్వహించిన అధికారి 2021 ఎన్నికల్లో నందిగ్రాంలో, 2026లో భవానీపూర్‌లో ఆమెను ఓడించి ప్రతిపక్ష నాయకుని స్థానం నుంచి ముఖ్యమంత్రి స్థానానికి ఎదిగాడు. అది ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా భిక్ష. ముఖ్యమంత్రి పదవిలోకి వచ్చిన నాటినుంచీ అధికారి ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకమైన చర్యలతో బిజెపి అధినాయకత్వానికి విశ్వాసపాత్రుడు కావటానికి అసోం ముఖ్యమంత్రి హిమంత విశ్వశర్మతో పోటీపడుతున్నాడు. ఇప్పుడు నందిగ్రాంలో రాజకీయ జూదానికి ఒడిగట్టాడు. బెడిసికొట్టిందో, అది నేరుగా మోదీ, షాలకు తగులుతుంది. ఆ దెబ్బ యావత్ దేశ రాజకీయాలపై పనిచేస్తుంది.

పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ పాలన కాంగ్రెస్‌ను నామమాత్రావశిష్టం చేసింది – ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మోహన్‌రెడ్డి వైస్సార్ సిపి కాంగ్రెస్‌ను చావుదెబ్బతీసినట్లు! అయితే జాతీయ రాజకీయాల్లో ప్రతిపక్ష ఇండియా కూటమిలో తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన భాగస్వామిగా ఉంది. కాని మొన్నటి బెంగాల్ ఎన్నికల అనంతరం మమతా బెనర్జీ అధికారం కోల్పోవటమేగాక, ఆమె పార్టీ పార్లమెంటరీ, శాసనసభ పక్షాలు రెండింటిలో తిరుగుబాట్లు జరిగి ఆమె మైనారిటీలోకి నెట్టబడి నిస్సహాయంగా రాజకీయ పోరాటం చేస్తోంది. పార్టీ పేరు, బ్యాంక్ ఖాతాలు, ఎన్నికల గుర్తు స్తంభనలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో నందిగ్రాం ఉప ఎన్నికలో అత్యాశతో కూడిన ముఖ్యమంత్రి ఎత్తుగడలు మమతా బెనర్జీకి అనూహ్యమైన అవకాశం కలుగజేశాయి, ఆమె వెంటనే అందిపుచ్చుకుని రాజకీయ చాతుర్యం ప్రదర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి ఆమె సన్నిహితమైనారు. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఆమె వెంట కాంగ్రెస్ అభ్యర్థికి తోడ్పాటు ప్రకటించింది. ఆ విధంగా ఇండియా కూటమి నూతన జవసత్వాలు సంతరించుకుంది. రాజకీయ కక్ష సాధింపు, అధికార దుర్వినియోగం, బెదిరింపులు వంటి కథనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లటానికి ప్రతిపక్షానికి ఈ ఉప ఎన్నిక అవకాశం కల్పిస్తోంది. ఇది బిజెపి దూకుడును పటిష్టం చేస్తుందో లేక కొత్తగా ఒకటైన ప్రతిపక్షానికి మానసికంగా కీలకమైన మలుపు తెస్తుందో అక్టోబర్ 9న ఓట్ల లెక్కింపుకోసం వేచిచూడాలి.

ఇదే సమయంలో, అసోంలో అక్టోబర్ 6న జరిగే నాగోం లోక్‌సభ ఉపఎన్నిక కూడా ఆసక్తిదాయకంగా మారింది. 2019,2024 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన ప్రద్యోత్ బర్డోలయ్ అసెంబ్లీ ఎన్నికల ముందు, బహుశా ముఖ్యమంత్రి శర్మ ఒత్తిడిపై బిజెపిలో చేరి దిస్పూర్ నుంచి అసెంబ్లీకి ఎన్నిక కావటంతో ఆ లోక్‌సభ స్థానం ఖాళీ ఏర్పడింది. 2023లో నియోజకవర్గాల హద్దుల పునర్విభజనలో 18లక్షల ఓటర్లతో నాగోం ముస్లిం మెజారిటీ నియోజకవర్గం గా మారింది. అత్తరు వ్యాపారవేత్త, అఖిల భారత యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ అధినేత బద్రుద్దీన్ అజ్మల్ రంగంలో దిగటంతో ఈ ఉప ఎన్నిక ఆసక్తిదాయకంగా మారింది. కాంగ్రెస్‌కు పెద్ద సవాలుగా పరిణమించింది. సాధారణంగా ముస్లిం అభ్యర్థులకు ప్రాధాన్యత ఇచ్చే కాంగ్రెస్ పార్టీ విధిగా జనరల్ అభ్యర్థిని పోటీకి దించాల్సిన స్థితిలోకి నెట్టబడింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందిన 19 సీట్లలో 18చోట్ల ముస్లిం అభ్యర్థులే గెలిచారు. అంతేగాక కాంగ్రెస్ గెలుచుకున్న రెండవ లోక్‌సభ స్థానం దుబ్రి నుంచి ముస్లిం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అంతేగాక ముస్లిం అభ్యర్థిని నిర్ణయిస్తే అది ముస్లిం ఓట్లలో చీలికకు దారితీసి బిజెపికి మేలు చేస్తుంది. అందువల్ల కాంగ్రెస్ మాజీ లెజిస్లేటర్ శివమణి బోరాను పోటీకి దించింది. కాగా మూడుసార్లు లోక్‌సభకు ఎన్నికైన అజ్మల్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అజ్మల్ పార్టీతో కాంగ్రెస్ పొత్తు లేనప్పటికీ ముస్లింలు అత్యధికంగా బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. కాబట్టి అజ్మల్ ఉప ఎన్నికలోకి ఆకస్మికంగా దిగటంతో పోటీ ఆసక్తికరంగా తయారైంది. ●



## వేధింపు ఘటనలు దారుణం

**జముయి జిల్లాలో ఒక బాలుడు, బాలికపై జరిగిన వేధింపుల ఘటన అత్యంత దారుణం. బిహార్ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించిపోయాయి అనడానికి ఈ ఘటన ఒక నిదర్శనం. ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి వెంటనే రాజీనామా చేయాలి. బిహార్ అవమానానికి గురవుతోంది. బిహార్ రాష్ట్రంలో 'గుండారాజ్' నడుస్తోంది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి తక్షణమే స్పందించాలి. మంత్రులతో సహా కొంతమంది ఎన్‌డిఏ నాయకులు ఇలాంటి చిన్న చిన్న విషయాలు సాధారణంగానే జరుగుతూ ఉంటాయని చెబుతూ ఈ ఘటనను సమర్థించడం సిగ్గుచేటు.**

– బిహార్ ప్రతిపక్ష నాయకుడు తేజస్వీ యాదవ్.

## శబ్దాలకు అతీతమైన భావ వ్యక్తీకరణ

భాష అనేది కేవలం ఒక శబ్దాల సమూహం మాత్రమే కాదు, అది మానవ సంబంధాలను, భావాలను మరియు ఆలోచనలను అనుసంధానించే ఒక గొప్ప వంతెన. అయితే, వినికిడి లోపం ఉన్న వ్యక్తులకు (బాధితులకు) భావవ్యక్తీకరణకు, సమాజంతో ముడిపడేందుకు 'సంజ్ఞా భాష' అత్యంత శక్తివంతమైన సాధనంగా నిలుస్తుంది. బాధితుల హక్కులను పరిరక్షించడం, సంజ్ఞా భాషల ప్రాముఖ్యతపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచడం, వాటి సంస్కృతిని గౌరవిం చే లక్ష్యంతో ప్రతి ఏటా సెప్టెంబర్ 23న 'అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవం' నిర్వహిస్తారు. ఐక్యరాజ్యసమితి సాధారణ మండలి 2017 డిసెంబర్‌లో దీనిని అధికారికంగా గుర్తించింది, 2018 నుండి ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

సెప్టెంబర్ 23నే ఈ దినోత్సవాన్ని ఎంచుకోవడానికి ఒక ప్రత్యేకమైన చారిత్రక కారణం ఉంది. 1951 సెప్టెంబర్ 23న 'వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ద డెఫ్' అనే స్వచ్ఛంద సంస్థ స్థాపించబడింది. వినికిడి లోపం ఉన్న వ్యక్తుల హక్కుల పరిరక్షణ, సంజ్ఞా భాషల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఈ సంస్థ పునాది దినాన్ని పురస్కరించుకుని ఈ తేదీని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 7 కోట్ల కంటే ఎక్కువమంది చెవిటి లేదా వినికిడి లోపం ఉన్న ప్రజలు ఉన్నారు. ప్రతి దేశానికి మరియు సంస్కృతికి అనుగుణంగా అమెరికన్, బ్రిటీష్, ఇండియన్ సైన్ లాంగ్వేజెస్ వంటి స్వతంత్ర రూపాలు ఉనికిలో ఉన్నాయి. నేటి ఆధునిక ప్రపంచంలో కూడా సంజ్ఞా భాషల విస్తరణ మరియు వినియోగంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రధానం గా పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ సంజ్ఞా భాషా ఉపాధ్యాయులు పరిమితంగా ఉండటం విద్యావకాశాలను నియంత్రిస్తోంది. భారతదేశ విషయానికి వస్తే, 'ఇండియన్ సైన్ లాంగ్వేజ్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్' వంటి సంస్థలు 'ఇండియన్ సైన్ లాంగ్వేజ్' ను ప్రమాణీకరించడానికి, వ్యాప్తి చేయడానికి కృషి చేస్తున్నాయి. టివి వార్తలలో, ప్రభుత్వ కార్యక్రమాలలో సంజ్ఞా భాషా అనువాదకులను చేర్చడం శుభపరిణామ మే అయినప్పటికీ, ప్రాంతీయ భాషల్లో సముచిత శిక్షణ సదుపాయాలు, దైనందిన ప్రజాసేవలలో అనువాదకుల కొరత ఇప్పటికీ ప్రధాన సమస్యగా మిగిలిపోయింది. అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవం అనేది ప్రతి ఒక్కరి భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాల్సిన ఆవశ్యకతను గుర్తుచేసే పిలుపు. సాధారణ ప్రజలలో కూడా సంజ్ఞా భాష పట్ల ఉన్న అపోహలను తొలగించి, కనీస ప్రాథమిక సంకేతాలను నేర్చుకునేలా ప్రోత్సహించినప్పుడే వినికిడిలోపం ఉన్న వారితో సజావుగా కమ్యూనికేట్ చేయగల వాతావరణం ఏర్పడుతుంది. 'ఎవరినీ వెనుకబడనివ్వకూడదు' అనే దృక్పథంతో పనిచేసినప్పుడే నిజమైన సమ్మిళిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుం ది.

*(సెప్టెంబర్ 23 అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవం సందర్భంగా)*

సుధాకర్ ఏ.వి; 9000674747

# రష్యాపై ఆంక్షలతో భారత్‌ను బెదిరిస్తున్న అమెరికా

**అజద్ మీర్జా**

వాషింగ్టన్ 'రష్యా ఆంక్షల' చట్టంపై న్యూఢిల్లీ హెచ్చరిక సుంకాల వివాదానికి మించినది. ఇది వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, ఇంధన భద్రత, దేశ సరిహద్దుల వెలుపల నుంచి బెదిరింపులు లేకుండా విదేశాంగ విధానాన్ని నిర్వహించుకునే హక్కుకు ఒక రక్షణ. బీజింగ్ ఆచితూచి ప్రతిస్పందించిన తీరు ఒక పెద్ద పోటీని సూచిస్తుంది. యుద్ధం, వాణిజ్యం, చమురు ఒకచోట కలుస్తున్న తరుణంలో ఆసియా ఆర్థిక నిర్ణయాలను ఎవరు నిర్దేశిస్తారనేది ఆ పోటీ సారాంశం.

అమెరికా తన రష్యా విధానాన్ని ఒక విస్తృత ఆర్థిక బలప్రయోగ సాధనంగా మార్చే దిశగా మరింత ముందుకు కదిలింది. రష్యా నుంచి చమురు, గ్యాస్‌ను కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కట్టబెట్టే 'లిండ్సే ఓ. గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026'ను అమెరికా హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ ఆమోదించింది. 262–159 ఓట్ల తేడాతో ఆమోదం పొంది న ఈ బిల్లు, రష్యా ఇంధన, రక్షణ రంగాలను మాత్రమే కాకుండా, ఆంక్షలను తప్పించుకోవడానికి మాస్కోకు సహాయపడుతున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న దాని ట్యాంకర్‌ల 'రహస్య నౌకల'ను కూడా లక్ష్యంగా చేసుకుంది. భారతదేశానికి సంబంధించి ఈ శిక్షాత్మక సుంకం కారణంగా రష్యా ముడి చమురు ధర పెరుగుతుందా లేదా అనేది మాత్రమే ఇక్కడ సమస్య కాదు. న్యూఢిల్లీ ఇంధన విధానం, విదేశాంగ విధానం నిబంధనలను వాషింగ్టన్ నిర్దేశించగలదా లేదా అన్నదే అసలు ప్రశ్న. ప్రతిపాదిత చర్యలు ద్వైపాక్షిక సంబంధాలను ప్రభావితం చేయగలవని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. అదే సమయంలో, దేశం తన ఇంధన భద్రత, వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి 'అన్ని అవసరమైన చర్యలు' తీసుకుంటుందని కూడా స్పష్టం చేసింది. ఇందుకు ఉపయోగించిన భాషను చాలా జాగ్రత్తగా ఎంచుకున్నారు. ప్రతీకార చర్యలతో న్యూఢిల్లీని బెదిరించలేదు, వాషింగ్టన్‌తో సంప్రదింపులను కూడా తిరస్కరించలేదు. దానికి బదులుగా, ఈ వివాదాన్ని సార్వభౌమాధికారం పరిధిలోకి తీసుకువచ్చింది. ఉక్రెయిన్‌లో రష్యా చేస్తున్న యుద్ధానికి మద్దతుగా కాకుండా, జాతీయ అవసరాలు, మార్కెట్ పరిస్థితులు, సరఫరా లభ్యతను బట్టి మాత్రమే తాము చమురును కొనుగోలు చేస్తున్నామని భారతదేశం వాదిస్తోంది. దాని వైఖరి ఒక దీర్ఘకాలిక సూత్రాన్ని కూడా ప్రతిబింబిస్తుంది. ఒక దేశం అధికార పరిధికి మించి, ఆ దేశం విధించిన ఆంక్షలను యథాతథంగా స్వీకరించటాన్ని భారతదేశం అంగీకరించదు.

ఈ ప్రతిస్పందనలోని దృఢత్వానికి ఆర్థికపరమైన అంశాలే కారణం. 2026 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం ముడి చమురు దిగుమతులలో సుమారు 30.3 శాతం రష్యా నుంచే వచ్చాయి. వీటి విలువ దాదాపు 40.8 బిలియన్‌ల డాలర్లు. జులై మాసంలో భారతదేశం దిగుమతి చేసుకున్న ముడి చమురులో సగానికి పైగా రష్యా సరఫరాలు ఉన్నాయని, ఇది యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, వెనిజులా, బ్రెజిల్, ఒమన్, యునైటెడ్ స్టేట్స్ నుండి కలిపి వచ్చిన దిగుమతులను కూడా అధిగమించిందని నివేదికలు చెబుతున్నాయి. ఇలా ఆధారపడటం కేవలం వాణిజ్యపరమైనది మాత్ర మే కాదు. మధ్యప్రాచ్యం అంతటా సంఘర్షణ, రవాణా అంతరాయాలు, అస్థిరత నెలకొన్న తరుణంలో, రష్యా చమురు భారతీయ రిఫైనరీలకు తక్కువ ధరకు లేదా పోటీ ధరలకు ముడి చమురును పొందడంలో సహాయపడింది.

కాబట్టి, రష్యా సరఫరాలను భర్తీ చేయడం తక్షణమే జరిగేది కాదు, తక్కువ ఖర్చుతో కూడుకున్నదీ కాదు. సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యునైటెడ్ స్టేట్స్, బ్రెజిల్ లేదా వెనిజులా నుంచి భారతదేశం మరింత కొనుగోలు చేయవచ్చు, కానీ ప్రత్యామ్నాయ సరుకులు మరింత ఖరీదైనవిగా, తక్కువ విశ్వసనీయత కలిగినవిగా లేదా రవాణా ప్రమాదాలతో పరిమితమైనవిగా ఉండవచ్చు. హోర్ముజ్ జలసంధి ఒక కీలకమైన ఇంధన కారిడార్‌గా కొనసాగుతుండగా, పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణ ధరలు, షిప్పింగ్ బీమాపై అనిశ్చితిని పెంచింది. రష్యా దిగుమతులను బలవంతంగా తగ్గించడం భారతదేశంలో ఇంధనం, రవాణా, పారిశ్రామిక ఉత్పత్తి వ్యయాల ను పెంచవచ్చు.

దీని ప్రభావం చమురు మార్కెట్‌కు మించి విస్తరిస్తుంది. భారతీయ ఎగుమతిదారులు ఇప్పటికే అమెరికా వాణిజ్య చర్యల కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 100 శాతం సుంకం విధించడం వల్ల అమెరికా మార్కెట్ లో అనేక భారతీయ ఉత్పత్తులు వాణిజ్యపరంగా పోటీపడలేవు. ఇది వస్త్రా లు, ఇంజనీరింగ్ వస్తువులు, ఫార్మాస్యూటికల్స్, రసాయనాలు మరియు చిన్న తరహా తయారీ రంగాలపై ఒత్తిడిని పెంచుతుంది. దీని ఫలితంగా ఏర్పడే షాక్, ఇప్పటికే క్లిష్టంగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్య చర్చలను మరింత క్లిష్టతరం చేయడంతో పాటు, ఉపాధిని, ఎగుమతి ఆదాయాలను బలహీనపరుస్తుంది. విశ్లేషకులు ఈ ఆంక్ష ల చట్టాన్ని రష్యాను శిక్షించే ప్రయత్నంగానే కాకుండా, భారతదేశానికి వ్యతిరేకంగా ఒక బేరసారాల ఆయుధంగా కూడా వ్యాఖ్యానించారు.

ఇక్కడే ట్రంప్ అంశం ముఖ్యమవుతుంది.అంతర్జాతీయ సంబంధాల పట్ల ట్రంప్ వైఖరి సుంకాలను కేవలం వాణిజ్య రక్షణ సాధనాలుగా కాకుండా, ఒత్తిడి సాధనాలుగా పరిగణిస్తుంది. ఆయన ప్రభుత్వం ఈ చర్యను దేశీయం గా రష్యా యుద్ధానికి నిధులు సమకూర్చే ప్రభుత్వాలను శిక్షిం చే మార్గంగా ప్రదర్శించవచ్చు, అదే సమయంలో భారతదేశంపై ఉన్న బెదిరింపును ఉపయోగించి వాణిజ్యం, మార్కెట్ ప్రవేశం, ఇంధన కొనుగోళ్లపై రాయితీలను రాబట్టవచ్చు. ఈ చట్టం




ఒక సంప్రదింపుల ప్రయోజనానికి కూడా ఉపయోగపడవచ్చు. భారత్, అమెరికా దేశాలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చిస్తున్నప్పటికీ, సుంకాలు, వ్యవసాయరంగ ప్రవేశం, పారిశ్రామిక రక్షణ, నియంత్రణ ప్రమాణాల వంటి అంశాలపై విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. శిక్షాత్మక సుంకాలతో బెదిరించడం వల్ల, తక్కువ అనుకూలమైన నిబంధనలతో ఒప్పందాన్ని అంగీకరించేలా న్యూఢిల్లీపై ఒత్తిడి పెరిగే వాతావరణం ఏర్పడుతుంది. రష్యా సమస్యను ఒక సాకుగా చేసుకుని, భారత్ ను అసమాన వాణిజ్య ఒప్పందంలోకి బలవంతంగా నెట్టవచ్చని భారత వాణిజ్య విశ్లేషకులు వాదిస్తున్నారు.

ట్రంప్ లెక్కలు దేశీయ రాజకీయాలచే కూడా ప్రభావితం కావచ్చు. రష్యా పట్ల ఘర్షణ వైఖరి, ఉక్రెయిన్ యుద్ధంపై కఠినత్వాన్ని ప్రదర్శించాలనుకునే చట్టసభ సభ్యులను ఆకట్టుకుంటుంది. అదే సమయంలో, అమెరికా పరిశ్రమను రక్షించుకోవడానికి వాణిజ్య ఒత్తిడిని ఒక మార్గంగా చూసే ఓటర్లను సుంకాలు ఆకట్టుకుంటాయి. ఆంక్షలు, సుంకాలను కలపడం ద్వారా, ప్రభుత్వానికి ఒక సౌకర్యవంతమైన సాధనం లభిస్తుంది. అది గరిష్ట శిక్షను తప్పనిసరిగా విధించకుండానే, దాని ఆధారంగా బెదిరించగలదు, తద్వారా చర్చల ద్వారా పరిష్కారానికి ఆస్కారం ఉంటుంది. అయినప్పటికీ, ఈ విధానంలో ఒక వైరుధ్యం ఉంది. ఒక వేళ అమెరికా నిజంగా రష్యా చమురు ఆదాయాలను తగ్గించాలనుకుంటే, రష్యా ముడి చమురును వదులుకునేలా భారత్‌ను బలవంతం చేయడం ప్రపంచ సరఫరాకు అంతరాయం కలిగించి, ధరలను పెంచవచ్చు. రష్యా చమురు ను వినియోగించుకోగల కొనుగోలుదారులు భారతీయ రిఫైనరీలు మాత్రమే కాదు, భారతదేశం నుండి తరలివెళ్లిన ముడి చమురు ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాల ద్వారా సులభంగా రవాణా కావచ్చు. ఎగుమతుల పరిమాణం తగ్గినప్పటికీ, బ్యారెల్‌పై అధిక ప్రపంచ ధరలు మాస్కో ఆదాయాన్ని పెంచగలవు. ఈ ముప్పు రష్యాను నిర్ణయాత్మకంగా బలహీనపరచకుండానే అమెరికా మిత్రదేశాలను, వినియోగదారులను దెబ్బతీయవచ్చు.

చైనా ప్రతిస్పందన ఈ సంక్షోభానికి మరో కోణాన్ని జోడిస్తోంది. భారతదేశం కంటే రష్యా ఇంధనాన్ని భారతదేశం కంటే బీజింగ్ భారీగా కొనుగోలు చేస్తున్నప్పటికీ, చైనా వ్యాఖ్యానం బహిరంగంగా ఘర్షణపూరితంగా కాకుండా జాగ్రత్తగా ఉంది. ఆ సంయమనం ఒక వ్యూహాత్మక ఎత్తుగడను ప్రతిబింబిస్తుంది. విస్తృత వాణిజ్య ఘర్షణకు వాషింగ్టన్‌కు సులభమైన సమర్థన ఇవ్వడానికి చైనా ఇష్టపడటం లేదు, ప్రత్యేకించి దాని స్వంత ఆర్థిక వ్యవస్థ అమెరికా సుంకాలు, సాంకేతిక పరిమితులకు లోనవుతు న్న సందర్భాలలో... అదే సమయంలో, ఆసియా దేశాలు ఏ ఇంధన సరఫరాదారులను ఉపయోగించవచ్చో వాషింగ్టన్ నిర్ణయించగలదనే సూత్రాన్ని బీజింగ్ అంగీకరించే అవకాశం లేదు. చైనా అవలంభిస్తున్న జాగ్రత్త ఒక రకమైన వ్యూహాత్మక సహనంగా మారవచ్చు. అమెరికా గరిష్ట సుంకాన్ని వాస్తవంగా విధిస్తుందా, భారతదేశం ప్రతిఘటిస్తుందా లేదా చర్చలు జరుపుతుందా, రష్యాతో ఇంధన సంబంధాలు కొనసాగిస్తున్నప్పటికీ ఐరోపా దేశాలు మినహాయింపు లు పొందుతాయా అనే విషయాలను బీజింగ్ గమనించగలదు. ఏవైనా స్పష్టమైన ద్వంద్వ ప్రమాణాలు కనిపిస్తే, అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా నియమాల ఆధారిత వ్యవస్థను ఎంపికగా అమలు చేస్తున్నారనే చైనా వాదనకు అది మరింత బలం చేకూరుస్తుంది.

భారతదేశానికి, దీని భౌగోళిక రాజకీయ పరిణామా లు చాలా తీవ్రమైనవి. చైనా పట్ల ఉమ్మడి ఆందోళనలు, రక్షణ, సాంకేతికత, ఇండో–పసిఫిక్ రంగాలలో సహకా రం కారణంగా విస్తరించిన భారత్–అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఉన్న ఊపును ఈ వివాదం బలహీనపరచవచ్చు. వాషింగ్టన్ ఒత్తిడి న్యూఢిల్లీని ఒక ఇబ్బందికరమైన స్థితిలో ఉంచుతుంది. రష్యాతో స్వతంత్ర సంబంధాన్ని కొనసాగించినందుకు శిక్షకు గురవుతూనే, చైనాకు వ్యతిరేకంగా అమెరికాతో మరింత సన్నిహితంగా ఉండాలని దాని నుండి ఆశించబడుతోంది. ఈ వైరుధ్యం భారతదేశాన్ని కేవలం చమురు సరఫరాదారుల విషయంలోనే కాకుండా, చెల్లింపు వ్యవస్థలు, రవాణా ఏర్పాట్లు, రక్షణ భాగస్వామ్యాలు, దౌత్య సంబంధాలలో కూడా మరింత వైవిధ్యీకరణ వైపు నెట్టవచ్చు. ఇది రష్యాతో సహకారాన్ని బలోపేతం చేయగలదు, గల్ఫ్ ఉత్పత్తిదారులతో మరింత సన్నిహిత ఇంధన సమన్వయాన్ని ప్రోత్సహించగలదు, తీవ్రమైన ద్వైపాక్షిక ఉద్రిక్తతల మధ్య కూడా చైనాతో సంబంధాల కోసం కొత్త అవకాశాలను సృష్టించగలదు.

కేవలం వాషింగ్టన్ బెదిరించిందనే కారణంతో రష్యా చమురును భారతదేశం వదులుకునే అవకాశం లేదు. అలా చేస్తే కలిగే నష్టాలు తక్షణమే ఉంటా యి. అయితే దౌత్యపరమైన ప్రయోజనాలు అనిశ్చితంగానే ఉంటాయి. అయినప్పటికీ, రాయితీలు తగ్గినా, ఆంక్షల ప్రమాదాలు పెరిగినా లేదా ప్రత్యామ్నాయ సరఫరాలు మరింత పోటీతత్వంగా మారినా, న్యూఢిల్లీ క్రమంగా రష్యాపై తన ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చు. అటువంటి మార్పు మార్కెట్ ఆధారిత సర్దుబాటు అవుతుంది. సుంకాల ఒత్తిడితో తీసుకున్న నిర్ణయాన్ని చాలా భిన్నంగా చూస్తా రు. కాబట్టి, ఇక్కడ ప్రధాన సమస్య రష్యాకు భారతదేశం మద్దతు ఇస్తుందా లేదా అనేది కాదు. వాణిజ్యం, ఆర్థికం, ఆంక్షలు నానాటికీ ఆయుధాలుగా మారుతున్న ఈ యుగంలో, ఒక ప్రధాన శక్తి తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడుకోగలదా లేదా అన్నదే అసలు విషయం. ట్రంప్ సుంకాల బెదిరింపు, భారతదేశపు ఇంధన ఆధారపడటాన్ని అమెరికా కు ఒక బలం చేకూర్చే సాధనంగా మార్చాలని చూస్తోంది. భారతదేశం ప్రతిస్పందన రాజకీయ విధేయతగా మారకుండా నిరోధించాలని చూస్తోంది. దీని ఫలితం కేవలం ముడి చమురు ధరను మాత్రమే ప్రభావితం చేయదు. ఇది విచ్ఛిన్నమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సార్వభౌమాధికార సరిహద్దులను నిర్వచించడంలో సహాయపడుతుంది. ఆసియా శక్తులు ఆర్థికంగా వాషింగ్టన్‌కు కట్టుబడి ఉంటూనే స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలవా లేదా అనే విషయాన్ని నిర్ధారిస్తుంది.

# కమ్యూనిస్టుల ఐక్యత సాధ్యమే

ఈ మధ్య కమ్యూనిస్టుల ఐక్యత గురించి ఉభయ తెలుగు రాష్ట్రాలలో విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. కమ్యూనిస్టుల ఐక్యత కొరకు వ్యక్తులు, సంస్థలు, ప్రత్యేకంగా మేధావులు, సామాజిక కార్యకర్తలు తీవ్రంగా కృషి చేస్తున్నారు. జరుగుతున్న ఈ ప్రయత్నాలను చూసి సామాన్య ప్రజలు, కమ్యూనిస్టు అభిమానులు, అభ్యుదయవాదులు సంతోషిస్తున్నారు.

ఈ మంచి ప్రయత్నాలను చులకన చేస్తూ, అవహేళన చేస్తూ, వ్యతిరేకిస్తూ కొందరు మాట్లాడుతూనే ఉన్నారు. వారంతా సహజంగానే కమ్యూనిస్టుల ఐక్యతకు వ్యతిరేకులు, అభివృద్ధి నిరోధకులు, బూర్జువా వర్గ ఆలోచనలు కలిగిన వారు. వారు పాత చింతకాయ పచ్చడి లాగా బూజు పట్టిన వాదనలను మళ్లీమళ్లీ చెప్తూనే ఉంటారు.

మనుషులందరి మధ్య అంతరాలు అంతం కావడం అసాధ్యమని, కులాలు అంతరించడం జరగదని, ధనిక – పేద వర్గాలు ఉండటం సహజమని తమ ప్రచారం కొనసాగిస్తూనే ఉంటారు. దేశంలో చీలిన కమ్యూనిస్టు పార్టీలు కలవడం అసాధ్యమని, ప్రపంచ కార్మికులంతా ఐక్యమవుతారని మార్క్స్ చెప్పడం కూడా కేవలం ఊహాజనితమైనదేనని చెప్పేవారు నిరంతరం తారసపడుతూనే ఉంటారు. అనేక రుగ్మతలతో నిండి ఉన్న సమాజం మారాలని కృషి చేసే సామాజిక ఉద్యమకారులను, అభ్యుదయవాదులను నిరుత్సాహపరచడానికి వారి ప్రయత్నం వారు నిరంతరం చేస్తూనే ఉంటారు; గతంలో చేశారు, భవిష్యత్తులో కూడా చేస్తారు.

ప్రకృతి సూత్రాల ననుసరించి అయినా, సామాజిక నియమాల ప్రకారమైనా సమాజం నిశ్చలంగా, స్తబ్దతతో ఉండదు. నిరంతరం చలనంలో ఉండటం, మార్పు చెందడం సహజం. మార్క్సిస్టు మహోపాధ్యాయులైన మార్క్స్, లెనిన్, మావోలు చెప్పింది ఇదే. భారతదేశ ప్రజల సమస్యలైన పేదరికం, అంటరానితనం, కులవివక్షలు, ప్రజల మధ్య ఉన్న అంతరాలు శాశ్వతంగా ఉండవని, మార్పు రాక తప్పదని సామాజిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అదేవిధంగా ప్రపంచ కార్మికులు ఐక్యమవుతారని, చీలికలు పేలికలైన భారత కమ్యూనిస్టులు కలవక తప్పదని గతితార్కిక సిద్ధాంతం స్పష్టపరుస్తుంది. అదెలానో చూద్దాం.

పేదరికానికి కారణం వర్గ సమాజం. ధనిక, పేద వర్గాలు కొనసాగినంతకాలం పేదరికం ఉంటుంది. ఈ వర్గాలు ఉన్నంతకాలం, వీటి మధ్య ఘర్షణ అనివార్యం. వీటి మధ్య సామరస్యం సాధ్యం కాదు; సామరస్యం ఉందంటే ఏదో ఒక వర్గం ఆధిపత్యం వహిస్తున్నట్లే. ఇప్పటికే ఆధిపత్యం చేయగలిగే సంపన్న వర్గాలు మాత్రమే ఆధిపత్యం చేయగలుగుతాయి. కాని దోపిడీ వర్గాలు చేసే దోపిడీని, దోపిడీకి గురయ్యే వారు ఎంతోకాలం భరించరు. కాబట్టి ఈ రెండు వర్గాల్లో ఒకరు లాభపడితే ఇంకొకరు నష్టపోక తప్పదు. కాలక్రమేణా దోపిడీకి గురయ్యే శ్రామిక వర్గాలు తమ అనుభవాల ద్వారా తమకు జరుగుతున్న అన్యాయాలను తెలుసుకుంటారు. వివిధ తరగతులుగా విడిపోయిన పేద వర్గాలు తమ మధ్య ఉన్నవి శత్రు వైరుధ్యాలు కావు, మిత్రభేదాలే అని గుర్తించి ఐక్యమవుతారు. కాబట్టి దోపిడీ చేసేవారికి, దోపిడీకి గురయ్యే వారికి ఘర్షణ అనివార్యం అవుతుంది. చైతన్యవంతమైన శ్రామికుల సంఖ్య దోపిడీ వర్గాల కంటే అనేక రెట్లు ఎక్కువగా ఉండటం వలన, శ్రామిక వర్గాలు, దోపిడీ వర్గాలు ఘర్షించుకుంటే శ్రామికులే గెలుస్తారు.

అదేవిధంగా కుల పీడితులుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసిలు కూడా నెమ్మది నెమ్మదిగా అగ్రకుల ఆధిపత్యాన్ని అర్థం చేసుకుంటారు. ఎస్సీల మధ్యలో ఉన్నది మిత్రభేదమేనని, ఎస్సీలకు బిసిలకు మధ్యలో ఉన్నది మిత్రభేదమేనని, బిసిల మధ్యలో ఉన్నది మిత్రభేదమేనని క్రమంగా అర్థం చేసుకుంటారు. తమ మధ్య ఉన్నవి శత్రు వైరుధ్యాలు కావు అని తెలుసుకుంటారు. ఈ బ్రాహ్మణీయ మనువాద అన్యాయాన్ని, దోపిడీని, అవమానాలను గుర్తిస్తారు. మెజారిటీగా ఉన్న ఈ వర్గాలు కచ్చితంగా అగ్రకులాధిపత్యాన్ని, కుల వివక్షను, అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాలు నిర్వహిస్తారు. కుల నిర్మూలనకు బాటలు వేసుకుంటారు. ఈ పరిణామాన్ని ఎవరు ఆపలేరు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పీడితుల మధ్య ఉండేవి శత్రు వైరుధ్యాలు కావు. వివిధ దేశాల మధ్య ఉండే కార్మిక వర్గాల మధ్య ఘర్షణ అనివార్యం కాదు. వారి మధ్య వాటాల పంచాయతీ ఉండదు, లాభాల పంచాయతీ ఉండదు. ఒక దేశ కార్మిక వర్గాన్ని మరో దేశ కార్మిక వర్గం దోపిడీ చేయలేవు. వివిధ దేశాలలో ఉండే దోపిడీ వర్గాల మధ్య ఐక్యత ఉంటుంది. వివిధ దేశాల కార్మిక వర్గాల మధ్య కూడా ఐక్యతకు ఆటంకాలు ఏముండవు; కృత్రిమంగా సృష్టించబడినా, అవి తాత్కాలికమే. ప్రపంచ కార్మికుల మధ్య ఐక్యత శాశ్వతం, అనైక్యత తాత్కాలికం. అందుకే మార్క్స్ 'ప్రపంచ కార్మికులంతా ఐక్యమవుతారు' అని అన్నది. అది ఊహాజనితమైంది కాదు, ఆచరణాత్మకమైనదే.

భారత కమ్యూనిస్టులు విలీనం కాలేరనేది కూడా అశాస్త్రీయమైనదే, గతితర్కానికి నిలవదు. కమ్యూనిస్టు పార్టీలన్నీ శ్రామిక వర్గానికి ప్రతినిధులే. శ్రామిక వర్గాల మధ్య ఉండే వైరుధ్యం లేదా కల్పించబడేది కృత్రిమమైనదే. ఒక కమ్యూనిస్టు పార్టీ వెనుకనున్న శ్రామిక వర్గానికి, మరో కమ్యూనిస్టు పార్టీని అనుసరిస్తున్న శ్రామిక వర్గానికి మధ్య ఉండేది శత్రుత్వ వైరుధ్యం కాదు. ఆ శ్రామిక వర్గానికి నాయకత్వం వహిస్తున్న కమ్యూనిస్టు పార్టీల మధ్య ఉన్నది కూడా శత్రు వైరుధ్యం కాదు. కమ్యూనిస్టు పార్టీలకు, బూర్జువా పార్టీలకు మధ్య ఉండేది మాత్రమే శత్రు వైరుధ్యం. శ్రామిక వర్గ పార్టీల మధ్య ఉండే వైరుధ్యం మిత్రుత్వపూర్వకమైనది. శ్రామిక వర్గాల మధ్య సృష్టించబడే వైరుధ్యం సరైంది కాదని కార్మికులు తమ అనుభవంలో తెలుసుకుంటారు; కార్మిక వర్గాలకు నాయకత్వం వహించే కమ్యూనిస్టు పార్టీలు కూడా తెలుసుకుంటాయి. అందువల్ల అవి అనివార్యంగా కలుస్తాయి. ఈ క్రమాన్ని ఎవరూ ఆపలేరు. కమ్యూనిస్టు పార్టీల మధ్య ఉన్నవి శత్రు వైరుధ్యాలయితే ఎవరైనా ఈ ప్రయత్నం చేయడం వృధా ప్రయాస. కమ్యూనిస్టు పార్టీల మధ్య ఉన్నవి కేవలం మిత్రభేదాలు కాబట్టి కమ్యూనిస్టులు విధిగా, తప్పకుండా విలీనమవుతారు.

గతంలో కమ్యూనిస్టు పార్టీల మధ్య ఏమాత్రం సఖ్యత లేని పరిస్థితి ఉండేది. ప్రతి పార్టీ మరో పార్టీ పట్ల శత్రువైఖరి కలిగి ఉండేది, ఘర్షణలు చోటు చేసుకునేవి, హత్యలు కూడా జరిగాయి. ఈ మధ్యకాలంలో చాలా సానుకూలమైన మార్పులు వస్తున్నాయి. సిపిఎం, సిపిఐ లు గత కొంతకాలం నుండి ఈ ప్రయత్నాలు చేస్తున్నాయి. నక్సలైట్ పార్టీలు కూడా విడివిడిగా ఉన్నవి దగ్గరవుతున్నాయి. దేశవ్యాప్తంగా సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, ఆర్‌ఎస్‌పి, ఫార్వర్డ్ బ్లాక్, వామపక్ష పార్టీలతో సమన్వయ కమిటీ ఉన్నది. ఈ మధ్యకాలంలో కొన్ని నక్సలైట్ పార్టీలు విలీనం కూడా అయ్యాయి. తెలంగాణ రాష్ట్రంలో పదికి పైగా కమ్యూనిస్టు పార్టీలు నిరంతరం సమస్యలపై కలిసి పనిచేస్తూ ఉన్నాయి.

కలిసి పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీల మధ్య ఒక సంకీర్ణ రూపం ఏర్పడాల్సిన అవసరం ఉంటుంది. ఈ ప్రయత్నాలన్నింటి అంతిమ లక్ష్యం విలీనం కావాలి. అప్పుడే కమ్యూనిస్టులు, ఇతర పూలే అంబేద్కర్ వాదులతో మరియు ఇతర వామపక్ష, అభ్యుదయ, లౌకిక, ప్రజాతంత్ర శక్తులతో కలిసి ఒక ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను ఏర్పాటు చేయడానికి మార్గం సుగమం అవుతుంది.

ఈ సందర్భంగా లెనిన్ 'ఏమి చేయాలి?' అనే పుస్తకంలో చెప్పిన స్పృహ/ప్రయత్నపూర్వకత (consciousness), యాదృచ్ఛికత (spontaneous) అనే అంశాలను సదా మననం చేసుకోవడం అవసరం. దేనిని సాధించాలన్నా యాదృచ్ఛికాలపై ఆధారపడకూడదు, ప్రయత్నపూర్వకంగా జరగాలి. కమ్యూనిస్టుల ఐక్యతను చిత్తశుద్ధితో కాంక్షించేవారెవరైనా మాటలతో చెప్పడానికి పరిమితం కాకుండా ఆచరణలో చూపించాలి. ఆచరణను బట్టే వారికి కమ్యూనిస్టుల ఐక్యత పట్ల ఉన్న చిత్తశుద్ధిని అంచనా వేయాలి. నిర్దిష్టమైన కార్యక్రమం, సమయం ఏర్పాటు చేసుకొని, ప్రయత్నపూర్వకంగా (conscious) కృషి చేస్తేనే పునరేకీకరణ సాధ్యం.

ప్రపంచ కార్మికులంతా ఐక్యమవుతారని మార్క్స్ చెప్పింది, భారత కమ్యూనిస్టులంతా విలీనం అవుతారని కమ్యూనిస్టు అభిమానులు, అభ్యుదయవాదులు, మేధావులు కోరేది గతితార్కిక సూత్రాలకు భిన్నం కాదని అర్థం చేయించాల్సిన అవసరం ఉంది. ఈ విషయాలను కూడా దృష్టిలో పెట్టుకొని కమ్యూనిస్టుల ఐక్యత కొరకు పనిచేస్తున్న వ్యక్తులు, సంస్థల కృషి జయప్రదం కావాలని కోరుకుందాం. మనసుంటే మార్గం ఉంటుంది. కమ్యూనిస్టులకుండే విమర్శ, ఆత్మవిమర్శ ఆయుధం చాలా బలమైనది. గత పొరపాట్లను విశ్లేషించుకుని కమ్యూనిస్టులందరూ ఒకే వేదిక పైకి వచ్చి, సరైన విధానాలను సకాలంలో తీసుకోగలిగితే కమ్యూనిస్టుల ఐక్యత సాధ్యమే. తమ స్వప్రయోజనాల కోసం, లాభాల కోసం పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు విలీనం కావడాన్ని గమనిస్తున్న కమ్యూనిస్టు నాయకులు తమ విలీనం ఎంత అవసరమో అర్థం చేసుకుంటారని ఆశించవచ్చు. కమ్యూనిస్టుల విలీనం జరగాలని, జరుగుతుందని ఆశిద్దాం.

**జి.రాములు,** 9490098006

### స్కిల్ యూనివర్సిటీలో

# గ్లోబల్ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు



- అక్టోబర్ 31లోగా అన్ని పనులు పూర్తి చేసి సమ్మిట్ బృందానికి అప్పగింత
- 54 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో యూనివర్సిటీ అభివృద్ధి
- ఫిబ్రవరి నాటికి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు : మంత్రి వివేక్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫ్యూచర్ సిటీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్–ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు స్కిల్ యూనివర్సిటీ వేదిక కానుండటంతో అక్కడ ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు సమ్మిట్‌ను స్కిల్ యూనివర్సిటీ ప్రాంగణంలోనే నిర్వహించేందుకు అవసరమైన మౌలిక వసతులు, సమావేశ మందిరాలు, రహదారులు, డ్రైనేజీ తదితర పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. సమ్మిట్ ఏర్పాట్లపై మంత్రి మంగళవారం యూనివర్సిటీలో అధికారులతో, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతి, అవసరమైన మెటీరియల్, మ్యాన్‌పవర్, వివిధ నిర్మాణ పనుల షెడ్యూల్‌పై సమగ్రంగా చర్చించారు. అక్టోబర్ 31లోగా సమ్మిట్‌కు అవసరమైన అన్ని పనులను పూర్తి చేసి ఈవెంట్ మేనేజ్‌మెంట్ బృందానికి అప్పగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. సమ్మిట్ ప్రారంభానికి ముందే ఈవెంట్ మేనేజ్‌మెంట్ బృందానికి తగినంత సమయం లభించేలా పనులను ముందుగానే పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. సమ్మిట్‌లో వివిధ సమావేశాలు, సెమినార్లు, చర్చలు నిర్వహించేందుకు భారీ స్థాయిలో వసతులు కల్పిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇందులో భాగంగా ఆరు సెమినార్ హాళ్లను సిద్ధం చేస్తున్నామని, వీటికి అదనంగా మూడు పెద్ద హాళ్లు, మరో పది చిన్న హాళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. సమ్మిట్ సందర్భంగా నిర్వహించే వివిధ కార్యక్రమాలకు అనుగుణంగా వీటిని వినియోగించనున్నట్లు చెప్పారు.

సమ్మిట్ కోసం చేపడుతున్న నిర్మాణాలు కేవలం కార్యక్రమం వరకే పరిమితం కాకుండా భవిష్యత్‌లో స్కిల్ యూనివర్సిటీకి శాశ్వతంగా ఉపయోగపడేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సమ్మిట్ ముగిసిన అనంతరం నిర్మించిన భవనాలు, మౌలిక వసతులను యూనివర్సిటీకి అప్పగిస్తామని వెల్లడించారు. 54 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో స్కిల్ యూనివర్సిటీని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. యూనివర్సిటీ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం చేపడుతున్న పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల కోసం బాయ్స్ హాస్టల్, గరల్స్ హాస్టల్, డైనింగ్ హాల్‌తో పాటు ఇతర మౌలిక వసతుల నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయని వివరించారు. స్కిల్ యూనివర్సిటీలో వచ్చే ఫిబ్రవరి నాటికి కార్యకలాపాలు ప్రారంభించేలా పనులను వేగవంతం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ కోసం ప్రస్తుతం జరుగుతున్న ఏర్పాట్లు పూర్తయిన తర్వాత కూడా అవి తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహానికి ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.

# యుపిఐపై చార్జీలు ఉపసంహరించుకోవాలి

సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి. నరసింహ

కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ర్యాలీ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యుపిఐ లావాదేవీలపై చార్జీలు విధించే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నరసింహ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి వై జంక్షన్ వరకు నల్ల దుస్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇ.టి. నరసింహ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నల్లధనం వెనక్కి తీసుకురావడం, ధరలను నియంత్రించడం వంటి అనేక హామీలు ఇచ్చిందన్నారు. అయితే గత 12 ఏళ్లుగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతూ సామాన్య ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. నగదు లావాదేవీలకు స్వస్తి పలికి డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించిన కేంద్రం, యూపీఐ చెల్లింపులకు ఎలాంటి చార్జీలు ఉండవని గతంలో చెప్పిందన్నారు. ఇప్పుడు యూపిఐపై చార్జీలు విధించే ప్రతిపాదన తీసుకురావడం ప్రజలపై పరోక్ష భారానికి దారితీస్తుందని అన్నారు. వ్యాపారులు అదనపు చార్జీలను తమ లాభాల నుంచి భరించకుండా వస్తువుల ధరల రూపంలో వినియోగదారులపై మోపే అవకాశం ఉందన్నారు. యూపిఐ నిర్వహణ కోసం కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నప్పుడు చార్జీలు విధించాల్సిన అవసరం ఏమొచ్చిందో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలకు అవసరమైన డిజిటల్ చెల్లింపు సేవలను అందించేందుకు ప్రభుత్వం ఆ స్వల్ప మొత్తాన్ని భరించలేదా అని ప్రశ్నించారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రజా సేవా రంగాలను ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మత రాజకీయాల ముసుగులో ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడం ఎక్కువకాలం సాధ్యం కాదని, ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఉపసంహరించుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తీసుకురావాలని ఇ.టి. నరసింహ కోరారు. ఈ ర్యాలీలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి, సీనియర్ నాయకులు పి. ప్రేమ్ పావని, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, ఎటియుసి రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటేశం, తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.చంద్రమోహన్ గౌడ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్,జిల్లా కార్యవర్గ సభ్యులు పడాల నళిని, కాంపల్లి శ్రీనివాస్ ఉమర్ ఖాన్, పార్టీ నాయకులు జైపాల్ రెడ్డి,ప్రవీణ్, రాజ్ కుమార్, పి.వెంకటయ్య,బొడ్డుపల్లి కిషన్, చెట్టుకింది శ్రీనివాస్, గ్యార నరేష్, బాలకృష్ణ, మహమూద్, కళ్యాణ్, అనిల్, షబ్బీర్, ఉదయ్, కృష్ణ, నరసింహ, రమేష్, భాను, తదితరులు పాల్గొన్నారు.



### గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదులో

## సిఇసి అశాస్త్రీయ విధానాలు

బిఆర్ఎస్ ఆరోపణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదులో కేంద్ర ఎన్నికల కమిషన్ విధానాలు అశాస్త్రీయమని బిఆర్ఎస్ ఆరోపించింది. బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఎల్. రమణ, దాసోజు శ్రవణ్,మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్‌తో కూడిన ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ) సుదర్శన్ రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరుగా నమోదు చేసుకునేందుకు (ఫారం18 సమర్పణకు) నవంబర్ 6వ తేదీ తుది గడువుగా విధించడం హాస్యాస్పదమన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రకారం ఫైనల్ ఎలక్టోరల్ రోల్ నవంబర్ 20 న ప్రచురితమవుతుందని, తుది ఓటరు జాబితా రాకముందే, పోలింగ్ స్టేషన్, పార్ట్ నంబర్, ఎపిక్ నంబర్ల వివరాలు తెలియకుండా, ఫారం 18 ఎలా సమర్పించాలని ఆయన ప్రశ్నించారు. ఈఅంశాన్ని తాము రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిదృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని, ఈ అంశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చినట్టు దాసోజు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఐఆర్ విచారణ ప్రక్రియ ఒక తూతూ మంత్రంగా సాగుతోందని, సరైన ప్రకటనలు, స్పెషల్ క్యాంపెయిన్లు లేకపోవడంతో దాదాపు 90 లక్షల ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 82 లక్షల మందిలో కేవలం 38 లక్షల మంది మాత్రమే విచారణకు హాజరయ్యారన్నారు. స్వయంగా సిఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే నోటీసులు తీసుకున్న వారిలో ఏకంగా 96 శాతం మంది విచారణకు గైర్హాజరవ్వడం సీఎం అసమర్థతకు, ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ఎద్దేవా చేశారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ఓటర్ల నమోదు ప్రక్రియపైన ప్రత్యేక దృష్టి సారించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధత అంశంపైన ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మంగళవారం కెటిఆర్, బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం సాధిస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఉమ్మడి జిల్లాల వారీగా కార్యాచరణ రూపొందించాలని, త్వరలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల సన్నద్ధతపై మరింత చర్చించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో పెచ్చులు ఊడి గాయపడిన రోగులను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడం దారుణమని కెటిఆర్ అన్నారు. వినయ్ భాస్కర్‌పైన జరిగిన దాడికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని, ఈ ఘటనపై సమాధానం చెప్పాల్సింది ముఖ్యమంత్రి, హోంమంత్రినే అని అన్నారు. ప్రజాప్రతినిధుల హక్కులను, ప్రజలను పరామర్శించే హక్కును ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం విఫలం : హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ పూర్తి సామర్థ్యం 4 వేల మెగావాట్లకు గాను కేవలం 400ల మెగావాట్లను మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన జర్నలిస్టులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. యాదాద్రికి జీ10, జీ11 క్వాలిటీ కోల్ కావాలని, కానీ జీ13,జీ14 క్వాలిటీ కోల్ వాడుతున్నారని, బొగ్గు వాడకంలో నాణ్యతా లోపం ఉన్నదని ఆరోపించారు. కొత్తగూడెంలో 800 మెగావాట్లు, భద్రాద్రిలో 540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఆగిందని ఆయన తెలిపారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉంటే ప్రస్తుతం బొగ్గు కొరత ఎందుకు ఏర్పడుతుందని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఎన్.టి.పి.సి ద్వారా తెలంగాణ రాష్ట్రానికి 1600 మెగావాట్ల విద్యుత్ ఇస్తామని హామీనిచ్చారని, ఇందులో భాగంగానే తొలివిడతగా తమ ప్రభుత్వంలో 800 మెగావాట్ల కేంద్రాన్ని స్థాపించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. కెసిఆర్ ప్రభుత్వం ఇచ్చిన విద్యుత్ ఉత్పత్తిలో 3వ వంతును కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులకు 7 నుంచి 8 గంటలు కరెంటును కూడా ఇవ్వడం లేదన్నారు. ఏపీ సీఎం శ్రీశైలం నుంచి 700 కిలోమీటర్లు కృష్ణా నదీ జలాలను తీసుకెళ్తున్నారని, బేసిన్‌లోనే ఉన్న ప్రాజెక్టులకు సిఎం రేవంత్ రెడ్డి నీళ్లను తీసుకెళ్లడం లేదని ఆరోపించారు.

# దళితుల ఆత్మగౌరవానికి భంగం కలిగితే సహించం

మంత్రి అడ్లూరి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దళితులు, గిరిజనుల ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఎలాంటి ఘటనలనూ సహించబోమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఎస్‌సి, ఎస్‌టిల హక్కుల పరిరక్షణ, సమానత్వం, భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటి కేసులకు సంబంధించి సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం అనంతరం సచివాలయంలో కాంగ్రెస్ ఎంపీల ఫోరం చైర్మన్ డాక్టర్ మల్లు రవి, ఎంపి బలరాం నాయక్, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, వెడ్మ బొజ్జు, డాక్టర్ మట్టా రాగమయి, మురళీ నాయలతో కలిసి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 7,563 ఎస్‌సి, ఎస్‌టిఅట్రాసిటీస్ కేసులు నమోదు కాగా ఆ కేసుల్లో బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం, ఇతర సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చెప్పారు. పరిహారం విడుదలను బడ్జెట్ ప్రక్రియతో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానల్ ద్వారా సత్వరమే అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కేసుల దర్యాప్తు, విచారణలో జాప్యం లేకుండా చూడాలని, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా పోలీసు, సంక్షేమ, న్యాయ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్‌సి,ఎస్‌టిఅట్రాసిటీస్ చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరగగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఇలాంటి రాష్ట్ర స్థాయి ఉన్నతస్థాయి సమావేశం జరగడం ఇదే తొలిసారి అని తెలిపారు.చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరుపైనా సమావేశంలో చర్చించినట్లు చెప్పారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించిన రాష్ట్ర స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఎందుకు నిర్వహించలేదని మంత్రి ప్రశ్నించారు. దళితులు కోరుకునేది ఆత్మగౌరవం, సమానత్వం, భద్రత అని.. ఈ ప్రభుత్వం దళిత, గిరిజన వర్గాలకు అండగా ఉంటుందని అన్నారు. ప్రతిపక్ష నేత కెసిఆర్ ఫామ్ హౌస్ వద్ద దళితులు నిరసన వ్యక్తం చేస్తే ఆ ప్రదేశాన్ని పసుపు నీటితో శుద్ధి చేసిన ఘటనపై కఠిన చర్యలు తీసుకునేలా సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని మంత్రి తెలిపారు.

## దసరాకు ముందే కొత్త పెన్షన్‌లు

అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కొత్త సామాజిక భద్రతా పెన్షన్‌ల పంపిణీని దసరా పండుగకు ముందే ప్రారంభించేలా అన్ని చర్యలను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసుయ సీతక్క అధికారులను ఆదేశించారు. అక్టోబర్ నెలలోనే కొత్త పెన్షన్‌ల పంపిణీ ప్రారంభమయ్యేలా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారుల చేతికి పండుగకు ముందే పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త పెన్షన్‌ల మంజూరు ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా క్షేత్రస్థాయి పరిశీలనను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. పరిశీలన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సెర్ప్ సిఈఓ దివ్యా దేవరాజన్‌కు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి దరఖాస్తుల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కొత్త పెన్షన్‌ల మంజూరులో ఒంటరి మహిళలు, వితంతువులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదలు ఎవరూ నష్టపోకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. దసరా నాటికి కొత్త పెన్షన్‌ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి పెన్షన్ అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## భూకబ్జాలపై బిఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బాల్మూరి వెంకట్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో భూముల వ్యవహారంపై బిఆర్ఎస్ నేతలు తమపై ఆరోపణలు చేయడం కంటే, గతంలో వారు అధికారిక ఎన్నికల అఫిడవిట్లలో చూపించిన ఆస్తులపై ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బాల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు నాలుగు రోజులుగా నిర్వహించిన క్షేత్ర స్థాయి పర్యటనలతో బీఆర్ఎస్ నేతల భూముల వ్యవహారాలు వెలుగులోకి రావడంతోనే ఆ పార్టీ నేతలకు భయం పట్టుకుందని విమర్శించారు. సిఎల్‌పి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బాల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ నేతల ఎన్నికల అఫిడవిట్లలోనే వందల ఎకరాల భూములు ఉన్నట్లు వెల్లడవుతున్నాయని, ఇక వెల్లడించని భూములు, బినామీల పేర్లలో ఉన్న ఆస్తులు ఎన్ని ఎకరాలో చెప్పాలని ప్రశ్నించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ నేతలు తెలంగాణతో పాటు పక్క రాష్ట్రాల్లోనూ భూములు సమకూర్చుకున్నారని ఆరోపించారు.దళితులకు మూడెకరాల భూమి ఇవ్వడానికి ముందుకు రాని బిఆర్ఎస్ నేతలు వందల ఎకరాల భూములను ఎలా సమకూర్చుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. హరీశ్‌రావు ఆస్తులు 2009, 2014 ఎన్నికల అఫిడవిట్లతో పోలిస్తే 2023 నాటికి ఎలా పెరిగాయో ప్రజలకు వివరించాలని కోరారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్టలో మాజీ సైనికులకు కేటాయించిన భూముల విషయంలోనూ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.రంగనాయకసాగర్ ప్రాజెక్టు భూసేకరణ, పరిహారం, అనంతరం భూముల కొనుగోలు, ఫామ్‌హౌస్ నిర్మాణానికి సంబంధించి పలు ప్రశ్నలు ఉన్నాయని బాల్మూరి వెంకట్ పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్, దేవాదాయ, ఎఫ్‌టిఎల్, ఇనాం భూముల విషయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన వ్యవహారాలపై సమగ్రంగా సమాధానం చెప్పాల్సిన బాధ్యత బిఆర్ఎస్ నేతలపై ఉందన్నారు. కెటిఆర్ జన్వాడ ఫామ్‌హౌస్ విషయంలోనూ ఆయనపై ప్రశ్నలు సంధించారు. 2023 ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన భార్య పేరుతో జన్వాడలో భూమి ఉన్నట్లు పేర్కొన్న అంశంపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

### కాంగ్రెస్ నాయకులు వెళ్లాల్సింది

## ఫామ్‌హౌస్‌ల వద్దకు కాదు...

ఎండిపోయిన పంటలను ఎందుకు పరిశీలించడం లేదు? : జగదీష్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ నాయకులు వెళ్లాల్సింది ఫామ్‌హౌస్‌ల వద్దకు కాదని, ప్రజల సమస్యల వద్దకు వెళ్లాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే జి.జగదీష్ రెడ్డి అన్నారు. ఫామ్‌హౌస్ వద్దకు వెళ్తున్న వారు ఎండిపోయిన పంటలను ఎందుకు పరిశీలించడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు షాబాద్ మండలం మద్దూరు అనే గ్రామంలో భూమి ఉందని అఫిడవిట్‌లో పొందుపర్చానని, తనకు ఎయిర్ పోర్టు పక్కనే విలువైన భూములు ఉన్నాయని మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని, తమను అసెంబ్లీకి రాకుండా అడ్డుకున్నారని ఆరోపించరు. తాము ఎప్పుడో ఎన్నికల అఫిడవిట్ లో పెట్టిన అంశాలను మాట్లాడి, ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. కృష్ణా, గోదావరి కింద రైతులకు సాగు నీరు ఇవ్వడం లేదని మండిపడ్డారు. అనుమతి లేకుం డా ప్రయివేటు వ్యక్తుల ఇళ్లల్లోకి వెళ్లవద్దనే విష యం తెలియదా? అని ప్రశ్నించారు. వ్యక్తుల భూముల్లోకి వెళ్లి విచారణ చేసే హక్కు ఎవరిచ్చారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌పై దాడి చేసిన పోలీసులపై డిజిపి వెంటనే చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. అత్యుత్సాహంతో విర్రవీగే పోలీసులపై అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా చర్యలు తీసుకుంటామని, ఎవరిని వదిలి పెట్టబోమని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. జూరాలలో 9 టిఎంసీల నీళ్లు ఉన్నప్పటికీ రైతులకు సాగు నీరు ఇవ్వడం లేదని మండిపడ్డారు.

## ‘ఒబిసి కాలమ్’పై మౌనం వహిస్తే బిసి ద్రోహులే

అక్టోబర్ 4న పాలమూరు నుంచి బిసిల పోరుబాట

నవంబర్‌లో రామ్‌లీలా మైదానంలో లక్ష మందితో బిసి కులగణన గర్జన



**ప్రజాపక్షం/ హైదరాబాద్:** ప్రస్తుతం జరుగుతున్న జనగణన ప్రశ్నావళిలో ఒబిసి కాలమ్ చేర్చాలని దేశవ్యాప్తంగా బిసిలు డిమాండ్ చేస్తున్నా.. రాజకీయ పార్టీల అధినేతలు స్పందించకపోవడం బాధాకరమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బిసిల డిమాండ్లపై మాట్లాడని, పోరాడని రాజకీయ పార్టీలను, వాటి నాయకులను బిసి ద్రోహులుగా ప్రకటిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని బిసి భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20న హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ ఒబిసి సదస్సులో తీసుకున్న తీర్మానాలను వెల్లడించారు. దేశంలోని 22 రాష్ట్రాల నుంచి ఒబిసి సంఘాల ప్రతినిధులు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బిసి సంఘాల నాయకులు, కుల సంఘాలు, ఉద్యోగ, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రొఫెసర్లు, మేధావులు సదస్సులో పాల్గొన్నారని తెలిపారు.ఒబిసి కాలమ్ చేర్చాలనే ప్రధాన డిమాండ్‌తో గల్లీ నుంచి ఢిల్లీ వరకు బిసిల పోరుబాట నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా అక్టోబర్ 4న మహబూబ్‌నగర్‌లో బిసి కులగణన పోరుబాట సమావేశం నిర్వహిస్తామని, అనంతరం వివిధ జిల్లాలు, రాష్ట్రాల్లో కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. నవంబర్‌లో పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో లక్ష మందితో బిసి కులగణన గర్జన నిర్వహిస్తామని వెల్లడించారు. ఒబిసి కాలమ్ డిమాండ్‌కు మద్దతు కూడగట్టేందుకు అక్టోబర్ 8న ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. రాజకీయ పార్టీలతో పాటు సామాజికవేత్తలు, న్యాయ నిపుణులు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, మేధావులు, పౌరసమాజ ప్రతినిధులను సమావేశానికి ఆహ్వానిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సదస్సును దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఒబిసి కాలమ్ అంశంపై పునరాలోచించాలని కోరారు. సమావేశంలో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణతో పాటు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యాం కుర్మా, బర్లమని మంజరి సాగర్, గూడూరు భాస్కర్, వరుణ్ కుమార్ గౌడ్, అనంతుల పవన్‌సాయి గౌడ్, శేషాద్రి, అంజమ్మ, నరసమ్మ, కరుణ, వెంకటేష్, ఓం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్**

**NIT No.** 72/EE-I/MKJZ/MMC/2026-27, **పని పేరు:** నిర్వహణ పనులు, ఇతరాలు-5, **అంచనా విలువ:** రూ.91.72లక్షలు, **బిడ్స్ సమర్పణకు ప్రారంభ తేది & సమయం / బిడ్స్ సమర్పణకు ఆఖరి తేది & సమయం:** 22.09.2026 ఉ.11:00గం.ల నుండి 25.09.2026 ఉ.11:00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-I, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.

DIPR R.O. No. : 10428-PP/CL/ADVT/2026-27, Date: 22-09-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ :: సరూర్‌నగర్ సర్కిల్-12**

తేది: 21.09.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
| --- | --- | --- | --- | --- |
| NIT No. 16/EE12/ SRNR/MMC/2026-27, Dated: 21.09.2026 | 08 పనుల కొరకు "సర్కిల్ కార్యాలయం వద్ద టాయిలెట్ పనులు మరియు ర్యాంప్ పనులు" | రూ. 82.52 లక్షలు | 30.09.2026 సా.03.10 గం.ల వరకు | శ్రీ వి కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-12, ఎంఎంసి. సెల్ నెం. 9701365519 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.eprocurement.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-12, ఎంఎంసి.

DIPR R.O. No. : 10393-PP/CL/ADVT/2026-27, Date: 22-09-2026

తెలంగాణ ప్రభుత్వం
**ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం**
మిషన్ భగీరథ ఇంట్రా డివిజన్ :: మహబూబాబాద్

షార్ట్ టెండర్ నోటీసు నెం. 01/2026-27, తేది: 21.09.2026

01 పని-01వ పిలుపు-01వ దశ పనికి సంబంధించిన షార్ట్ టెండర్ నోటీసు. ప్రస్తుత బోర్‌వెల్ నుండి సీరోల్ EMR పాఠశాల వరకు కొత్త పంప్‌సెట్ ఏర్పాటు చేసి, పైప్‌లైన్ వేయడం కొరకు టెండర్‌ను ఆహ్వానించడమైనది. ఈ పని TSES, హైదరాబాద్ కార్యదర్శి గారి ప్రొసీడింగ్స్ నం. Rc.No.TGES-Admn/1050920/2006, తేది: 07.09.2026 ప్రకారం మంజూరు చేయబడింది.

పనిపేరు: ప్రస్తుత బోర్‌వెల్ నుండి సీరోల్ EMR పాఠశాల వరకు కొత్త పంప్‌సెట్ ఏర్పాటు చేసి, పైప్‌లైన్ వేయడం - (1వ పిలుపు).

ఈ టెండర్ https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో **28.09.2026** నుండి **04.10.2026** వరకు మధ్యాహ్నం 3:00 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. టెండర్లను **04.10.2026 సాయంత్రం 4:00** గంటలకు తెరవబడును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మిషన్ భగీరథ ఇంట్రా, మహబూబాబాద్.

DIPR R.O. No. : 10404-PP/CL/ADVT/2026-27, Date: 22-09-2026

## ప్రజాసమస్యలపై పోరాటం

సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం మంచాల మండలం జాపాల గ్రామంలో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి అల్లి మద్దీన్ అధ్యక్షతన వహించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, పానుగంటి పర్వతాలు సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో సిపిఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్ రాజునాయక్, కో కన్వీనర్‌గా రామక్రిష్ణను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు పోచమని నీలమ్మ, లట్టుపల్లి అనంతరెడ్డి, సక్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐఎస్‌ఎఫ్ వార్షికోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఎఐఎస్‌ఎఫ్ వార్షికోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని ఎఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పవన్ చౌహాన్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని విశ్వభారతి జూనియర్ కళాశాలలో ఎఐఎస్‌ఎఫ్ వార్షికోత్సవం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పవన్ చౌహాన్ మాట్లాడుతూ ఈనెల 28,29,30, తేదీల్లో హనుమకొండ జిల్లా కేంద్రంగా మూడు రోజుల పాటు ఎఐఎస్‌ఎఫ్ వార్షికోత్సవ ముగింపు వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.సాయి పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు అండ



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** నిరుపేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి అన్నారు. బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వైదేహి నగర్ చెందిన ఉండే కృష్ణ ప్రసాద్ ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు ఎంఎల్‌ఎకు సంప్రదించగా చికిత్సకు ముఖ్యమంత్రి సహాయనిధి దరఖాస్తు చేయించారు. ఎల్‌ఓసి రూ.2 లక్షలు మంజూరు చేయించి చెక్కును వారి కుటుంబ సభ్యులకు మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మధుసాగర్ పాల్గొన్నారు.




**షాబాద్ :** సిఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం అని చేవెళ్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామెన భీంభరత్ అన్నారు. మంగళవారం షాబాద్ మండలం, తీగపూరం గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాంరెడ్డి, ప్రభాకర్, మాణేయ్య, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైద్యం కోసం ఎల్‌ఓసి అందజేత



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆపదలో ఉన్న పేద వారికి ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి వివరించారు. మంగళవారం నందిగామ మండలం మొదళ్ళగూడ గ్రామానికి చెందిన వడ్ల రాజు చారి అనారోగ్య సమస్యతో బాదపడుతూ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని ఆర్థిక సహాయం కోరగా మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.2.20లక్షల ఎల్‌ఓసిని మంజూరు చేయించి అందజేశారు. కార్యక్రమంలో కాట్న వీరందర్, మొదళ్ళగూడ ఉప సర్పంచ్ విక్రమ్‌రెడ్డి, నాయకులు జంగయ్య, రమేష్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్ గౌడ్, ప్రతాప్‌రెడ్డి, నరేష్ చారి, భాస్కర్, వినయ్‌రెడ్డి, సాయి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి కృషి



**ప్రజాపక్షం/యాచారం :** కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయిలో పటిష్టం చేయడానికి ప్రతికార్యకర్త కృషి చేయాలని పార్టీ రంగారెడ్డి జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు ముత్యాల వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షులు మోటే శ్రీశైలం అన్నారు. మంగళవారం మండలంలోని నానక్‌నగర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా తాండ్ర అంజయ్యను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వారికి నియామక పత్రాలను అందజేశారు. యూత్ అధ్యక్షుడిగా నక్క పాండు, ఉపాధ్యక్షులుగా గౌరారం నరేంధర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా జొగు సత్తయ్య,కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, మధుసూధన్‌రెడ్డి, పెద్దయ్య, మహిపాల్‌ను ఎన్నుకున్నామన్నారు.

## నల్లవేల్లిలో సహజవనరుపై సర్వే

**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని నల్లవేల్లి గ్రామంలో మంగళవారం ప్రోఫేసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం సహజవనరులు పర్యావరణ కేంద్రం అధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో గ్రామీణ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సహజ వనరుల విభాగం సంచాలకులు డాక్టర్ వి.రాములు, సర్పంచ్ కిషన్‌నాయక్, మండల వ్యవసాయధికారి అర్.రవినాథ్, విస్తరణ అధికారి నవ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి

తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి

జలమండలి గుర్తింపు కార్మిక సంఘంగా ఎంప్లాయీస్ యూనియన్‌కు ధ్రువీకరణ పత్రం అందజేత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) గుర్తింపు కార్మిక సంఘంగా తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్‌కు అధికారిక ధ్రువీకరణ పత్రం అందుకుంది. ఈ ఏడాది జూన్‌లో నిర్వహించిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించిన నేపథ్యంలో, యూనియన్‌ను రెండు సంవత్సరాల కాలానికి ఉద్యోగుల ప్రతినిధి యూనియన్‌గా గుర్తిస్తూ ఈ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారు. ఖైరతాబాద్‌లోని జలమండలి కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జలమండలి ఎండి అశోక్‌రెడ్డి.. యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డికి అధికారిక గుర్తింపు కార్మిక సంఘం ధ్రువీకరణ పత్రంతో పాటు క్రమశిక్షణ నియమావళిని అందజేశారు. తెలంగాణ స్పెషల్ కమిషనర్ ఆఫ్ లేబర్, హైదరాబాద్ సిఫారసు మేరకు ఈ గుర్తింపు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎండి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. యూనియన్‌కు ఇచ్చిన గుర్తింపు 2026 సెప్టెంబర్ 21 నుంచి రెండేళ్లపాటు అమల్లో ఉంటుందని తెలిపారు. కొత్తగా వెరిఫికేషన్ నిర్వహించి మరో యూనియన్‌కు గుర్తింపు ఇచ్చే వరకు ప్రస్తుత గుర్తింపు కొనసాగుతుందని పేర్కొన్నారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్‌ను మెజారిటీ యూనియన్‌గా నిలబెట్టిన జలమండలి ఉద్యోగులు, కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ, కార్మికుల సమస్యలను ప్రభుత్వం, జలమండలి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తాను నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.టి. రాఘువేంద్రరాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్లు అల్లి శ్రవణ్ కుమార్, ఎం.డి. జహంగీర్, నాయకులు చంద్రశేఖర్, ఎం. రాజా, శంకర్ ప్రకాష్, నర్సింగ్‌రావు, పి. చంద్రశేఖర్, ఎం. రాంచందర్, బి. మహేష్, అజైనాథ్, జైరాజ్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## బందోబస్తుకు 465 మంది అదనపు పోలీసు సిబ్బంది

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేశ్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గణేశ్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ (సిపి)డాక్టర్ ఎం.రమేశ్ ఆదేశించారు. సైబరాబాద్ కమిషనరేట్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన ఉన్నతాధికారుల సమీక్ష సమావేశంలో పోలీస్‌స్టేషన్ల వారీగా నిమజ్జనాల పరిస్థితి, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో గణేశ్ నిమజ్జనాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు మొత్తం 465 మంది అదనపు సిబ్బందిని బందోబస్తుకు వినియోగిస్తున్నామని సిపి రమేశ్ తెలిపారు. నిమజ్జనానికి వెళ్లే భక్తులు పోలీసుల సూచనలు, ట్రాఫిక్ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సిపి కోరారు. వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపివేయాలని, నిమజ్జన ప్రాంతాల్లో తోపులాటకు దూరంగా ఉండాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా పూర్తయ్యేందుకు పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు. సమావేశంలో సిఎంసి కమిషనర్ సృజన, జాయింట్ సిపి సన్‌ప్రీత్ సింగ్, శేరిలింగంపల్లి డిసిపి చింతమనేని శ్రీనివాసరావు, కూకట్‌పల్లి డిసిపి రితిరాజ్, ట్రాఫిక్ డిసిపి శేషాద్రినిరెడ్డి, అడ్మిన్ డిసిపి అన్నపూర్ణ, మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి పాల్గొన్నారు.

# అన్నిశాఖల సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లు

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

వనస్థలిపురం, సరూర్‌నగర్ ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు, సౌకర్యాలు, మౌలిక వసతులపై పరిశీలన



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సురక్షితంగా, సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎల్.బి.నగర్ జోన్ పరిధిలోని వనస్థలిపురం, సరూర్‌నగర్ ప్రాంతాల్లో మంగళవారం క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ప్రజా సౌకర్యాలు, సంక్షేమ మౌలిక వసతులు, బేబీ పాండ్లు, గణేష్ నిమజ్జన ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లను కమిషనర్ స్వయంగా పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వనస్థలిపురంలోని ఏక్వార్టర్స్ బేబీపాండ్‌ను కమిషనర్ పరిశీలించి, నిమజ్జనం సందర్భంగా భక్తులకు అందించాల్సిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. నిమజ్జన ప్రక్రియ ఎలాంటి అవరోధాలు లేకుండా సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ నగర్ ట్రయాంగిల్ పార్క్‌లోని బేబీ పాండ్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. అనంతరం వనస్థలిపురంలోని స్వామి వివేకానంద పార్క్‌లోని ఇందిరమ్మ క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. క్యాంటీన్‌లోని మౌలిక సదుపాయాలు, నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతను సమీక్షించి, ప్రజలకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన, సమర్థవంతమైన సేవలు అందేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. సాగర్ రింగ్ రోడ్‌లోని జంక్షన్ వద్ద ఉన్న ఇందిరమ్మ క్యాంటీన్‌ను కమిషనర్ సందర్శించి, మౌలిక వసతులు, పరిసరాల నిర్వహణ మరియు ప్రజలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. క్యాంటీన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు సులభంగా చేరుకునే విధంగా నిర్వహణ ఉండాలని సూచించారు. అనంతరం సరూర్‌నగర్ చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జన ప్రాంతంలో భక్తుల భద్రత, పారిశుధ్యం, ట్రాఫిక్ నిర్వహణ, లైటింగ్, రాకపోకలకు అనుకూలమైన మార్గాలు మరియు ఇతర సౌకర్యాలపై సమగ్రంగా సమీక్షించారు.నిమజ్జన సమయంలో భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీ నియంత్రణ, సురక్షిత రాకపోకలు, పరిశుభ్రత మరియు అవసరమైన ప్రజా సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గణేష్ నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, కేటాయించిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు స్పష్టం చేశారు.

# బాలికల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం









'మన అంగన్‌వాడీ... మన బాధ్యత' పోషణ మాసం థీమ్ ఆవిష్కరణలో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం అత్యంత కీలకమని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లాలో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాలకు సంబంధించిన "మన అంగన్‌వాడీ... మన బాధ్యత" అనే థీమ్‌ను అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం అత్యంత కీలకమన్నారు. ప్రతిరోజూ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, తగినంత ప్రోటీన్‌తో కూడిన ఆహారం తీసుకునేలా కుటుంబాల్లో అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు కేవలం పోషకాహారం అందించే కేంద్రాలు మాత్రమే కాకుండా ప్రాథమిక విద్య, బాలల సమగ్ర అభివృద్ధి, ఆరోగ్యం, పోషణకు కీలక కేంద్రాలుగా పని చేస్తున్నాయని తెలిపారు. పోషణ మాసం సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి జి.శాంతిశ్రీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాజెక్టుల పరిధిలో పోషకాహారం, ఆహార వైవిధ్యం, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీల్లో అందించే వేడి వండిన భోజనం నాణ్యత, పోషక విలువలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ సేవలపై ప్రజల భాగస్వామ్యం, సామాజిక బాధ్యత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంతో పాటు ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పిఎంఎంవివై) ప్రయోజనాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కిశోర బాలికల్లో రక్తహీనత నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన అలవాట్లపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలోజిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, డిప్యూటీ డిఎంహెచ్ఓ (ఇబ్రహీంపట్నం) సూర్యరత్న, ఆర్అండ్‌బి ఇఇ రమేష్, సిడిపిఒలు వెన్నెల, కాంతిరేఖ, రేణుక, హసీబా, కవిత, ఉదయ, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త డి.శ్రీనివాస్, బ్లాక్ కోఆర్డినేటర్లు కె.శ్రీనివాస్, ఎన్.శీనివాస్, ఎ.యాదగిరి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.



## ఆయిల్‌పామ్ సాగుతో ఆదాయం


షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/కేశంపేట:** ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. మంగళవారం కేశంపేట మండలం అల్వాల గ్రామంలో రైతు భుజంగారెడ్డి ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ తోటను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు రాష్ట్ర హార్టకల్చర్ డైరెక్టర్ అస్మిన్ భాషతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి నరేష్, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కిషన్‌రావు, ఎంపిడిఒ రవిచంద్రకుమార్‌రెడ్డి, తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, హెచ్ఓ షాద్‌నగర్ హిమబిందు, హెచ్ఓలు రుక్మిణి రాజేష్, నాయకులు రమేష్, సింగిల్ విండో చైర్మెన్ శ్రీధర్‌రెడ్డి, తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, సర్పంచ్‌లు సురేష్‌రెడ్డి, పల్లె ఆనంద్‌కుమార్, కవిత కరుణాకర్‌రెడ్డి, నాగేష్, భాస్కర్, వీరేష్, కోడురు రాములు పాల్గొన్నారు.

### అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాలి

**షాద్‌నగర్:** ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. పట్టణంలోని 13వ వార్డులో కౌన్సిలర్ రిజ్వానాభేగం ముబారక్ అలీఖాన్ దంపతుల ఆధ్వర్యంలో మంచినీటి క్యాన్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, నాయకులు విశ్వం, కౌన్సిలర్లు మురళీమోహన్, దిలీప్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు ఖదీర్, నల్లమోని శ్రీధర్, సురేష్, కుచూరి ప్రవీణ్, జి.శ్రీనివాస్, లాయక్, ఇసాక్, సాధిక్, రఘునాయక్, అన్వర్, అలీఖాన్ పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు



నవయుగ యూత్ ఆధ్వర్యంలో గణనాథుడికి పూజలు

పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** జిహెచ్ఎంసి పరిధిలోని జిల్లెలగూడలో నవయుగ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అసోసియేషన్ ఆర్గనైజర్లు పోరెడ్డి వంశీధర్‌రెడ్డి, సిద్దాల శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు మంగళవారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నవయుగ యూత్ సభ్యులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం

మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నవయుగ యూత్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అర్కల కామేష్‌రెడ్డి, సప్పిడి జంగారెడ్డి, పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సిద్దాల భారత్, బీరప్ప, సిద్దాల లావణ్య, దీప్‌లాల్ చౌహన్, భూపేష్, అవినాష్, లత, బాలరాజ్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**కొత్తూరు:** అన్నం పరబ్రహ్మ స్వరూపం..అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం నందిగామ మండలం మొదళ్ళగూడ, మాజీద్ మామిడిపల్లి గ్రామాలల్లో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో మొదళ్ళగూడ సర్పంచ్ పెండ్యాల అరుణ రాజు, వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు, కాటన రవీందర్, సుధాకర్ గౌడ్, జెకె నరసింహులు, మొదళ్ళగూడ ఉప సర్పంచ్ విక్రమ్‌రెడ్డి, వార్డు సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, మొయినోద్దీన్, రామచంద్రయ్య, రమేష్ గౌడ్, అబ్బాస్, కోరే రాజు, ఆంజనేయులు గౌడ్, జంగయ్య, దివిటి నర్సింహా, చీకుర్తి శ్రీనివాస్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

### గణేష్ లడ్డు వేలం దక్కించుకున్న సతీష్ చౌదరి

**ఎల్‌బి నగర్:** సాహెబ్ నగర్ డివిజన్ పరిధిలోని సిబిఐ కాలనీలో నవరాత్రి ఉత్సవాలల్లో భాగంగా నిత్యం పూజలు అందుకున్న గణేష్‌ని లడ్డు వేలం పాటలో కాలనీ అధ్యక్షుడు ముప్వ సతీష్ కుమార్‌చౌదరి లడ్డును రూ.2లక్షల 53 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

**ఉత్సావాల్లో పాల్గొన్న కాసం వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్ లచ్చిరెడ్డి**

గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపములో బిజెపి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహకులు గోపి, సుధీర్, పార్టీ నాయకులు రవిశంకర్, చిన్న యాదవ్, ప్రదీప్ గౌడ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.







## రేషన్ డిజిటల్ కార్డుల పంపిణీ



**ప్రజాపక్షం/దుండిగల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకం గా చేపట్టిన రేషన్ డిజిటల్ కార్డుల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా చేపడుతున్నామని వాటిని లబ్ధిదారులకు అందజేస్తున్నామని బాదురుపల్లి కి చెందిన రేషన్ డీలర్ శ్రీహరి పేర్కొన్నారు. ఇటీవలే ఈ ప్రక్రియ మొదలవడంతో డిజిటల్ కార్డుల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు నిర్దిష్ట సమయంలో లబ్ధిదారుల యొక్క కార్డులను తీసుకోగలరని పారదర్శకంగా ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.




## పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమమే లక్ష్యం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మున్సిపల్ కార్మికుల ఆరోగ్య భద్రత, సంక్షేమానికి అలియాబాద్ మున్సిపాలిటి ప్రత్యేక ప్రాధాన్యత నిస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అలియాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది సంక్షేమ కార్యక్రమంలో భాగంగా విధులు నిర్వహిస్తున్న 90 మంది పారిశుద్ధ్య సిబ్బందికి భద్రతా సామాగ్రి అలాగే బిల్ కలెక్టర్‌లకు 8 ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికులే వెన్నముకలని పేర్కొన్నారు. విధి నిర్వహణలో అవసరమైన భద్రతా పరికరాలను అందించడంతో పాటు సంక్షేమ పథకాల ప్రయోజనాలు కార్మికులకు నిరంతరం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది, బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని జఠాధరా ఎడ్యుకేషనల్ టెక్నాలజి ప్రతినిధులు అనూష, లలిత అన్నారు. మంగళవారం శామీర్‌పేట డివిజన్ సింగాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన పరీక్ష ప్యాడ్‌లు, ఇంగ్లీష్ నోట్ పుస్తకాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామ్‌రెడ్డి, ఉపాధ్యాయులు మురళి, తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం



**ప్రజాపక్షం /పరిగి :** మండల పరిధిలోని రాపోలు గ్రామ పరిధిలోని ఇంటస్టియల్ పార్కు పేరుతో 101 ఎకరాల రైతుల పట్టా భూమి పోతుందని మండల కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రటారీ గుండు వెంకటేష్ ఉపాధ్యాయులు రాకేష్ సాగర్ ఆధ్వర్యంలో మంగళవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి నివాసంలో కలిసి పట్టా భూములను రైతులనుండి తీసుకోవద్దని ఎమ్మెల్యేలకు రైతుల వినతి పత్రం అందజేశారు. అందుకు ఎమ్మెల్యే సానుకులంగా స్పందిచారన్నారు. ఈ కార్యక్రమంలో రాపోలు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ వ్యాపారి అరెస్ట్




**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక వ్యాపారం చేస్తున్న ఓ యవకుడిని ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసారు. విశ్వసనీయ సమాచారంతో రామంతాపూర్‌లోని శ్రీ చైతన్య హైస్కూల్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఇసుక నిలువ చేసి వ్యాపారం చేస్తున్న మహ్మద్ బురాన్ అలియాస్ జిల్లును హెడ్ కానిస్టేబుల్ భాస్కర్, హెచ్‌జి నరేష్‌లు ఇసుకకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవటంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గత కొద్దికాలంగా తెలిసిన వారినుండి అనధికారికంగా ఇసుక కొనుగోలు చేసి అవసరం ఉన్న వారికి అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకొంటున్నానని చెప్పటంతో అతడి నుండి 15 టన్నుల ఇసుక స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరు విద్యార్థుల అరెస్ట్



**ప్రజాపక్షం/ఉప్పల్:** పంజాబ్ రాష్ట్రంలో విద్యాభ్యాసం చేస్తూ మాదక ద్రవ్యాలకు బానిసలై నగరంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్) బృందాలు అరెస్టు చేసారు. ఎస్టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం అనంతపురం జిల్లాకు చెందిన దేవరకొండ విద్యశ్రీ,హైదరాబాద్‌కు చెందిన విష్ణువర్ధనరెడ్డిలు పంజాబ్‌లోని ఓ కళాశాలలో చదువుకొంటున్నారు. స్నేహితులైన వారిద్దరు మాదక ద్రవ్యాల కు బానిసలై ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో సులభం గా సంపాదించుకొని తమ అవసరాలు తీర్చుకొనేందుకు డ్రగ్స్ అమ్మాలని నిర్ణయించుకొని ఉప్పల్ సమీపంలోని సరస్వతి కాలనీలో ఓ గదిని అద్దెకు తీసుకొని తరచు వచ్చి గుట్టుచప్పుడు కాకుండా అవసరం ఉన్న వారిని గుర్తించి డ్రగ్స్ అమ్మి సొమ్ము చేసుకోవటం ప్రారంభించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వారిద్దరిని ఎస్టీఎఫ్ అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకొని రూ.2.40 లక్షల విలువైన 9.6 గ్రాముల ఓజి కుష్, 14 గ్రాముల ఎండిఎంఎ మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకొన్నారు.

### మిలటరీ ఆయుధాల చోరీలో

# మల్లేశ్‌ను మళ్లీ ప్రశ్నించిన పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**బొల్లారం 20 మద్రాస్ రెజిమెంట్ ఆయుధాగారం నుంచి తుపాకులు, భారీగా మందుగుండు సామగ్రి చోరీ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఆర్మీ హవల్దార్ ఉప్పుతొల్ల మల్లేశ్‌ను పోలీసులు మంగళవారం కస్టడీలోకి తీసుకుని విచారించారు. సికింద్రాబాద్ కోర్టు 10 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించడంతో చంచల్‌గూడ జైలు నుంచి మల్లేశ్‌ను మల్కాజిగిరి పోలీసుల ఆధీనంలోకి తీసుకున్నారు.

**ఆయుధాలు ఎలా బయటకు వచ్చాయి?**

ఆర్మీ ఆయుధాగారంపై మల్లేశ్‌కు ఉన్న పరిచయం, ఆయుధాలను బయటకు తరలించిన విధానం, ఆయుధాలు దాచిన ప్రదేశాలకు సంబంధించిన వివరాలపై పోలీసులు ప్రధానంగా ప్రశ్నించినట్లు సమాచారం. చోరీకి ముందు ఆయుధాగారం పరిసరాలను పరిశీలించిన ట్లు దర్యాప్తులో ఇప్పటికే వెల్లడైన నేపథ్యంలో.. భద్రతా వ్యవస్థ, సిసి కెమెరాలు, గార్డుల కదలికలపై అతడికి ఉన్న అవగాహనను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు.

మల్లేశ్ చోరీని ఒంటరిగానే చేశాడా? లేక మరెవరైనా సహకరించారా?అన్నదే తాజా విచారణలో కీలక అంశంగా మారింది. ఆయుధాలను తరలించడం, వివిధ ప్రాంతాల్లో దాచడం, వాటిని మళ్లీ మార్చడం వంటి వ్యవహారాల్లో ఎవరి సహకారం ఉందనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో మరో ఇద్దరు ఆర్మీ సిబ్బంది పాత్రపై కూడా దర్యాప్తు అధికారులు దృష్టి సారించినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. అయితే వారి పాత్రపై ఇప్పటివరకు తుది నిర్ధారణ వెలువడలేదు.

**ఆన్‌లైన్ లింకులపైనా దృష్టి..**

మల్లేశ్ మొబైల్ ఫోన్, డిజిటల్ కార్యకలాపాలు, సోషల్ మీడియా పరిచయాలు, ఆయుధాల అక్రమ రవాణాతో సంబంధం ఉన్న వ్యక్తులతో ఏమైనా పరిచయాలు ఉన్నాయా? అనే అంశాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. ఆయుధాలను విక్రయించేందుకు లేదా ఇతరులకు అప్పగించేందుకు ప్రయత్నించాడా? అన్న కోణంలోనూ విచారణ సాగుతోంది.

**ఎక్కడెక్కడ దాచాడు?**

చోరీకి గురైన నాలుగు ఏకే203 రైఫిళ్లు, ఒక ఇన్సాస్ రైఫిల్, ఆరు 9 ఎంఎం పిస్టళ్లు, ఒక 6.35 బోర్ పిస్టల్, మ్యాగజైన్లు, నైట్ విజన్ పరికరం, 1,800కుపైగా రౌండ్ల మందుగుండు సామగ్రిని పోలీసులు వివిధ ప్రాంతాల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఇప్పటికే వెల్లడించారు. కౌక్కూర్, యాప్రాల్, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రాంతాల్లో ఆయుధాలను దాచిన తీరుపై కూడా మల్లేశ్‌ను ప్రశ్నిస్తున్నారు.

**చోరీకి అసలు కారణం ఏమిటి..?**

మల్లేశ్ 2026 జూన్ 30న ఆర్మీ నుంచి రిటైర్ అయ్యాడు. ముందస్తు రిటైర్మెంట్‌పై అసంతృప్తితోనే ఆయుధాలను చోరీచేసి ఉండొచ్చన్నది పోలీసుల ప్రాథమిక అనుమానంగా గతంలో వెల్లడైంది. అయితే అసలు ఉద్దేశం పూర్తిగా నిర్ధారణ కాలేదని అధికారులు పేర్కొన్నారు. కాబట్టి కస్టడీ విచారణలో అతడి ఉద్దేశం, చోరీకి ముందు చేసిన ఏర్పాట్లు, ఆయుధాల భవిష్యత్ వినియోగంపై ఏదైనా ప్రణాళిక ఉందా? అన్న అంశాలను లోతుగా పరిశీలిస్తున్నారు.

**దర్యాప్తు మరింత విస్తరించే అవకాశం..**

కేసులో ఆయుధాల చోరీ మాత్రమే కాకుండా.. ఇంత భద్రత ఉన్న మిలిటరీ ప్రాంగణం నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి బయటకు వెళ్లిన సమయంలో భద్రతా లోపాలు ఏమైనా జరిగాయా? అందుకు ఎవరైనా సహకరించారా? అనే అంశాలపైనా దర్యాప్తు కొనసాగుతోంది. పోలీస్ కస్టడీ ముగిసేలోపు మల్లేశ్ నుంచి మరిన్ని వివరాలు రాబట్టడంతో పాటు, అవసరమైతే ఇతర అనుమానితుల పాత్రను కూడా పరిశీలించే అవకాశం ఉంది.



## ప్రజల్లో ఐక్యతను పెంచే పండుగ వినాయక చవితి

### స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రజాపక్షం /వికారాబాద్ :** జిల్లా కేంద్రంలోని పలు వినాయక మంటపాలను సందర్శించిన స్పీకర్ ప్రసాద్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలనలో వర్షాలు సమృద్ధిగా కురవాలని వినాయకుడిని వేడుకున్నానని తెలిపారు. మంటపాల వద్ద కొలువైన విఘ్నాలు తొలగించే వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరు ఒకేచోట చేర్చే గొప్పపండుగా వినాయక చవితి అని గుర్తు చేశారు. పండుగలు ప్రజల్లో ఐక్యతను మరింత పెంచుతాయన్నారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, వైస్ చైర్మన్ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

### రక్షణ రంగాన్ని బలోపేతం చేసేందుకు

# బిట్స్ పిలాని డిఐఎటి కీలక ఒప్పందాలు



**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతికతను వేగవంతం చేయడమే లక్ష్యంగా బిట్స్ పిలానీ జవహర్ నగర్, హైదరాబాద్ క్యాంపస్, డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ డిఐఎటి పుణె సంయుక్తం గా డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ ఇండస్ట్రీ డే 2026 ను మంగళవారం నిర్వహించాయి.

మిషన్‌రెడీ ఆవిష్కరణల కోసం అకాడమీ పరిశ్రమల భాగస్వామ్యం అనే నినాదంతో సాగిన ఈ సదస్సుకు డిఆర్‌డిఓ, మిధాని, బిఇఎల్, హెచ్‌ఎఎల్ వంటి సంస్థలు, 45 ప్రముఖ కంపెనీల నుంచి సుమారు 125మంది ప్రతినిధులు హాజరయ్యారు. పరిశోధన, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, సంయు క్త వాణిజ్యీకరణ కోసం 20 అవగాహన ఒప్పందాలు కుదిరాయి.

**48 స్వదేశీ సాంకేతికతల ప్రదర్శన:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, ఆటోనోమస్ సిస్టమ్స్, సెన్సార్ల విభాగాల్లో 48 నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు.

**కీలక సందేశాలు :** డిఐఎటి వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.హెచ్.వి.ఎస్. నారాయణమూర్తి, బిట్స్ పిలానీ గ్రూప్ వైస్ ఛాన్సలర్ ప్రొఫసర్ వి. రామ్‌గోపాల్ రావు, డిఆర్‌డిఓ డిజి డాక్టర్ జగన్నాథ్ నాయక్, కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ చైర్మన్ రాజేందర్ సింగ్ భాటియా ప్రసంగిస్తూ ప్రయోగశాల పరిశోధనలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు పరిశ్రమలు, విద్యాసంస్థలు ప్రారంభ దశ నుంచే కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

**ముఖ్య నిర్ణయాలు :** డిఆర్‌డిఓ మాజీ ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్ రెడ్డి, ప్రొఫసర్ వి. రామ్‌గోపాల్ రావు నేతృత్వంలో జరిగిన ఓపెన్ హౌస్ సెషన్ లో ఒప్పంద ప్రాజెక్టులను వేగంగా ప్రారంభించడం, క్యాంపస్‌లోనే సంయుక్త పరిశోధన కేంద్రాలు (జాయింట్ రీసెర్చ్ లాబ్స్ ) ఏర్పాటు చేయడం మరియు సులభతర మేధో సంపత్తి (ఐపీ)విధానాలను అమలు చేయాలని నిర్ణయించారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంగా రక్షణ రంగాన్ని బలోపేతం చేయాలనే సంకల్పంతో ఈ సదస్సు ముగిసింది.



## ఎంసిహెచ్ కిట్ పోర్టల్ జాప్యం లేకుండా వివరాలు నమోదు చేయాలి

### డిఎంహెచ్ఒ డా.ఆనంద్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** గర్భిణీ స్త్రీలు, మాతృ ఆరోగ్య పరామితులు, శిశు ఆరోగ్య సూచకలు, ప్రసవానికి సంబంధించిన వివరాలనున ఎప్పటికప్పుడు ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా ఎంసిహెచ్ కిట్ పోర్టల్‌లో నమోదు చేస్తుండాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఆనంద్ సూచించారు. తమ కార్యాలయంలో ఆరోగ్య కేంద్రాల డిఈఓలు, ఎసిసిలు, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సేకరించిన వివరాలు సంబంధిత రికార్డులతో సరి చూసుకొని పోర్టల్‌లో సరైన విధంగా నమోదు చేస్తుండాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎంసిహెచ్ కిట్ పోర్టల్ వివరాలను పర్యవేక్షిస్తూ అవసరమైన చోట కింది స్థాయి సిబ్బందికి సూచనలివ్వాలన్నారు. ఎంసిహెచ్ కిట్ పోర్టల్ వివరాలే మాతృ, శిశు ఆరోగ్య సేవల పర్యవేక్షణకు కీలకమైందని, భవిష్యత్ సమీక్షలు, ఉన్నతాధికారుల పరిశీలనకు ఈ డేటా నాణ్యత, సమగ్రత, సమయానుకూల నవీకరణలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.



## ఉద్యోగాలు సృష్టించే స్థాయికి విద్యార్థులు ఎదగాలి

### అలీప్ వీహబ్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ జహూర్ ఉల్లా






**ప్రజాపక్షం/నిజాంపేట్:** విద్యార్థులు ఉద్యోగాలకోసం కాకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలని హైదరాబాద్ అలీప్ వీహబ్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ జహూర్ ఉల్లా అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి బివిఆర్ ఐటి కళాశాల ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్స్‌లో ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ అలీప్ వీహబ్ హైదరాబాద్ సహకారంతో పదిహేను రోజుల పాటు స్టార్టప్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ కార్యక్రమం రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్‌ఎంఈ పెర్ఫార్మెన్స్ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ అలీప్ వీహబ్ హైదరాబాద్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ జహూర్ ఉల్లా ఎస్ఎండి, అలీప్ వ్యవస్థాపక సభ్యురాలు, డబ్ల్యూఈఐటిటిసి, అలీప్ వైస్ చైర్ పర్సన్ డాక్టర్ జ్యోతి ఆర్.పిడికిటిలు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగం లో ఇన్నోవేషన్ మరియు ఎంటర్ ప్రెన్యూర్ షిప్ కు ఎంతో ప్రాధాన్యత ఉందని, విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలని సూచించా రు. విజయవంతమైన పారిశ్రామిక వేత్తకు అవసరమైన వివిధ నైపుణ్యాలను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలని, విద్యార్థుల ఆలోచనలను వాస్తవ రూపంలోకి తీసుకువచ్చి, వాటిని మార్కెట్‌కి, అంతిమ వినియోగదారులకు చేరేలా చేయడానికి అవసరమైన విధానాలను వివరించారు. కార్యక్రమంలో బివిఆర్ఐటి హైదరాబాద్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శారద, వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్, వివిధ డీన్లు, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంటర్ ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఇన్‌చార్జులుగా డాక్టర్ ఎస్. కళ్యాణ్, బి.ఉమారాణి కన్వీనర్లుగా వ్యవహరించారు.



## నూతన పాలకవర్గాన్ని అభినందించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు నియోజకవర్గ పరిధిలోని ప్రాథమిక సహకార సంఘాలకు నూతనగా నియమించిబడిన చైర్మన్‌లు, పాలకవర్గం సభ్యులు స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కలుసుకుని ప్రత్యేక ధన్యావాదాలు తెలియజేశారు. కాగా సోమవారం వ్యవసాయ ప్రాథమిక సహకారం సంఘాలకు నూతనంగా నియమించ బడిన చైర్మన్‌లు బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఎల్మకన్య పిఎసిఎస్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, తట్టేపల్లి పిఎసిఎస్ చైర్మన్ పి.మహిపాల్‌రెడ్డి, నవంద్గీ పిఎసిఎస్ చైర్మన్ కరుణ అజయ్ ప్రసాద్, యాలాల పిఎసిఎస్ చైర్మన్ అనిల్‌కుమార్ గుప్తాలు, వైస్ చైర్మన్ బండమీదిపల్లి జగన్‌లతో పాటు డైరక్టర్‌లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని క్యాంపు కార్యాలయం లో కలుకుని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నూతన పాలకవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు, రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## అనురాగ్ వర్సిటీలో ఎఐపై శిక్షణ


**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** కృత్రిమ మేధస్సులో ఆధునిక మార్పులపై విద్యార్థుల కు ప్రాయోగిక అవగాహన కల్పించేందుకు అనురాగ్ యూనివర్సిటీలో రెండు రోజుల శిక్షణ నిర్వహించారు.సమాచార సాంకేతిక విభాగం ఆధ్వర్యంలో కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా,ఇండియాన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సహకారంతో కార్యక్రమం జరిగింది.జనరేటివ్ ఏఐ,ఏఐ ఏజెంట్ల అభివృద్ధి సంస్థల ఏఐ,గూగుల్ క్లౌడ్, యాంటిగ్రావిటీ, సర్వీస్‌నౌ, ప్రాంప్ట్ రూపకల్పనపై ఐటీ, కప్యూటర్ సైన్స్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. బిందు స్వరూప వేములపల్లి, లస్యశ్రీ మల్లాడి వనరుల వ్యక్తులుగా పాల్గొన్నారు. విభాగాధిపతి డాక్టర్ నితీషాశర్మ మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు.వాస్తవ సమస్యలకు ఏఐ ఆధారిత పరిస్కారాలు రూపొందించే సామర్థ్యాన్ని పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమ విజయవంతానికి సీఎస్ఐ సమన్వయకర్త ఏ.స్పందన,ఐఎస్‌టీఈ సమస్యన్వయకర్త ఏ.అనిత కీలకంగా వ్యవహరించారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మొక్కలు నాటిని వాటిని సంరక్షించాలని యాడారం 12వ వార్డు కౌన్సిలర్ హనుమాన్‌దాస్ గౌడ్ అన్నారు.



మంగళవారం యాడారంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో హరితహరంలో బాగంగా మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించేలా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని చెప్పారు. మొక్కలు నాటడం వలన మంచి ఆక్సిజన్ లభిస్తుందని తెలిపారు. ప్రతి విధ్యార్థి భాద్యత మొక్కలు నాటి ప్రతిరోజు వాటికి నీళ్లు పోయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## మాదక ద్రవ్యాల దందా..ఇద్దరి అరెస్టు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మల్కాజిగిరి రైల్వే స్టేషన్ సమీపంలో మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న రాజస్థాన్ రాష్ట్రవాసిని ఓ వినియోగదారుడితో సహా పోలీసులు అరెస్టు చేసారు. నిందితుల నుండి రూ. 2.76 లక్షల విలువైన 23 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్, 2 సెల్‌ఫోన్లు, రూ. 5,600 నగదు, ఒక హ్యాండ్‌బ్యాగ్‌ను స్వాధీనం చేసుకొన్నారు. మల్కాజిగిరి ఎస్ఓటి మనోహర్, మల్కాజిగిరి జోన్ డిసిపి శ్రీధర్, అదనపు డిసిపి షాకీర్ హుస్సేన్‌లు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజస్థాన్ రాష్ట్రం నుండి వలస వచ్చి నగరంలో ర్యాపిడో డ్రైవర్‌గా జీవనం గడుపుతున్న మహవీర్‌సింగ్, క్యాటరింగ్ పనులు చేసే అదే రాష్ట్రవాసి సింగ్ రాజ్‌పురోహిత్‌లు రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం మాదకద్రవ్యాల సరఫరా జరుగుతోందన్న విశ్వసనీయ సమాచారం మేరకు వలపన్ని అదుపులోకి తీసుకొని వారి నుండి పాలిథిన్ బ్యాగ్‌లలో ఉన్న మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకొన్నారు. తదుపరి దర్యాప్తు ఫలితంగా ప్రధాన నిందితుడైన మహవీర్‌సింగ్ రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్‌కు చెందిన కుల్దీప్ నుండి డ్రగ్స్ నగరానికి తీసుకొని వచ్చి మల్కాజిగిరిలో రాజ్‌పురోహిత్‌కు డ్రగ్స్‌ను ఇచ్చేందుకు వచ్చానని, ఇదే విధంగా తరచు కైలాష్ అనే వ్యక్తికి సైతం సరఫరా చేస్తున్నానని పేర్కొన్నాడు. డ్రగ్స్ సరఫరా చేసే కుల్దీప్‌తో పాటు మరో వినియోగదారుడి కోసం గాలిస్తున్నామని డిసిపిలు తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

### ఆర్టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని జిల్లా ఆర్టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం శామీర్‌పేట డివిజన్‌లోని దేవరయాంజాల్‌కు చెందిన నీరుడి ఆనంద్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) కింద రూ. 60 వేలు మంజూరైన చెక్కును లబ్ధిదారుడికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందుతున్న పేదలకు సిఎం సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**ఉప్పర్‌పల్లి గణనాథుడి శోభాయాత్రలో..**

ఉప్పర్‌పల్లిలో అంబేద్కర్ వారియర్స్ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి శోభాయాత్ర నిమజ్జనంలో జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట ఇన్స‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శోభాయాత్ర నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని యూత్ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేష్, అంబేద్కర్ యూత్ సభ్యులు ఎలకూర్తి నరేష్, ప్రవీన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమంలో బండి రమేష్

**ప్రజాపక్షం / కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి 5వ ఫేజ్, బాలానగర్ డివిజన్ పరిధిలోని సంజీవయ్య కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడిని టిపిసిసి వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మంగళవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గణేష్ నవ రాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు.

## భారత్ విద్యా నిర్ణయాలు ప్రపంచంపై ప్రభావం




**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** భారతదేశ విస్తృతి, వైవిధ్య దృష్ట్యా ఇక్కడ విద్యా రంగంలో తీసుకునే నిర్ణయాలు ప్రపంచ వ్యాప్తంగా పెను ప్రభావం చూపుతాయని ఇంటర్నేషనల్ బాక్యాలరేట్ (ఐబి) డైరెక్టర్ జనరల్ ఒల్లీ పెక్కా హైనొనెన్ తెలిపారు. ఆగాఖాన్ అకాడమీలో సరిహద్దులు దాటిన అభ్యాసం పరస్పర అనుసంధానిత ప్రపంచం కోసం విద్య అనే ఇతివృత్తంతో ఐబీ మంథన్ 2026 నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెరుగైన సమాజాన్ని తీర్చిదిద్దేందుకు అవసరమైన విద్యా పునాదులు, జిజ్ఞాస, విచక్షణ, పరిష్కారాలకు అనుగుణంగా మారే తత్వం, బాధ్యతాయుత దృక్పథాన్ని ఇక్కడి యువతలో నింపేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు.

## సిఐల బదిలీలు



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** వివాదాలకు కేంద్ర బిందువుగా పేరొందిన జూబ్లీహిల్స్ సిఐగా అశోక్ బాధ్యతలు స్వీకరించారు. అదే విధంగా సనత్‌నగర్ సిఐగా పరశురాం బాధ్యతలు చేపట్టారు. సనత్‌నగర్‌లో విధులు నిర్వహిస్తున్న సిఐ అశోక్‌ను జూబ్లీహిల్స్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ కాగా.. ఎస్‌బిలో ఉన్న పరశురాంను సనత్‌నగర్‌కు బదిలీ చేయడం జరిగింది.

## గణేశ్ సురక్ష సంకల్ప్ డే



**ప్రజాపక్షం/కంటోన్మెంట్:** రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ ఉల్లంఘనలకు దూరంగా ఉండటం తదితర అంశాలపై ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలోనే ట్రాఫిక్1 డిసిపి కె.రాహుల్‌రెడ్డి పర్యవేక్షణలో వాసవినగర్ గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్ట్రీట్ నెం2లో ఏర్పాటైన వినాయక మండపం వద్ద గణేష్ సురక్ష సంకల్ప్ డే1 కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తిరుమలగిరి డివిజన్ ఎసిపి(ట్రాఫిక్) జి.శంకర్‌రాజు, కార్ఖానా ఎస్‌హెచ్‌ఓ అనురాధ, ఎస్‌ఐ అశోక్‌రెడ్డి, తిరుమలగిరి ట్రాఫిక్ సిఐ వి.రామనయ్య, ఎస్‌ఐ మారుతి, రోడ్ సేఫ్టీ, సహచారిణి టీమ్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ అవగాహన క్విజ్ పోటీ నిర్వహించారు.

## అక్రమ నిర్మాణాలకు అండ

### బ్రోకర్‌తో అధికారుల బెంబేలు

**ప్రజాపక్షం/గోషామహల్:** అక్రమ నిర్మాణాలకు గోషామహల్ అడ్డాగా మారుతోంది. ఓ ప్రజాప్రతినిధి పేరుచెప్పి ఓ బ్రోకర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ప్రజాప్రతినిధి పేరు చెబుతుండటంతో బల్దియా అధికారులు చర్యలు చేపట్టేందుకు జంకుతున్నారు. ఈ క్రమంలోనే గోషామహల్ నియోజకవర్గంలో బిల్డర్లు, నిర్మాణదారులు, జీహెచ్‌ఎంసీ అధికారులకు సదరు బ్రోకర్ తలనొప్పిగా మారాడని ప్రచారం జరుగుతోంది. ఖాళీ స్థలం లభించని కారణంగా గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ప్లాట్లు ఖరీదుగా మారాయి. 100 గజాల స్థలంలోనూ సెల్లార్లు ఉంటాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన వ్యాపారులు, ధనికులు నివాసముంటున్న ప్రాంతం కావడంతో అనుమతి ఒకలా.. నిర్మాణం మరోలా ఉంటుంది. ఇదే అక్కడి బ్రోకర్‌కు అనుకూలిస్తున్నది. ఇందులో భాగంగానే స్వామికార్యం, స్వకార్యం పూర్తి చేసుకుంటున్న సదరు రాజస్థానీ బ్రోకర్ స్థానికులతో పాటు బల్దియా అధికారులకు చికాకు కలిగిస్తుండటంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సమయంలో ఉద్యోగులు విధులకు హాజరుకాకపోవడం పట్ల హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు పట్టికను తనిఖీ చేయగా, ముందస్తు సమాచారం లేకుండా సికింద్రాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో విధులకు గైర్హాజరైన ఆరుగురు ఉద్యోగులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సమయపాలన పాటించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 'పూటకూళ్ళవ్వ' నవల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** సమాజంలోని అనుభవాలను సాహిత్యంగా మలిచే రచయితలను ప్రోత్సహించాలని దక్కన్ హెరిటేజ్ అకాడమి ట్రస్టు చైర్మన్ మణికొండ వేదకుమార్ అన్నారు. ప్రముఖ రచయిత్రి మాదారపు వాణిశ్రీ రచించిన 'పూటకూళ్ళవ్వ' నవల ఆవిష్కరణ సభ ట్రస్టు ఆధ్వర్యాన మంగళవారం నగరంలోని హిమాయత్‌నగర్ ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో జరిగింది. వేదకుమార్ మాట్లాడుతూ సాహిత్య సృజనను ప్రోత్సహించడం, కొత్త రచనలను పాఠకులకు పరిచయం చేయడం సాహిత్య సంస్థల బాధ్యతల్లో భాగమన్నారు. నవతెలంగాణ అసోసియేట్ ఎడిటర్ కె.ఆనందాచారి మట్లాడుతూ 'పూటకూళ్ళవ్వ'లో జీవన వాస్తవికతకు మానవ సంబంధాలకు ఇచ్చిన ప్రాధాన్యం ప్రత్యేకంగా నిలిచిందన్నారు. ఒయు అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఎస్.రఘు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి కొండపల్లి నిహారిణి, డా.ఇడికోజు శ్రీనివాసాచారి, సాహితీవేత్తలు, పరిశోధకులు పాల్గొన్నారు.

## నాగారంలో రూ.3.80 లక్షలు పలికిన వినాయకుని లడ్డు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నాగారం ఓల్డ్ విలేజ్ హనుమాన్ నగర్ ఫ్రెండ్స్ యూత్ నాగారం(ఎఫ్‌వైఎన్) ఆధ్వర్యంలో తొలిసారిగా గణేష్ లేజర్ షోను ఏర్పాటు చేశారు.ఈ లేజర్ షోకు భక్తుల నుండి మంచి స్పందన లభించింది.నిర్వహకులు నిర్వహించిన లడ్డు వేలం పాటలో మొదటి లడ్డు మాజీ కౌన్సిలర్ కౌకుట్ల అనంత్‌రెడ్డి 3,60 లక్షలు,రెండవ లడ్డు గోపాల్‌రెడ్డి 1.70,మూడవ లడ్డు సాయికిరణ్‌రెడ్డి 1.80 లక్షలకు దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో టిఆర్‌ఎస్ అధ్యక్షురాలు కవిత,మాజీ మంత్రి మల్లారెడ్డి,భద్రారెడ్డి,మల్కా యశస్వి,సుదర్శన్‌రెడ్డి,కందాడి అంజిరెడ్డి రాహుల్‌రెడ్డిలు వినాయకుని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు.

# సేవాభావం ప్రతి ఒక్కరిలో పెంపొందాలి

### హైడ్రా కమిషనర్ ఎవి. రంగనాథ్







**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజానికి సేవ చేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉండాలని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అన్నారు. యువ ఆపద మిత్రలు సమాజానికి స్ఫూర్తిగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రకృతి వైపరీత్యాలు, అనుకోని ప్రమాదాల సమయంలో తక్షణ స్పందన అందించే వారిగా యువ ఆపద మిత్రలు పనిచేయాలని సూచించారు. యువ ఆపద మిత్ర పథకం కింద హైడ్రాలో శిక్షణ పూర్తి చేసుకున్న 117 మంది వాలంటీర్లకు మంగళవారం హైడ్రా కమిషనర్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ప్రమాద సమయాల్లో ఉపయోగపడే లైఫ్ జాకెట్లు, టార్చ్‌లైట్లు, కట్టర్లు, తాళ్లు తదితర పరికరాలతో కూడిన కిట్లను వారికి పంపిణీ చేశారు. ఎదుటి వ్యక్తి బాధను తన బాధగా భావించి సహాయం చేసే మనస్తత్వంతోనే వాలంటీర్లు శిక్షణకు హాజరయ్యారని రంగనాథ్ అభినందించారు. ఈ సేవా భావాన్ని మరింత మందిలో పెంపొందించేలా ప్రతి వాలంటీర్ కృషి చేయాలని కోరారు. హైదరాబాద్‌లోని పలు కళాశాలలకు చెందిన యువత కావడంతో భవిష్యత్‌లో వారి సేవలను హైడ్రా వినియోగించుకుంటుందని తెలిపారు. నగరంలో తక్కువ స్థలంలో ఎక్కువ అంతస్తుల భవన నిర్మాణాల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వరదల నివారణకు చెరువులు, నాలాలు, కాలువల పరిరక్షణ కూడా ఎంతో ముఖ్యమన్నారు. పర్యావరణ హితమైన, మెరుగైన జీవన ప్రమాణాలతో కూడిన నగర నిర్మాణంలో యువత హైడ్రాతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. హైడ్రా అధికారులు వర్ల పాపయ్య, ఆర్. సుదర్శన్ మాట్లాడుతూ యువ ఆపద మిత్ర శిక్షణ ప్రాధాన్యతను వివరించారు. వారం రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణ ద్వారా ఎన్నో జీవిత నైపుణ్యాలు నేర్చుకున్నామని పలువురు వాలంటీర్లు తెలిపారు. నీరు, అగ్ని వంటి ప్రమాదాలపై ఉన్న భయాలు తొలగిపోయి, ఇతరులను రక్షించే ధైర్యం వచ్చిందన్నారు. హైడ్రా కేవలం కూల్చివేతల సంస్థ కాదని, భవిష్యత్ నగర నిర్మాణంలో కీలక పోషించే సంస్థ అని అన్నారు.

## డిజెలపై పోలీసుల పాట



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** పండుగలు, ఉత్సవాల్లో డీజేల మోత ప్రజలను ఎంతలా ఇబ్బంది పెడుతుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తీవ్రమైన శబ్ద కాలుష్యంతో వృద్ధులు, చిన్నపిల్లలు, గుండె జబ్బులు ఉన్న రోగులు పడే అవస్థలను దృష్టిలో ఉంచుకుని ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు తెలంగాణ పోలీసులు ఓ వినూత్న ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా విడుదల చేసిన ఓ అవగాహన గీతం ప్రస్తుతం సోషల్ మీడియా యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో విపరీతంగా ఆకట్టుకుంటోంది. రాంగోపాల్‌పేట్ సీఐ సురేష్ కుమార్ చొరవ తీసుకొని ఈ ప్రత్యేక గీతాన్ని తాను పాడి రూపొందించారు.

## డబుల్ ఇండ్ల కేటాయింపుల్లో అన్యాయం

### దానం నాగేందర్ మోసం చేశారంటూ ఫిర్యాదు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపుల్లో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ మోసం చేశారంటూ బాధితులు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలకు ఫిర్యాదు చేశారు. హైమాక్స్ ఎదురుగా దళిత సామాజికవర్గాలకు చెందిన వారి స్థలాల్లో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మిస్తే.. 11 మందికి రావాల్సిన ఇండ్లను కేటాయించకుండా దానం నాగేందర్ తన అనుచరులకు కేటాయించేలా చేశారని వారు ఆరోపించారు. ఈ విషయంపై చర్చిద్దామంటే ఇటీవల పోలీసుల చేత అక్రమంగా అరెస్ట్ చేయించారని బిఆర్‌ఎస్ నాయకురాలు తాండ్ర మేఘన వాపోయారు. మమ్మల్ని పోలీసులు బెదిరించారని కూడా ఆమె ఆరోపించారు. అప్పట్లో ఎన్‌టిఆర్ మాకు పట్టాలు ఇచ్చారని.. తెలంగాణ వచ్చిన తరువాత దానం మమ్మల్ని నిలువునా ముంచాడని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

## '4-బిన్ విధానంతో చెత్త వేరు చేయడం' అలవాటుగా మారాలి

### పౌరులకు ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి పిలుపు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంటి వద్దనే చెత్తను 4 బిన్‌ల ద్వారా వేరు చేసి అందించడం ప్రతి పౌరుడు అలవాటు చేసుకోవాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. చెత్తను మూల స్థాయిలోనే వేరు చేయడం ద్వారా వ్యర్థాల నిర్వహణను శాస్త్రీయ పద్ధతిలో మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చని ఆయన తెలిపారు.సుప్రీంకోర్టు ఆదేశాలు, స్వచ్ఛ భారత్ మిషన్–2026 మార్గదర్శకాలకు అనుగుణంగా 4 బిన్ సెగ్రిగేషన్ విధానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో '4బిన్ సెగ్రిగేషన్ క్యాంపెయిన్'తో పాటు 'ఫ్లోరల్ వేస్ట్ టు ఆర్గానిక్ ప్రొడక్ట్స్' కార్యక్రమాన్ని కమిషనర్ లాంఛనంగా ప్రారంభించారు. చిన్నారులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలకు చెత్త వేరు చేసే విధానం సులభంగా అర్థమయ్యేలా ప్రత్యేకంగా రూపొందించిన మస్కట్‌ను కమిషనర్ ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ప్రజల్లో మరింత విస్తృతంగా అవగాహన కల్పించేందుకు మూడు ఎల్‌ఈడి స్క్రీన్లతో కూడిన ప్రత్యేక ప్రచార వాహనాలను కూడా కమిషనర్ ప్రారంభించారు. ఈ వాహనాలు గణేశ్ నిమజ్జన కేంద్రాల వద్ద తిరుగుతూ 4బిన్ సెగ్రిగేషన్, పూల వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై ప్రజలకు సందేశాలను అందించనున్నాయి. పూల వ్యర్థాలను ఇతర చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి, వాటిని శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెస్ చేసి సేంద్రియ ఉత్పత్తులుగా మార్చే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు కమిషనర్ తెలిపారు. గణేశ్ నిమజ్జనోత్సవాల సమయంలో భారీగా వెలువడే పూలు, పచ్చ వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి పర్యావరణానికి హాని కలగకుండా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. సృజనాత్మక ప్రచార కార్యక్రమాల ద్వారా పరిశుభ్రత, వ్యర్థాల వేరు చేయడం, బాధ్యతాయుతమైన చెత్త నిర్వహణపై ప్రజల్లో అవగాహన పెంచే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నిమజ్జన కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, ఏర్పాటు చేసిన ప్రత్యేక సేకరణ కేంద్రాల్లోనే వేయాలని కమిషనర్ సూచించారు. వ్యర్థాల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఇంటి నుంచే చెత్తను వేరు చేసే ప్రక్రియ ప్రారంభమైతే నగర పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపడుతుందన్నారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, పర్యావరణహితమైన మల్కాజిగిరి నిర్మాణానికి ప్రతి పౌరుడు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసి అదనపు కమిషనర్ సి.ఎన్. రఘుప్రసాద్, ఎఈ నిఖిల, స్వచ్ఛ భారత్ బృందం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫీజుల చెల్లింపులో జాప్యం వద్దు

- పేదల విద్యకు రూ.8500 కోట్లివ్వాలి
- గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి
- తెలుగు సంక్షేమ భవన్ ముట్టడిలో ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల బకాయిల చెల్లింపులో జాప్యం చేయొద్దని జాతీయ బిసి సంక్షేమ సంఘంఅధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. 14లక్షల మంది పేద విద్యార్థులకు రూ.8500 కోట్ల ఫీజులివ్వాలని, కొత్తగా వంద బిసి కాలేజీ హాస్టళ్లు, 50 బిసి గురుకుల పాఠశాలల మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు మాసబ్ ట్యాంక్‌లోని తెలుగు సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. దీనికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీంను రద్దు చేయబోమని సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించడం హర్షణీయమన్నారు. కానీ, ఫీజుల స్కీంను పాత పద్ధతిలోనే అమలు చేయాలన్నారు. పెండింగ్ ఫీజులు చెల్లించి, పేద విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించాలని కోరారు. బోగస్ కాలేజీలపై ప్రభుత్వ విచారణను తాము అడ్డుకోబోమన్నారు. బోగస్ పేరిట అసలైన కాలేజీల్లోని విద్యార్థులకు నష్టం కలిగించొద్దన్నారు. హాస్టళ్లలో, గురుకులాల్లో సీట్లు పెంచాలని, సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వైఖరిలో మార్పురాకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని కృష్ణయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో బిసి సంఘం అధ్యక్షులు సి.రాజేందర్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్, కన్వీనర్‌లు మోదీ రాందేవ్, నిఖిల్ పటేల్, సి.రాజేందర్, బాలయ్య తదితర నేతలు పాల్గొన్నారు.

## వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యత తక్షణ కర్తవ్యం

### యుఎల్‌డి కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్



**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** ప్రస్తుత పరిస్థితుల్లో దేశం, రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీలు, ప్రజాతంత్ర, సామాజిక లౌకిక శక్తుల ఏకీకరణ, ఐక్యత అత్యంత అవశ్యకమని వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్య వేదిక కన్వీనర్ జస్టిస్.చంద్రకుమార్ తేల్చిచెప్పారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్య వేదిక ఆద్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, దేశంలో ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర సమస్యలలో మునిగి ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజల మంచి కోసం, ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్య వేదిక కృషి చేయనున్నదని తెలిపారు. ఆదివారం నిర్వహించిన ప్రథమ సదస్సు విజయవంతంగా జరిగిందని, ఆ సదస్సు విజయవంతం కోసం కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఐక్య వేదిక భవిష్యత్ కార్యాచరణను జస్టిస్ చంద్రకుమార్ ప్రకటించారు. వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు ఐక్యత ఆవశ్యకత వివరిస్తూ అక్టోబర్ మాసంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, ప్రధాన కేంద్రాల్లో సదస్సులు, సమావేశాలు, వివిధ రూపాలలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. మీడియా సమావేశంలో వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్య వేదిక నాయకులు ప్రొఫెసర్ వెంకట దాస్, బొజ్జా బిక్షమయ్య, కోలా జనార్ధన్, డాక్టర్.ఎస్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: కలెక్టర్





**ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ :**ఉద్యోగులు, అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల హెచ్చరించారు. సికింద్రాబాద్ తహసిల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించారు. కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజల పట్ల ప్రతి ఉద్యోగి జవాబుదారీతనంతో, పారదర్శకంగా వ్యవహరించాలని చెప్పారు. ధృవీకరణ పత్రాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకునే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని తెలిపారు. హాజరు పట్టికను పరిశీలించి గైర్హాజరైనవారికి షోకాజు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. ఈ ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ వెంట ఆర్డీఓ సాయిరాం, తహసిల్దార్ పాండునాయక్ తదితరులు ఉన్నారు.

# గణనాథులకు పూజలు







**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** వాడవాడలా కొలువైన గణనాథులకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే రాజీవ్‌నగర్ గణేశ్ మండపం వద్ద మంగళవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన 69 అడుగుల ఎత్తుతో ఖైరతాబాద్‌లో కొలువుదీరిన 'పంచముఖ సంకట హర మహా గణపతిని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్(టెక్ట్స్‌బుక్స్) పి.రాధారెడ్డి, ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ డా.పివి రవిశేఖర్‌రెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్టార్ యువజన సంఘం, ఉప్పుగూడ, లలితా బాగ్ స్టార్ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గం జై గణేష్ భక్తి సమితి ప్రెసిడెంట్ కాశమోని శ్యామ్‌రావ్ ముదిరాజ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్.రాజేందర్, బి.వెంకటేష్, జె.బాబురావు, కమలాచారి, భాస్కర్, మురళీధర్, సుధాకర్, లక్ష్మీ నారాయణ, హరీష్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## హరికిరణ్ అవినీతితో ప్రభుత్వానికి అప్రతిష్ఠ : చైర్మన్ రాచాల



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :**తెలంగాణ ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ అవినీతి చేష్టలతో ప్రభుత్వం తీవ్ర అప్రతిష్టపాలు అవుతుందని బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. హరికిరణ్ అవినీతి బాగోతాలు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఇటీవలే భద్రాచలం గంజాయి కేసు ఫోర్జరీ సంతకాల వ్యవహారంలో హరికిరణ్ దాదాపు రూ.కోటి లంచం తీసుకొని సదరు అధికారులపై నామమాత్రపు చర్యలు తీసుకొన్నారన్నారు. ఈ ఫోర్జరీ సంతకాల వ్యవహారంలో త్వరలో హైకోర్టులో పిటిషన్ వేస్తామన్నారు. రెండుమూడు రోజుల్లో హరికిరణ్ రూ.14కోట్ల అవినీతి కుంభకోణాన్ని బయటపెడతామని తెలిపారు. అవినీతి హరికిరణ్‌ను ఆయన సొంతం రాష్ట్రం ఎపికి పంపించాలని సిఎం రేవంత్ రెడ్డికి రాచాల విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జెఎసి నేతలు గోటూరి రవీందర్ గౌడ్, ముత్యాల వినోద్ సాగర్, శ్రీధర్, సిద్ధార్థ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రాణహిత చేవెళ్ల'కు జాతీయ హోదా ఇవ్వాలి

### కేంద్రానికి ఎర్ర సత్యనారాయణ డిమాండ్



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** కేంద్రప్రభుత్వం ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణకు నీటి వాటా సమగ్రంగా వచ్చేలా చూడాలన్నారు. ఈ విషయమై రాజకీయ పార్టీల నేతలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. మాజీ సిఎం కెసిఆర్ చేపట్టిన ప్రాజెక్టులకు నీరు లభించకపోగా, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. పాత పద్ధతిలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీంను అమలు చేయాలని కోరారు. జాతీయ జనగణనలో ఒబిసి కాలమ్ చేర్చాలని డిమాండ్ చేశారు. ఒబిసిలకు విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లకు పార్లమెంట్‌లో చట్టం చేయాలని కోరారు. సమావేశంలో బిసి సంఘాల నేతలు నాగుల శ్రీనివాస్ యాదవ్, మీనగ గోపి, వంశీకృష్ణ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిల్మ్ అవార్డ్స్ ప్రదానోత్సవం

- దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకున్న అనంత్‌నాగ్
- యామీ గౌతమ్, మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్‌లు ఉత్తమ నటులుగా ఎంపిక
- అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



**ఎక్తానగర్ :** భారతీయ సినీ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. దశాబ్దాలుగా దేశ రాజధాని న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్ వేదికగా ఈ వేడుకను నిర్వహిస్తుండగా, ఈసారి మాత్రం 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమం గుజరాత్‌లోని కెవాడియాలో ఏర్పాటు చేశారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్ స్ఫూర్తితో తొలిసారిగా ఢిల్లీ వెలుపల నిర్వహించింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం విజేతలకు పురస్కారాలు అందించారు. 2024లో విడుదలైన సినిమాలు, నాన్ ఫీచర్ ఫిలిమ్స్‌కు సంబంధించి పలు కేటగిరీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఈ అవార్డులతో సత్కరించారు. ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్ ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని అందుకోగా, యామీ గౌతమ్, మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్‌లు ఉత్తమ నటులుగా ఎంపికయ్యారు. ఆదిత్య సుహాస్ జంభలే దర్శకత్వం వహించిన హిందీ చలనచిత్రం 'ఆర్టికల్ 370' ఉత్తమ చలనచిత్ర పురస్కారాన్ని అందుకుంది. నటుడిగా కెరీర్ ప్రారంభించి, దర్శకుడిగా మారిన రణదీప్ హుడా 'స్వతంత్ర వీర్ సావర్కర్' చిత్రానికి గాను ఉత్తమ తొలి దర్శకుడి పురస్కారాన్ని అందుకోగా, తమిళ చిత్రం 'అమరన్'కు గాను రాజ్‌కుమార్ పెరియసామి ఉత్తమ దర్శకత్వ పురస్కారాన్ని అందుకున్నారు. 'ఆర్టికల్ 370' చిత్రానికి గాను యామీ గౌతమ్ ఉత్తమ ప్రధాన నటి పురస్కారాన్ని అందుకున్నారు. అదే సమయంలో, 'బ్రహ్మయుగం' 'చందు ఛాంపియన్' చిత్రాలకు గాను మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్ వరుసగా ఉత్తమ ప్రధాన నటుడు పురస్కారాన్ని పంచుకున్నారు. సుమీరా రాయ్ దర్శకత్వం, నిర్మాణంలో రూపొందిన 'భంగార్' ఉత్తమ నాన్‌ఫీచర్ ఫిల్మ్ పురస్కారాన్ని అందుకుంది, దీనిని రాయ్ స్వీకరించారు. రాష్ట్రపతి చేతుల మీదుగా సంజీవ్ శ్రీవాస్తవ హిందీలో ఉత్తమ చిత్ర విమర్శకుడి పురస్కారాన్ని అందుకున్నారు. తమిళ చిత్రం 'మహారాజా'కు గాను సచనా నమిదాస్ ఉత్తమ సహాయ నటి పురస్కారాన్ని అందుకోగా, కన్నడ చిత్రం 'మిథ్యా'కు గాను రోపశ్రీ వర్కడి రెండవ ఉత్తమ సహాయ నటి పురస్కారాన్ని అందుకున్నారు. అభిషేక్ జైన్ దర్శకత్వం వహించిన 'మారన్' ఉత్తమ గుజరాతీ చిత్రం పురస్కారాన్ని అందుకుంది. తెలుగు చిత్రం 'పుష్ప: ది రూల్ పార్ట్02' ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ పురస్కారాన్ని అందుకోగా, అదే చిత్రానికి గాను బంద్రెడ్డి సుకుమార్ ఉత్తమ స్క్రీన్ ప్లే పురస్కారాన్ని అందుకున్నారు. తమిళ చిత్రం 'అమరన్'కు గాను ఆర్. కలైవన్నన్ ఉత్తమ ఎడిటింగ్ అవార్డును అందుకున్నారు. 'మైదాన్' చిత్రంలోని 'జానే దో' పాటకు గాను మనోజ్ ముంతాషిర్ ఉత్తమ గీత రచయిత అవార్డును అందుకున్నారు. 'భక్షక్' చిత్రానికి గాను బాలీవుడ్ నటుడు సంజయ్ మిశ్రా ఉత్తమ సహాయ నటుడు అవార్డును అందుకున్నారు. మరాఠీ చిత్రం 'ఘరత్ గణపతి'లోని 'నవసాచి గౌరీ మాజీ' పాటకు అభయ్ జోధ్‌పుర్కర్ ఉత్తమ పురుష నేపథ్య గాయకుడి అవార్డును అందుకోగా, మలయాళ చిత్రం 'ఎఆర్‌ఎం'లోని 'అంగు వాన కోనిలు' పాటకు వైకోమ్ విజయలక్ష్మి ఉత్తమ మహిళా నేపథ్య గాయని అవార్డును అందుకున్నారు. 'ఆర్టికల్ 370'లోని పాటలకు శశ్వత్ సచ్‌దేవ్ ఉత్తమ సంగీత దర్శకత్వ అవార్డును అందుకోగా, 'అమరన్' చిత్ర నేపథ్య సంగీతానికి జి.వి. ప్రకాష్ కుమార్ గౌరవించబడ్డారు. 'స్త్రీ 2'లోని 'ఆజ్ కీ రాత్' పాటకు విజయ్ గంగూలీ ఉత్తమ నృత్య దర్శకత్వ అవార్డును అందుకున్నారు.

## అయోధ్య రామమందిరం నుంచి...
# 105 సార్లు అనధికారికంగా కరెన్సీ తరలింపు

'ఉత్తర్వు'లో పేర్కొన్న సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామమందిరానికి వచ్చిన విరాళాల చోరీపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం.(సిట్) ఆలయ లెక్కింపు గది నుంచి నగదును అనధికారికంగా తరలించడం లేదా దాచిపెట్టడానికి సంబంధించిన 105 ఘటనలను గుర్తించిందని సుప్రీంకోర్టు తన ఉత్తర్వులో పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం, కోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదికను పరిశీలించింది. అయితే 200 కిలోల వెండి ఇటుకలు, 38.288 కిలోల వెండి ఇటుకలు, ఒక వెండి నెక్లెస్, చరణ్ పాదుక, రామచరిత మానస్‌కు సంబంధించిన 'విరాళం' నిర్వహణలో ఎటువంటి వ్యత్యాసాలు లేవని ఆ నివేదిక కనుగొంది. సెప్టెంబరు 25న లేదా అంతకంటే ముందుగా ప్రత్యేక దర్యాప్తు బృందం తన మొదటి ఛార్జిషీట్‌ను దాఖలు చేస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సోమవారం ధర్మాసనానికి తెలియజేశారు. ఉత్తరప్రదేశ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కిరణ్ ఎస్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం, విలువైన విరాళాలకు సంబంధించి మీడియా, సోషల్ మీడియాలో వచ్చిన ఆరోపణలను ధృవీకరించినట్లు పేర్కొంది. 'ఆలయంలోని యాత్రికుల సౌకర్య కేంద్రం (పిఎఫ్‌సి)లోని లెక్కింపు గదిలో ఉన్న సిసిటివి ఫుటేజ్, ఇతర డిజిటల్ డేటా, 'లెక్కింపు' ప్రక్రియలో పాల్గొన్న ఇతర వ్యక్తుల సహాయంతో, కౌంటింగ్ రూమ్ నుంచి అనధికారికంగా కరెన్సీని తీసివేయడం లేదా దాచిపెట్టిన 105 ఘటనలను వెల్లడించాయి' అని ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదిక వెల్లడించింది. 8మంది నిందితులను గుర్తించినట్లు, వారి ఖాతాలలో వివరించలేని డిపాజిట్ల పట్టిక సారాంశాన్ని, అలాగే దొంగిలించిన డబ్బును, పెట్టుబడి పెట్టిన స్థిరాస్తులు, చరాస్తుల గురించిన సమాచారాన్ని అందించినట్లు నివేదిక పేర్కొంది. 'ప్రతీ నిందితుడు చోరీ చేసినట్లు అంచనా వేయబడిన మొత్తాన్ని స్టేటస్ రిపోర్ట్ మరింత నొక్కిచెబుతోందని, అలాగే, కరెన్సీని లెక్కించే, నిర్వహించే ప్రక్రియ సమయంలోనే కౌంటింగ్ రూమ్‌లో అనుమానిత కరెన్సీ చోరీ జరిగిందని, ప్రస్తుతం ఉన్నటువంటి సాక్ష్యాలు సూచిస్తున్నాయని కూడా ఈ నివేదిక పేర్కొంటోందని ధర్మాసనం తన ఉత్తర్వులో పేర్కొంది. దుర్వినియోగం జరిగినట్లు అనుమానిస్తున్న చర్యలను గుర్తించడం, ఇందులో ప్రమేయం ఉన్న ఆ వ్యక్తులను పరీక్షించడం, వాటి ద్వారా వచ్చినట్లు అనుమానిస్తున్న సొమ్మును గుర్తించడం, ఆర్థిక, ఆస్తి విచారణ, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలను పరిశీలించడం, విలువైన వస్తువులను ధృవీకరించడం, సంబంధిత విరాళాలు, బ్యాంకింగ్ రికార్డులను సరిపోల్చడం వంటి పలు అంశాలపై దర్యాప్తు ఏకకాలంలో కొనసాగిందని ఆ నివేదిక తెలిపింది. విలువైన వస్తువులకు సంబంధించిన రికార్డులు, సామాగ్రిని పరిశీలించామని, ధృవీకరణలో ఎలాంటి వ్యత్యాసాలు కనుగొనలేదని సెప్టెంబరు 16నాటి ప్రత్యేక దర్యాప్తు బృందం నివేదిక వెల్లడించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్‌లో ఉంచిన 803 వస్తువులను భౌతికంగా తనిఖీ చేయగా, వాటి విషయంలో ఎలాంటి వ్యత్యాసాలను కనుగొనబడలేదని నివేదిక తెలిపింది. టిసిఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా 803 విలువైన వస్తువులకు సంబంధించి జారీ చేసిన రసీదులను ధృవీకరించగా, వాటికి సంబంధించిన రికార్డులు ట్రస్ట్ వద్ద ఉన్నట్లు నివేదిక వెల్లడిస్తోంది. ఈ వస్తువులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్‌లో భద్రపరచబడ్డాయి. దానిని భౌతికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ 803 వస్తువులకు సంబంధించి ధృవీకరణ సమయంలో ఎలాంటి వ్యత్యాసాలు కనుగొనబడలేదు' అని ఉత్తర్వులో పేర్కొన్నారు. రసీదు జారీచేయని మరో 86విలువైన వస్తువులను విడిగాగుర్తించి, భౌతికంగా ధృవీకరించినట్లు నివేదిక తెలిపింది. కరిగించడం కోసం ట్రస్ట్, సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు పంపిన సుమారు 944.411 కిలోల వెండికి సంబంధించిన రికార్డులను కూడా 'సిట్' పరిశీలించింది. సెప్టెంబరు 14నాటికి 173మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు అది తెలియజేసింది. పరీక్షించిన వారిలో ట్రస్ట్ కార్యకర్తలు, అకౌంటింగ్ సిబ్బంది, బ్యాంక్ అధికారులు, భద్రతా సిబ్బంద, ఛార్టర్డ్ అకౌంటెంట్లు ఉన్నారు. విరాళాల దొంగతనం ఆరోపణలపై నిష్పక్షపాతంగా, కాలపరిమితితో కూడిన విచారణ జరపాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై అంతకుముందు శ్రీరామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు కూడా నోటీస్ జారీ చేసింది. రామ మందిరంలో విరాళాల నిర్వహణలో అవకతవకల ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత, ఆర్‌జెడి ఎంపి సుధాకర్‌సింగ్‌తో సహా పలువురు పిటిషనర్లు ఆలయ ట్రస్ట్ ఆర్థిక వ్యవహారాలపై సిబిఐ దర్యాప్తు, ఫోరెన్సిక్ ఆడిట్ జరపాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# సరి కొత్త రికార్డు

- పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నివరధిక వాయిదాపై ఉత్కంఠ
- ఉభయసభలు వాయిదా పడి 40 రోజులు దాటినా అధికారికంగా ముగియకపోవడంపై కొనసాగుతున్న ఊహాగానాలు



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నివరధిక వాయిదాపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఉభయలు సభలు వాయిదా పడి 40 రోజుల దాటినా కూడా సమావేశాలు ఇంకా అధికారికంగా ముగియకపోవడం గమనార్హం. ఈ చర్యతో కొత్త సమావేశాలు నిర్వహించకుండానే ప్రభుత్వం ఒక కీలక చట్టాన్ని తీసుకురావాలని చూస్తోందనే ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. ఉభయ సభలు 40 రోజుల పాటు వాయిదా పడకుండా ఉండటం ఒక కొత్త రికార్డు అని మాజీ లోక్‌సభ సెక్రటరీ జనరల్ పి.డి.టి. ఆచారి పిటిఐకి తెలిపారు. 2015లో, పార్లమెంట్ ఉభయ సభలను 28 రోజుల తర్వాత వాయిదా వేశారని ఆయన గుర్తుచేశారు. అప్పుడు ప్రభుత్వం జిఎస్‌టి చట్టంపై ఏకాభిప్రాయం సాధించడానికి ప్రయత్నించిందని ఆయన పేర్కొన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలులోకి తీసుకురావడానికి ప్రభుత్వం మళ్లీ ఒక సవరణను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్లు బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. బడ్జెట్ సమావేశాల సమయంలో చేసిన గత ప్రయత్నం తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో విఫలమైన విషయం తెలిసిందే. జనాభా ఆధారిత నియోజకవర్గాల పునర్విభజన వల్ల లోక్‌సభ ప్రాతినిధ్యం తగ్గుతుందనే ఆందోళనతో ఉన్న, ముఖ్యంగా దక్షిణాది ప్రతిపక్ష పార్టీల నుంచి వస్తున్న ఆందోళనలను తగ్గించడానికి, ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఏకరీతిగా 50 శాతం సీట్ల విస్తరణను ప్రతిపాదిస్తోంది. లోక్‌సభ, రాజ్యసభ రెండూ ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడ్డాయి. సాధారణంగా తదుపరి మూడు, నాలుగు రోజుల్లో సమావేశాలు అధికారికంగా ముగుస్తాయి. కానీ ఈసారి, కడపటి వార్త అందే నాటికి కూడా వాయిదా నోటిఫికేషన్ జారీ కాలేదు. బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 18న ముగిసి, ఏప్రిల్ 20న వాయిదా పడ్డాయి. రాజ్యాంగ నిబంధనల ప్రకారం, ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి సమావేశాలను నిర్వహిస్తారు, వాయిదా వేస్తారు. శీతాకాల సమావేశాలు సాధారణంగా నవంబర్ చివరి వారంలో ప్రారంభమై క్రిస్మస్ పండుగకు ముందే ముగుస్తాయి.

## రామాలయ విరాళాల చోరీ కేసులో..
# చార్జ్‌షీట్ దాఖలుపై జాప్యమేల?

- బిజెపి ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రశ్నల వర్షం
- రాముడి పేరును అప్రతిష్టపాలు చేయొద్దని వ్యంగ్రాస్త్రాలు



**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామమందిర విరాళాల చోరీ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేయడంలో జాప్యంపై కాంగ్రెస్ ప్రశ్నించింది. అలాగే, 1971 నాటి బాలీవుడ్ పాట 'రామ్ కా నామ్ బద్‌నామ్ నా కరో' (రాముడి పేరును అప్రతిష్టపాలు చేయకండి)లోని సాహిత్యాన్ని ప్రస్తావిస్తూ బిజెపిపై వ్యంగ్యాస్త్రాలు సంధించింది. ఈ కేసులో పెద్ద చేపలను (ప్రధాన నిందితులను) కాపాడేందుకు ప్రయత్నం జరుగుతోందని ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది. మొత్తం వ్యవస్థపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవహారంలో దర్యాప్తు పూర్తి పారదర్శకంగా సాగేలా చూడాలని కాంగ్రెస్ తన డిమాండ్లను పునరుద్ఘాటించింది. అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయంలో విరాళాల దుర్వినియోగం వ్యవహారంలో కొత్త విషయాలు వెలుగుచూశాయని పేర్కొన్న ఒక మీడియా నివేదిక స్క్రీన్‌షాట్‌ను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ షేర్ చేశారు. ఆలయ ప్రాంగణంలోని సిసిటివి ఫుటేజీని ఫోరెన్సిక్ పరిశీలన చేయగా 105 చోరీ ఘటనలు బయటపడ్డాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వెల్లడించినట్లు ఆ నివేదిక తెలిపింది. కాగా, ప్రాథమిక దర్యాప్తులో గతంలో 70 ఘటనలు మాత్రమే నమోదయ్యాయి. 'చందా చోరీ, ఆస్థా ధోకా (విరాళాల చోరీ, విశ్వాసానికి ద్రోహం). 'దేఖో ఓ బిజెపి వాలోం, తుమ్ యే కామ్ నా కరో, రామ్ కా నామ్ బద్‌నామ్ నా కరో...''1971లో వచ్చిన దేవ్ ఆనంద్ చిత్రం 'హరే రామ హరే కృష్ణ'లోని 'దేఖో ఓ దీవానోం తుమ్ యే కామ్ నా కరో, రామ్ కా నామ్ బద్‌నామ్ నా కరో' అనే పాటలోని సాహిత్యాన్ని రమేశ్ ఈ సందర్భంగా సామాజిక మామధ్యమంలో ప్రస్తావించారు. అయోధ్య రామమందిరంలో విరాళాల చోరీపై దర్యాప్తు మొదలై మూడు నెలలు పూర్తయ్యేందుకు కేవలం మూడు రోజులే మిగిలి ఉన్నప్పటికీ, ఇప్పటికీ నిందితులపై ఛార్జ్‌షీట్ దాఖలు చేయకపోవడం సిగ్గుచేటని రమేష్ వ్యాఖ్యానించారు. సెప్టెంబర్ 25 నాటికి ఛార్జ్‌షీట్ దాఖలు చేయకపోతే, దేశంలోనే అత్యంత 'సిగ్గుచేటైన విరాళాల చోరీ కేసు'లో చిన్న స్థాయి నిందితులు బెయిల్ పొందేందుకు మార్గం సుగమమవుతుందని ఆయన పేర్కొన్నారు. 'ప్రభావశీల వ్యక్తులను (పెద్ద చేపలను) కాపాడే ప్రయత్నం జరుగుతోందన్న అనుమానం ఉన్నప్పుడు, అటువంటి సిట్ లేదా ప్రభుత్వ ఛార్జ్‌షీట్‌పై దేశ ప్రజలకు ఏ మాత్రం నమ్మకం ఉండదని మనం స్పష్టం చేయాలి. గతంలో ఇందులో ప్రస్తావించాల్సిన విషయం ఏమీ లేదని చెప్పినవారే, ఇప్పుడు తమ సొంత విచారణలో విరాళాల చోరీ ఘటనలు కేవలం సిసిటివిలోనే 70 సార్లు కాదు, 105 సార్లు నమోదయ్యాయని అంగీకరిస్తున్నారు, దీనిని వారు ఎంత ప్రయత్నించినా కాదనలేరు అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంలో ఎందుకు జాప్యం జరుగుతోందో అర్థం చేసుకోవడం కష్టం కాదని రమేశ్ అన్నారు.

**అసలు దొంగలు, వారికి అండగా నిలిచిన వారి నుండి ప్రజల దృష్టిని మళ్లించడమే ఈ వ్యవహారం వెనుక ఉన్న ఉద్దేశమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆరోపించారు.**

'అయోధ్యలోని శ్రీరామ మందిరంలో జరిగిన ప్రణాళికాబద్ధమైన విరాళాల చోరీకి సూత్రధారులుగా ఉన్నవారిని ఎవరు, ఎందుకు కాపాడుతున్నారు అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది' అని రమేష్ అన్నారు. ఈ తీవ్రమైన కేసులో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం 'విరాళాల చోరీ' నిందితులకు ఆయన అందిస్తున్న సహాయం గురించి తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతూనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అసలైన దోషులను కాపాడటానికి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగకుండా ఎవరు, ఎందుకు అడ్డుపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. ట్రస్ట్‌ను ఇంకా ఎందుకు రద్దు చేయలేదని కూడా రమేశ్ నిలదీశారు. సిట్ ముసుగులో, బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధం ఉన్న విరాళాల చోరీ కేసులోని నిందితులను కాపాడేందుకు బిజెపి 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని తాము భావిస్తున్నామన్నారు. ఇప్పుడు ప్రశ్న కేవలం నిందితుల గురించే కాదు, ఈ ఘటనలన్నీ ఎవరి పర్యవేక్షణలో జరిగాయో వారి బాధ్యత గురించి కూడా అని ఆయన అన్నారు.

# మహిళలపై మరింత హింసాత్మక దాడులు

- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ఆందోళన



**వయనాడ్ :** భారత్‌లో ప్రధాని మోదీ సర్కార్ హయాంలో మహిళలపై భయంకరమైన దాడులు రోజు రోజుకు పెరుగుతుండడమే కాకుండా అవి మరింత హింసాత్మకంగా మారుతున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఢిల్లీ, బిహార్‌లలో మహిళలపై ఇటీవల జరుగుతున్న లైంగిక దాడుల పట్ల ఆమె తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహిళలు వీధుల్లో సురక్షితంగా తిరిగేలా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. మహిళలపై జరుగుతున్న నేరాలను భయంకరమైనవిగా అభివర్ణించిన వాద్రా, మహిళలకు పరిస్థితులు ఎప్పుడూ అసురక్షితంగానే ఉండేవని, ఇప్పుడు ఆ పరిస్థితి మరింత తీవ్రమవుతోందన్నారు. 'ఇది చాలా భయంకరమైన విషయం. మహిళలపై నేరాలు పెరుగుతూనే ఉన్నాయి. మహిళలకు భద్రత ఎప్పుడూ లోపించే ఉంది, పైగా వారిపై దాడులు మరింత హింసాత్మకంగా మారుతున్నాయి. వీధుల్లో మహిళల భద్రతను కల్పించలేనప్పుడు, గొప్ప పథకాలు, కార్యక్రమాల గురించి మాట్లాడటంలో అర్థం లేదని భావిస్తున్నాను అని ప్రియాంక మంగళవారం కేరళంలోని ఆమె పార్లమెంట్ నియోజకవర్గమైన వయనాడ్‌లో విలేకరులతో అన్నారు. గత కొన్ని వారాలుగా దేశ రాజధానిలో మైనర్ బాలికలపై వరుస లైంగిక దాడులు జరుగుతుండడంపై ఆమె తీవ్రంగా మండిపడ్డారు. 'సెప్టెంబర్ 10న స్వరూప్ నగర్‌లో 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేశారు; 16న స్టేషనరీ వస్తువులు కొనడానికి వెళ్లిన ఒక మైనర్ బాలికపై సదర్ బజార్‌లోని ఒక దుకాణంలో లైంగిక దాడి జరిగింది; అలాగే 21న రాజధానిలో వేర్వేరు ఘటనల్లో ఆరేళ్ల బాలిక 17 ఏళ్ల యువతిపై లైంగిక దాడులు జరిగాయి. వీటితో పాటు, బిహార్‌లోని జముయి ప్రాంతంలో ఇంటికి తిరిగి వెళ్తున్న ఒక బాలిక, బాలుడిని కొందరు వ్యక్తులు రోడ్డు పక్కన వేధించారు' అని కొన్ని రోజుల పర్యటన నిమిత్తం కేరళలో ఉన్న కాంగ్రెస్ ఎంపి, మహిళల భద్రత అనే అంశంపై ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం, మహిళలకు భద్రత కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటాయనే దానిపై ఆలోచించాలని చెప్పారు. వయనాడ్ పర్యటనలో తన ప్రణాళికల గురించి మాట్లాడుతూ ఇది సుదీర్ఘ పర్యటన అని, వీలైనంత ఎక్కువ మందిని కలిసి వారి సమస్యలను లోతుగా అర్థం చేసుకోవడం ద్వారా తగిన చర్యలు తీసుకోగలనని ఆశిస్తున్నట్లు కాంగ్రెస్ ఎంపి తెలిపారు.

## బహిరంగ ప్రకటనలు చేసే ముందు
# సిపిఐ వందేళ్ల చరిత్ర తెలుసుకోవాలి

అవినీతిపై తమిళమంత్రి ఆధవ్ అర్జున వ్యాఖ్యలపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్ మండిపాటు

**చెన్నై :** అవినీతిపై తమిళనాడు మంత్రి ఆధవ్ అర్జున చేసిన వ్యాఖ్యలను ఆ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి ఎం. వీరపాండియన్ మంగళవారం తీవ్రంగా తప్పుబట్టారు. బహిరంగ ప్రకటనలు చేసే ముందు కమ్యూనిస్టు పార్టీకి ఉన్న వందేళ్ల చరిత్రను అధ్యయనం చేయాలని మంత్రికి సూచించారు. తన పార్టీకి ఉన్న స్వచ్ఛమైన చరిత్రను ప్రస్తావిస్తూ, గత 100 ఏళ్లలో భారత దేశంలో ఏ కమ్యూనిస్టు నాయకుడూ అవినీతి ఆరోపణలపై కోర్టులో దోషిగా తేలలేదని లేదా పోలీసు స్టేషన్‌లో అవినీతి కేసును ఎదుర్కోలేదని వీరపాండియన్ పేర్కొన్నారు. అక్టోబర్ 6న ఉప ఎన్నిక జరగనున్న మధురాంతకంలో విలేకరులతో మాట్లాడిన వీరపాండియన్, పార్టీ వైఖరిని స్పష్టం చేస్తూ... ప్రస్తుత ప్రభుత్వానికి సిపిఐ మద్దతు ఇవ్వడం అనేది ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తీసుకున్న ప్రజాస్వామ్య నిర్ణయమని చెప్పారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ఉద్దేశం పార్టీకి లేదని, తాము సామాన్య ప్రజల పక్షాన నిలబడతామని ఆయన అన్నారు. అదే సమయంలో, ప్రభుత్వం తన సూత్రాల నుండి పక్కదారి పడితే గళమెత్తడమో లేదా నిరసనలు తెలపడమో చేస్తామని స్పష్టం చేశారు. 'సమాజం అత్యంత గౌరవంగా భావించే బైబిల్, పురాణాల వంటి చారిత్రక, మతపరమైన, సాహిత్య గ్రంథాలలో కూడా ఇటువంటి స్వచ్ఛమైన చరిత్ర అరుదుగానో లేదా అసలు లేకపోవడమో జరుగుతుంది అని సిపిఐ నైతిక విలువలను ప్రస్తావిస్తూ వీరపాండియన్ వ్యాఖ్యానించారు. గత డిఎంకె పాలనలో జరిగిన అవినీతిపై వామపక్ష పార్టీలు మాట్లాడాలని ప్రజా పనులు, క్రీడల శాఖ మంత్రి కోరిన కొద్ది రోజులకే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత డివికె ప్రభుత్వంతో పార్టీ సంబంధం గురించి మాట్లాడుతూ, బయటి నుండి మద్దతు ఇవ్వాలనే నిర్ణయం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, రాష్ట్రంలో గవర్నర్ పాలనను నివారించడానికి ప్రజాస్వామ్యబద్ధంగా తీసుకున్నామని వీరపాండియన్ స్పష్టం చేశారు. రాజకీయ అస్థిరతపై వస్తున్న ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు. ప్రభుత్వాన్ని కూల్చివేసే ఉద్దేశం వామపక్ష పార్టీలకు లేదన్నారు. 'మా ప్రాథమిక నిబద్ధత పేదలు, సామాన్య ప్రజల పట్ల మాత్రమే ఉంటుంది, ఏ ప్రభుత్వం పట్ల కాదు' అని వీరపాండియన్ అన్నారు. ప్రభుత్వం తన సూత్రాల నుండి పక్కదారి పడినా లేదా సంక్షోభాన్ని సృష్టించినా గళమెత్తడానికి లేదా నిరసనలు తెలపడానికి పార్టీ వెనుకాడదని ఆయన చెప్పారు.

## జముయిలో బాలికపై వేధింపుల ఘటన..
# ఎన్‌కౌంటర్‌లో నిందితులకు గాయాలు

**పాట్నా :** బిహార్‌లోని జముయిలో బాలిక, బాలుడిపై కొందరు దుండగులు వేధింపులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో వారిద్దరూ గాయపడ్డారని ఒక అధికారి తెలిపారు. దీంతో, సెప్టెంబర్ 19 నాటి ఈ ఘటనకు సంబంధించి అదుపులోకి తీసుకున్న వారి మొత్తం సంఖ్య ఐదుకు చేరింది. ముంగేర్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డిఐజి) రాకేష్ కుమార్ మాట్లాడుతూ, నిందితులలో ఒకరైన నందన్ యాదవ్ కాలికి బుల్లెట్ గాయం తగిలిందని తెలిపారు. నిందితులను పట్టుకోవడానికి సోమవారం నుంచే పోలీసులు దాడులు నిర్వహిస్తుండగా, తప్పించుకుని పారిపోవడానికి ప్రయత్నించిన మరో నిందితుడు హరిరామ్ యాదవ్ మోకాలి ఎముక విరిగిందని ఆయన చెప్పారు. 'నందన్, హరిరామ్ ఇద్దరినీ ఆసుపత్రిలో చేర్చారు. అంతకుముందు ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకున్నాము; వారి విషయంలో జువెనైల్ జస్టిస్ బోర్డు చర్యలు తీసుకుంటుంది' అని జముయిలో ఉన్న డిఐజి ఫోన్ ద్వారా పిటిఐకి తెలిపారు. ఈ ఘటన వెలుగులోకి వచ్చినప్పటి నుండి ఆయన అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు. 'హరిరామ్, నందన్ కోలుకున్న తర్వాత వారిని విచారించి, మరికొందరిని అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది. వీడియో క్లిప్ ఆధారంగా చూస్తే, ఈ ఘటనలో కచ్చితంగా ఎంతమంది పాల్గొన్నారనేది స్పష్టంగా తెలియలేదు. అయితే, ప్రధాన నిందితులు పట్టుబడ్డారని మనం కచ్చితంగా చెప్పవచ్చు. వాస్తవానికి, ఆ వీడియో క్లిప్‌లో ముఖానికి స్కార్ఫ్ చుట్టుకుని గుంపుకు నాయకత్వం వహిస్తున్నట్లు కనిపించింది హరిరామే' అని ఆయన అన్నారు. ఒకే కోచింగ్ సెంటర్‌లో చదువుకుంటున్నట్లు చెబుతున్న ఆ బాలిక, బాలుడిని ఒక గ్రూపు దారిలో అడ్డగించి వేధించింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో క్లిప్‌లలో, ఆ బాలికను అసభ్యంగా తాకడం కనిపించింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయనప్పటికీ, నిందితులలో ఒకరు తీసినట్లు భావిస్తున్న వీడియో క్లిప్‌లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సోమవారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.

# రైతులపై వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్ ప్రయోగం

- తక్షణమే ధాన్యం సేకరించాలని పంజాబ్‌లో రోడ్డెక్కిన అన్నదాతలు
- షాహాబాద్‌లో పరిస్థితి ఉద్రిక్తం: పోలీసుల అదుపులో రైతులు



**షాహాబాద్ :** ధాన్యం సేకరణపై పంజాబ్‌లో రైతులు రోడ్డెక్కారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాలలో సేకరణను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం షాహాబాద్ వద్ద ఢిల్లీ–చండీగఢ్ జిటి రోడ్డును దిగ్బంధించారు. భారతీయ కిసాన్ యూనియన్ (చారుని)కు చెందిన నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు వాటర్ కెనాన్లు, టియర్ గ్యాస్ ఉపయోగించారు. పలువురు నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు బికెయు (చారుని) అధ్యక్షుడు గుర్నామ్ సింగ్ చారుని ఆరోపించారు. సాధారణంగా రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ అక్టోబర్ 1న ప్రారంభమవుతుంది. అయితే, గత సంవత్సరం సేకరణ సెప్టెంబర్ 22న మొదలైంది. కాగా ఈ ఏడాది కూడా తక్షణమే చేపట్టాలని జిటి రోడ్డుకు సమీపంలో ఉన్న షహీద్ ఉధమ్ సింగ్ మెమోరియల్ వద్ద ఉదయం నుంచి వందలాది మంది రైతులు సమావేశమయ్యారు. బికెయు (చారుని) నాయకుడు గుర్నామ్ సింగ్ చారుని, కురుక్షేత్ర డిప్యూటీ కమిషనర్ విశ్రామ్ కుమార్ మీనాల మధ్య సుమారు గంటన్నర పాటు సమావేశం జరిగింది. అయితే, చర్చలు విఫలమవడంతో నిరసనకారులు జిటి రోడ్డు వైపు దూసుకెళ్లారని బికెయు (చారుని) నాయకులు పేర్కొన్నారు. నిరసనకారులు హైవేకి చేరుకోకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు, కానీ వారు వాటిని ఛేదించుకుని జిటి రోడ్డులోకి ప్రవేశించడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. నిరసనకారులను చెదరగొట్టే ప్రయత్నంలో పోలీసులు మొదట వాటర్ కెనాన్లను ఉపయోగించారు. రైతులు అక్కడినుంచి కదలడానికి నిరాకరించడంతో, టియర్ గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించారు. రైతులు తమ నిరసనను కొనసాగించడంతో షాహాబాద్‌లో పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది. వెంటనే ధాన్యం సేకరణను ప్రారంభించాలన్న తమ డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. జాతీయ రహదారి44పై సాధారణ ట్రాఫిక్‌ను పునరుద్ధరించినట్లు పోలీసులు తర్వాత తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి వరి సేకరణను ప్రారంభించాలని రైతులు ఇంతకు ముందు హర్యానా ప్రభుత్వాన్ని కోరారు.

# తమిళనాడులో 'అల్పాహారం' విస్తరణ

ప్రభుత్వ మిడిల్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన సిఎం విజయ్



**చెన్నై :** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ మంగళవారం పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకం విస్తరించారు. తిరువన్మియూర్‌లోని గాంధీ గ్రామంలో ఉన్న ప్రభుత్వ మిడిల్ స్కూల్‌లో విజయ్ ఈ పథకాన్ని ప్రారంభించి, విద్యార్థులకు స్వయంగా ఆహారాన్ని వడ్డించడమే కాకుండా వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం, ఆయన తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. దీనివల్ల 15,454 ప్రభుత్వ, ప్రభుత్వసహాయక పాఠశాలల్లోని 6 నుండి 8వ తరగతి వరకు చదువుతున్న సుమారు 15.30 లక్షల మంది అదనపు విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కె. కామరాజ్ గౌరవార్థం 'పెరుంతలైవర్ కామరాజర్ అల్పాహార పథకం'గా పిలువబడే ఈ పథకం విస్తరణ, 6 నుండి 8వ తరగతి విద్యార్థులను కవర్ చేస్తుంది. ఇది విద్యార్థుల పోషకాహార విషయంలో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తూ, వారు ఆరోగ్యకరమైన రీతిలో తమ రోజును ప్రారంభించేలా చేస్తుంది. ఈ విస్తరణకు మద్దతుగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అదనంగా రూ. 217.63 కోట్లు కేటాయించారు. దీంతో ఈ కార్యక్రమానికి మొత్తం బడ్జెట్ రూ. 724 కోట్లకు చేరింది. వాస్తవానికి ఈ పథకాన్ని ఈ నెల 17న ప్రారంభించాలని అనుకున్నప్పటికీ, పెట్టుబడుల సేకరణ కోసం విజయ్ లండన్‌కు వెళ్లాల్సి రావడంతో దీనిని వాయిదా వేశారు. మధురాంతకం, ధరాపురం అసెంబ్లీ నియోజకవర్గాల్లో అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున, చెంగల్‌పట్టు, తిరుప్పూర్ జిల్లాల్లో ఈ పథకం అమలు కాదు.

# నేటి నుంచి జనరల్ అసెంబ్లీ కీలక సమావేశాలు

- యుద్ధం, అదుపుతప్పిన ఎఐ, ఎల్‌నినో ఎజెండా
- నాలుగు ఖండాల నాయకులతో చర్చలకు ట్రంప్ సమాయత్తం
- హోర్ముజ్ అడ్డంకులు తొలగించేందుకు ఫ్రాన్స్ తీర్మాన యత్నం
- జిన్‌పింగ్, పుతిన్, మోదీ గైర్హాజరు



**న్యూయార్క్:** న్యూయార్క్‌లో ప్రపంచ దేశాల నాయకుల సందడి ప్రారంభమైంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 81వ వార్షిక సమావేశాలలో సెప్టెంబరు 23 నుండి వారం రోజులపాటు కీలక దేశాల నాయకులు ప్రధాన ప్రసంగాలు చేయడానికి రంగం సిద్ధం కావడంతో ప్రపంచ మీడియా దృష్టి అటువైపే మళ్ళింది.పశ్చిమాసియా, యూరప్‌లో యుద్ధాలు,అదుపు తప్పిన కృత్రిమ మేధ వల్ల ఎదురవుతున్న భయాలు,వాతావరణ మార్పులు, ఎల్‌నినో, ఉగ్రవాదం, ఐక్యరాజ్యసమితి భవిష్యత్తు, సంస్కరణలు వంటి వన్నీ ప్రధాన ఎజెండాగా ఈ సమావేశాల్లో వాడీ వేడీగా చర్చలు సాగనున్నాయి.అదేవిధంగా హోర్ముజ్ జలసంధిని తెరపించేందుకు ఎదురవుతున్న అడ్డంకులను అధిగమించేందుకు వీలుగా భద్రతామండలి తీర్మానం చేసేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఒక ముసాయిదాను తయారు చేస్తున్నట్లు సంబంధిత దౌత్యవర్గాలు పేర్కొన్నాయి. న్యూయార్క్‌తో పాటు ఆ పరిసరాల్లో భారీ భద్రతను మోహరించారు. 130 దేశాలకు చెందిన ప్రముఖ నాయకులు, ప్రభుత్వాధినేతలు, డజన్లసంఖ్యలో మంత్రులు ఈ సమావేశాలలో తమ తమ నిర్దేశిత సమయాలలో ప్రసంగాలకు సిద్ధమయ్యారు. జెలెన్స్కీ(ఉక్రేన్),పెజెష్కియన్(ఇరాన్) బుధవారం సమావేశంలో ప్రసంగిస్తారు.

కాగా ఈ సందర్భంగా ట్రంప్ నాలుగు ఖండాల నాయకులతో విస్తారంగా చర్చలు జరపనున్నారు.సమితి సమావేశంలో ప్రసంగించడంతోపాటు 11 ప్రధాన దేశాల నాయకులతో కీలక సమావేశాలు,ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహిస్తారు.గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకునే తీర్మానంపై సంతకాలు జరగడం ఒక ప్రముఖ ఘట్టం. బ్రిటన్, వెనజులా, ఉక్రేన్, డెన్మార్క్, గ్రీన్‌లాండ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్,సౌదీఅరేబియా, ఒమన్, బహ్రైన్, కువైట్, ఖతార్ దేశాల నాయులతో ట్రంప్ ముఖాముఖీ సమావేశాలు నిర్వహిస్తారు. విందు సమావేశాల్లో డజన్ల సంఖ్యలో నాయకులతో ఆయన ముఖాముఖీ సంభాషణలు చేస్తారు. ముఖ్యంగా బ్రిటన్ ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్న ఆండీ బర్న్‌హామ్‌తో {అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్,ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ జనరల్ అసెంబ్లీలో ప్రముఖంగా ప్రసంగించనున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మూడు రోజులు అమెరికాలో పర్యటించి ట్రంప్‌తో సంభాషణలు చేస్తున్నప్పటికీ ఆయన కూడా జనరల్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడంలేదు. కాగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్, భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఈ సమావేశాల్లో పాల్గొనకుండా దూరంగా ఉన్నారు. భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు.

ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్,ఆ దేశ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చిలకు మాత్రమే న్యూయార్క్ వెళ్ళడానికి అమెరికా వీసాలు మంజూరు చేసింది. వారి వెంట వెళ్ళాల్సిన ఉన్నతస్థాయీ అధికార బృందాలకు వీసాల అనుమతి ఇచ్చేందుకు అమెరికా తిరస్కరించింది.ఇదిలా ఉండగా, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అరెస్టు వారెంటు తలపై మోసుకు తిరుగుతున్న ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ కూడా న్యూయార్క్ సమావేశాల్లో పాల్గొంటున్నారు. న్యూయార్క్ అధిపతి మమ్దానీ ఆయన రాకను తిరస్కరించినప్పటికీ, ఆయనను అరెస్టు చేసే అధికారాలు మమ్దానీ చేతుల్లో లేవు. దీంతో మమ్దానీ నిస్సహాయంగా ఉండిపోయారు. పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ వరుసగా రెండో సంవత్సరం కూడా జనరల్ అసెంబ్లీ సమావేశాలకు వెళ్ళడం లేదు. ఐతే ఆయన దృశ్యమాధ్యమ విధానం ద్వారా జనరల్ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగిస్తారు.ఈ సమావేశాల సందర్భంగా ట్రంప్‌తో అనేకమంది ప్రపంచ నాయకులు విడివిడిగా ద్వైపాక్షిక ముఖాముఖీ సంభాషణలకు సిద్ధమయ్యారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కూడా ట్రంప్‌తో ముఖాముఖీ చర్చలు చేయనున్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ పదవీకాలం డిసెంబరు 31వ తేదీతో ముగియనున్నది. ఈ సారి ఒక మహిళకు ప్రధాన కార్యదర్శి పదవి చేపట్టే అవకాశాలు దిట్టంగా కనిపిస్తున్నాయి.తదుపరి వారసులెవరో తెలియని పరిస్థితుల్లో ఈ సమావేశాలకు మరింత ప్రాధాన్యత వచ్చింది.ఐతే ట్రంప్ వైఖరిని చూసినప్పుడు ఆయన ఈ ప్రపంచ సంస్థనుండి వైదొలగుతారని అందరూ ఆ మధ్య భావించారు. కానీ ఆయన అలాంటి ప్రకటన చేయలేదు. గడచిన 12 నెలలుగా ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నది. దీనివల్ల శాంతి పరిరక్షణ కార్యకలాపాలు,మానవతా సహాయంలో కూడా ఈ సంస్థ భారీగా కోతలు విధించాల్సివచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల సంఖ్యను కూడా కుదించుకుంది. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలు తీసుకురావాలని భారత్–చైనా దేశాలు పదే పదే ఎలుగెత్తి చాటుతున్నాయి.ఐక్యరాజ్యసమితి వ్యవహారాలను నిశితంగా పరిశీలిస్తున్న అంతర్జాతీయ నిపుణుడు రిచర్డ్‌గోవాన్ మాట్లాడుతూ, ఈ అంతర్జాతీయసంస్థ అంతులేని శాశ్వత సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.పశ్చిమాసియాలో యుద్ధ నివారణ,ఉక్రేన్ యుద్ధ సమస్య పరిష్కార చర్యలు,ప్రపంచశాంతి సంరక్షణ,ఇజ్రాయెల్–పాలస్తీనా సమస్య పరిష్కారం వంటి విషయాలలో ఈ అంతర్జాతీయ సంస్థను పూర్తిగా పక్కకు గెంటేశారని, అది తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించలేకపోయిందని అన్నారు.

## వారం రోజుల్లో హోర్ముజ్ తెరుస్తాం: ఇరాన్



**టెహ్రాన్:** అమెరికా సేనలు వెనక్కి తగ్గితే వారం రోజుల్లో హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు సిద్ధంగా ఉన్నామని ఇరాన్ ప్రకటించింది. అమెరికా గనుక పశ్చిమాసియాలో సైనిక ఒత్తిడి తగ్గించే చర్యలు తీసుకుంటే, సేనలను తగ్గించుకుని వెనక్కి వెళ్ళిపోతే జలసంధిని తెరిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీనియర్ ఇరానియన్ అధికారి ఒకరు మంగళవారం క్యోడో న్యూస్ ఏజన్సీకి చెప్పారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్నవేళ ఇరాన్ నుండి ఈ ప్రకటన వెలువడింది.తాము జలసంధి తెరవాలంటే ముందుగా అమెరికా చొరవ తీసుకోవాలని ఆ సీనియర్ అధికారి కోరారు. ''మేం సిద్ధంగా ఉన్నాం,కానీ అమెరికా మాత్రం చిత్తశుద్ధితో వ్యవహరించాలి, ముందడుగు వేయాలి,చొరవ చూపించి సమస్య పరిష్కారానికి సీరియస్‌గా దృష్టిపెట్టాలి,దౌత్యాన్ని ముందుకు తీసుకు వెళ్ళాలి'' అని ఆయన కోరారు.హౌతీ తిరుగుబాటు సైన్యాలు పేట్రేగి, ముందుకు ఉరుకుతున్న తరుణంలో ఇరాన్–అమెరికా మధ్య మరోసారి దాడులు భీకరంగా ప్రారంభమయ్యే పరిస్థితులు ఉన్నాయని వార్తలు బలంగా వినిపిస్తున్న తరుణంలో, మరోవైపు హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులపై సెంట్‌కామ్ దిగ్బంధనం అమలు కొనసాగుతూ ఉండటం,జనరల్ అసెంబ్లీ వేదికపై ఇరాన్ వాదనలు వినిపించేందుకు ఆ దేశ నాయకులు న్యూయార్క్ బయలుదేరడం వంటి పరిణామాలమధ్య ఇరాన్ సీనియర్ అధికారి ద్వారా ఈ ప్రకటన బయటకు వచ్చింది. న్యూయార్క్ సమావేశాల్లో అమెరికా–ఇరాన్‌లకు చర్చల్లో మధ్యవర్తులుగా ఉన్న దేశాలతో ముమ్మర చర్చలు జరపాలని కూడా ఇరాన్ భావిస్తోంది. అమెరికా చొరవ చూపిస్తే జలసంధి తెరవాలన్న ప్రతిపాదనకు సుప్రీంనేత మొజ్తాబా ఖమేనీ,సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కూడా సుముఖంగా ఉన్నారన్న సంకేతాలు వెలువడినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక పేర్కొంది.

### న్యూయార్క్‌లో అడుగుపెట్టిన పెజెష్కియన్,అబ్బాస్ అరాఘ్చి

ఇరాన్–అమెరికా మధ్య యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో మొదటిసారి ఇరాన్‌కు చెందిన అత్యున్నతస్థాయీ నాయకులు ఇద్దరూ అమెరికా కీలక అంతర్జాతీయ నగరం న్యూయార్క్‌లో కాలుమోపారు. వీరిలో ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి ముందుగానే న్యూయార్క్ చేరుకున్నారు. ఆయన వెంట ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ తర్వాత న్యూయార్క్‌లో దిగారు. సమకాలీన ప్రపంచ పరిస్థితులపై ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ వైఖరిని తెలియజేయడంకోసమే తాము వచ్చామని వారు చెప్పారు.న్యూయార్క్ చేరుకున్న తర్వాత అబ్బాస్ అరాఘ్చి ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్‌తో ఫోన్‌లో సంభాషించారు. జనరల్ అసెంబ్లీ అజెండాపై ఆయనతో మాట్లాడారు.ఇరాన్ ప్రజల చట్టబద్ధ హక్కులు,ప్రయోజనాలు పరిరక్షించడానికి ఈ ప్రధాన అంతర్జాతీయ వేదికను ఉపయోగించుకోవడం తమ లక్ష్యమని ఇరాన్ జర్నలిస్టులకు అరాఘ్చి చెప్పారు.ఈ సమావేశాల్లో పాల్గొనకుండా ఇరాన్ అత్యున్నతస్థాయీ ప్రతినిధి బృందానికి ప్రవేశాన్ని అమెరికా చివరి నిమిషంలో నిషేధించింది.

కాగా ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ అమెరికా బయలుదేరేముందు మాట్లాడుతూ, జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రపంచం నమ్మకాన్ని నిలబెట్టి, యుద్ధాలు, రక్తపాతాన్ని ఆపగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వేదికపై ఇరాన్ వైఖరిని గట్టిగా సమర్థించుకుంటామని చెప్పారు.దురాక్రమణదారులవల్ల ఇరాన్ ఎంతటి దుస్థితి ఎదుర్కొంటున్నదో ఈ ప్రపంచవేదికపై అందరికీ తెలియజేస్తామన్నారు. అన్యాయాలు,అక్రమాలు ఎదురైనప్పటికీ ఇరాన్ ప్రజలు పట్టువదలకుండా ఐక్యంగా నిలబడ్డారని, మా శత్రువుకు గట్టి బుద్ధి చెబుతామని అన్నారు.మేం గర్వంగా తలెత్తుకుని ఈ యుద్ధం నుండి బయటపడ్డామని,మా వైఖరిని ప్రపంచానికి చాటి చెబుతామని అన్నారు.

## తెరమీదకి వైట్‌హౌస్ 24/7 'ట్రంప్ టీవీ'



**వాషింగ్టన్:** అమెరికా మీడియా(వైట్‌హౌస్ ప్రెస్‌పూల్ సంస్థ)తో డోనాల్డ్ ట్రంప్ వివాదం ముదిరింది.ఆయన వార్తల కవరేజీని అమెరికా టెలివిజన్ నెట్‌వర్కు బహిష్కరించింది.ఆ తర్వాత కొద్దిసేపటికే వైట్‌హౌస్ తన సొంత స్ట్రీమింగ్ ఛానల్ అయిన ''ట్రంప్ టీవీ''ని వైట్‌హౌస్ తెరమీదకు తెచ్చింది. 24/7 విరామం లేకుండా ట్రంప్ కార్యక్రమాలను ప్రసారం చేయడం ప్రారంభించింది. సిఎన్ఎన్,ఎంఎస్ నౌ,పొలిటికో మీడియా సంస్థలను వైట్‌హౌస్ నుండి బహిష్కరిస్తున్నట్లు ట్రంప్ మూడు రోజులక్రితం ప్రకటించారు. ఈ మీడియా సంస్థలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, అసత్య వార్తలతో తమ ప్రతిష్ఠను దిగజారుస్తున్నాయని, అలాంటి సంస్థలను నిషేధించే అధికారం తనకు ఉందని ట్రంప్ చెప్పారు. ఐతే వైట్‌హౌస్ కవరేజీ పరిధి నుండి మీడియా సంస్థలను నిషేధించే చట్టబద్ధమైన హక్కులు దేశాధ్యక్షుడికి లేవని ప్రకటిస్తూ, సిఎన్ఎన్,పొలిటికో,ఎంఎస్ నౌ సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సోమవారం సన్నాహాలు చేశాయి. ఈ మూడు మీడియాసంస్థలను వైట్‌హౌస్ ప్రాంగణంలో ప్రవేశాన్ని నిషేధించడంతో దీనికి ప్రతిస్పందనగా అమెరికా మీడియా నెట్‌వర్కులు ట్రంప్ కవరేజీని ఉమ్మడిగా నిలిపివేశా యి. పత్రికలు ఎలాంటి వార్తలు ప్రచురించాలో నిర్దేశించే అధికారం ప్రభుత్వానికి లేదని సిఎన్ఎన్,పొలిటికో,ఎంఎస్ నౌ సంస్థలు ప్రకటించాయి.అనేక ఇతర ప్ర సార సంస్థలు కూడా ట్రంప్‌తో ఉమ్మడి ప్రసార కార్యక్రమాలలో పాల్గొనబోమని ప్రకటించి బహిష్కరించాయి.ఈ కారణంగా డోనాల్డ్ ట్రంప్ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం ఎక్కడం గానీ,న్యూయార్క్‌లో ఆయన కార్యక్రమాలనుగానీ నెట్‌వర్క్ టీవీ ప్రసారం చేయడం నిలిపివేశాయి.

వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడి కార్యకలాపాలను ప్రసారం చేయడంలో ఖర్చులు తగ్గించుకోవడానికి,ప్రజలకు సులభంగా సమాచారం అందించడానికి మీడియా ఒక నెట్‌వర్కు ప్రెస్‌పూల్‌గా ఏర్పడింది. అంటే అధ్యక్షుడు ఎక్కడ ఉన్నా,ఏం చేస్తున్నా,సెలవుల్లో ఉన్నా,విమానంలో ఉన్నా ఆయనను అనుసరించి వార్తలను ఏకీకృతం చేయడానికి ఈ ప్రెస్‌పూల్ ఏర్పడింది. దీనిద్వారా కంటెంట్‌ను టెలివిజన్ నెట్‌వర్కులు పంచుకుంటాయి. ఈ ప్రెస్‌పూల్‌లో సిఎన్ఎన్,ఎబిసి, సిబిఎస్,ఫాక్స్‌న్యూస్,ఎన్‌బిసిలు సభ్యులుగా ఉన్నాయి. ఈ సంస్థలతోనే ఇప్పుడు ట్రంప్‌కు వివాదం తలెత్తింది. కవరేజీ సందర్భంగా టీవీ మీడియా ఆక్రమించే స్థలాన్ని తగ్గించుకోవడం,ఖర్చులు తగ్గించుకోవడం ద్వారా కంటెంట్‌ను పంచుకోవడం దీని వెనుక ఉన్న ఉద్దేశం.ప్రస్తుతం వైట్‌హౌస్‌లో మీడియా టీవీ బృందాలను నిర్వహించడానికి సహాయపడే పాత్రలో ఫాక్స్‌న్యూస్ రొటేటింగ్ బాధ్యతలు నిర్వహిస్తోంది. ఫాక్స్‌న్యూస్ న్యూస్ చీఫ్ బ్యూరో బ్రయాన్

### ప్రెస్‌పూల్‌తో ముదిరిన వివాదం: కవరేజీ బహిష్కరణ
### ఐక్యరాజ్యసమితి ప్రసారాలు నిలిపివేసిన నెట్‌వర్క్ పూల్

బ్రౌటన్ ద్వారా బిబిసికి అందిన మెయిల్ సమాచారంలో ఈ పూల్ ద్వారా ట్రంప్‌కు సంబంధించిన కార్యక్రమాలను ఈరోజు నుండీ కవర్ చేయదు అని రాశారు.

**నేను పెద్దగా ఆందోళన చెందలేదు: ట్రంప్**

చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ పర్యటన సందర్భంగా వైట్‌హౌస్ సౌత్‌లాన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెరైన్ వన్ హెలిపాడ్ ప్రారంభోత్సవం,రిబ్బన్ కటింగ్ కార్యక్రమాలలో ట్రంప్ పాల్గొన్నారు. ఉమ్మడి మీడియా నెట్‌వర్కు వీటిని ప్రసారం చేయలేదు.ఈ కార్యక్రమాన్ని వైట్‌హౌస్ వెబ్‌సైటులో ప్రత్యక్ష ప్రసారం చేసినప్పటికీ, ఆయన ప్రసంగం,వాయిస్ వినిపించలేదు.న్యూయార్క్ మేయర్ మమ్దానీతో సమావేశం తర్వాత ట్రంప్ టీవీలో కనిపించారు. మీడియా సభ్యులందరికీ పత్రికా గోష్ఠి నిమిత్తం స్వాగతం పలుకుతున్నట్లు మమ్దానీ తర్వాత అధ్యక్షుడు ట్రంప్‌కు తెలియజేశారు.దీనిపై ట్రంప్ వ్యాఖ్యానిస్తూ, ''ఇది చాలా బాగుంది, ఆసక్తికరంగా ఉంది, ఎందుకంటే మీడియా సభ్యులందరూ నన్ను బహిష్కరిస్తామని చెప్పారు,కానీ వారు నన్ను ఎప్పుడూ బహిష్కరించలేదు.అందువల్ల నేను ఎప్పుడూ ఈ విషయం గురించి ఆందోళన చెందలేదు, మరి ఇప్పుడు ఈ ప్రెస్ కవరేజీని చూడండి'' అన్నారు. అసలు విషయం ఏమిటంటే మమ్దానీతో కలిసి ట్రంప్ ఉన్నప్పుడు కవరేజీ విషయంలో ఎలాంటి సమస్యలూ తలెత్తలేదు.

## ఎసిబి కొరడా
(మొదటి పేజీ తరువాయి)

అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. అధికారులు.. మంగళవారం ఆయన నివాసంతో పాటు బంధువులు, స్నేహితులు, బినామీలు, ఇతర సంబంధిత వ్యక్తులకు చెందిన మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో డాక్యుమెంట్ విలువ ప్రకారం సుమారు రూ.6.13 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది. మార్కెట్ విలువ డాక్యుమెంట్ విలువ కంటే అనేక రెట్లు అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. ఎసిబి వివరాల ప్రకారం.. నోరి లక్ష్మీ భాస్కర్ (56) నిమ్స్‌లో అదనపు వైద్య సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఎర్రగడ్డలోని కల్పతరు అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్న ఆయనపై అవినీతి పద్ధతులు, అనుమానాస్పద మార్గాల ద్వారా తనకు తెలిసిన ఆదాయ వనరులకు మించి ఆస్తులు కూడబెట్టినట్లు కేసు నమోదు చేశారు. సోదాల్లో కుకట్‌పల్లిలోని హైరిజ్ గేటెడ్ కమ్యూనిటీలో ఒక 4బెడ్‌రూమ్ ఫ్లాట్, మరో రెండు ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు, మణికొండ, పేట్‌బషీరాబాద్, కుకట్‌పల్లిలో ఐదు డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. యాదాద్రి, నందిగామ, షామీర్‌పేటతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నగరంలో 800 చదరపు గజాల ఓపెన్ ప్లాట్ ఉన్నట్లు ఎసిబి వెల్లడించింది. అలాగే బ్యాంకు ఖాతాల్లో రూ.41 లక్షలు, పోస్టాఫీసు డిపాజిట్లలో రూ.12 లక్షలు, ప్రైవేట్ ఆర్థిక సంస్థల్లో రూ.35 లక్షల పెట్టుబడులు, మ్యూచువల్ ఫండ్లలో రూ.29.55 లక్షల పెట్టుబడులు ఉన్నట్లు గుర్తించారు. సుమారు 517.8 గ్రాముల బంగారు ఆభరణాలు కూడా సోదాల్లో బయటపడ్డాయి. మూడు కార్లు నాలుగు బైక్‌లు ఉన్నట్లు అధికారుల గుర్తించారు. సుమారు రూ.5 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు కూడా గుర్తించారు. ఈ మొత్తం స్థిర, చరాస్తుల డాక్యుమెంట్ విలువ సుమారు రూ.6.13 కోట్లుగా ఎసిబి ప్రాథమికంగా అంచనా వేసింది. అయితే వీటి మార్కెట్ విలువ డాక్యుమెంట్ విలువ కంటే అనేక రెట్లు అధికంగా ఉండవచ్చని ఎసిబి స్పష్టం చేసింది.ఈ మేరకు ఆయన్ని అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

### మరో రూ.2.63 కోట్ల లావాదేవీలపై ఆరా

సోదాల సందర్భంగా మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చినట్లు ఎసిబి పేర్కొంది. వివాదంలో ఉన్న ఒక ఫ్లాట్‌ను కొనుగోలు చేసేందుకు రూ.1.30 కోట్లు పెట్టుబడిగా పెట్టినట్లు గుర్తించారు. అంతేకాకుండా వివిధ వ్యక్తులకు రూ.1.33 కోట్లను చేతి అప్పులుగా ఇచ్చినట్లు కూడా అధికారులు గుర్తించినట్లు వెల్లడించారు. నోరి లక్ష్మీ భాస్కర్‌కు సంబంధించిన మరిన్ని ఆస్తులపై ఎసిబి అధికారులు ప్రస్తుతం అదనపు ధ్రువీకరణ చేపడుతున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఎసిబి తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాల ఎసిబి ప్రజలకు సూచించింది. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొంది.

## నీరు ఇవ్వండి
(మొదటి పేజీ తరువాయి)

మధ్యాహ్నం కలిశారు. జూరాలకు నీటి విడుదల, కర్ణాటక ప్రభుత్వంతో జరపాల్సిన సంప్రదింపులపై ముఖ్యమంత్రితో వారు చర్చించారు. ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాల్సిన అవసరంపై సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. జూరాల పరిధిలో సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరడం, అ వెంటనే ఈ అంశంపై సిఎం రేవంత్‌రెడ్డి కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సిఎంతో సమావేశం అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేల బృందం మంగళవారం సాయంత్రం బెంగళూరు వెళ్లింది. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌తో సమావేశమై ఆల్మట్టి–నారాయణపూర్ నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని తెలంగాణ తరపున విజ్ఞప్తి చేయనున్నారు. జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహాలు తగ్గిపోవడంతో ప్రాజెక్టు పరిధిలోని నీటి అవసరాలపై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యంగా సాగునీటి అవసరాలు, తాగునీటి అవసరాలు, దిగువ ప్రాంతాల్లోని రైతుల పరిస్థితిని కర్ణాటక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది.

### ఆల్మట్టి–నారాయణపూర్ నుంచి నీటి విడుదలపై చర్చ

కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల జూరాల నీటి లభ్యతపై ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల అంశాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ దృష్టికి తీసుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ మం త్రులు, ఎమ్మెల్యేల బృందం కర్ణాటక ప్రభుత్వంతో చ ర్చలు జరిపి జూరాలకు నీటి విడుదలకు అనుకూల నిర్ణయం తీసుకునేలా ప్రయత్నించనుంది. ఈ సమావేశంలో నీటి లభ్యత, ప్రస్తుత పరిస్థితులు, తెలంగాణ అవసరాలు తదితర అంశాలను వివరించనున్నట్లు సమాచారం.

### రైతుల అవసరాలపై దృష్టి

జూరాల ప్రాజెక్టు పరిధిలో సాగు నీటి అవసరాలతో పాటు తాగునీటి అవసరాలు కూడా కీలకంగా ఉన్నందున కర్ణాటకతో జరిగే చర్చల్లో ఈ అంశాలను తెలంగాణ బృందం ప్రస్తావించనుంది. నీటి విడుదలపై ఇరు రాష్ట్రాల మధ్య సమన్వయం సాధించడం ద్వారా దిగువ ప్రాంతాలకు నీటి లభ్యతను మెరుగుపర్చే అంశంపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు అధికారులు తెలిపారు.

## అగ్ని ప్రమాదం
(మొదటి పేజీ తరువాయి)



సలీం ఐదురోజుల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. అనంతరం మరో చిన్నారి కూడా ప్రాణాలు విడిచింది. పరిస్థితి విషమంగా ఉన్న 20 రోజుల చిన్నారిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ చిన్నారి మృతి చెందింది. మిగిలిన 24 మంది పిల్లల్ని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, వారి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు అధికారులు, వైద్యులు తెలిపారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా ఎసి పేలిపోవటం కలకలం సృష్టించింది. ఈ ఘటనతో ఉలిక్కిపడిన సిబ్బంది హాహాకారాలతో భయానక వాతావరణం నెలకొంది. ఏం జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో రౌండ్స్‌కు వచ్చిన డైరెక్టర్ జైసింగ్ విషయం తెలుసుకొని సిబ్బంది సహా అంబులెన్స్ డ్రైవర్లతో కలిసి ఎన్ఎన్‌సియు వెళ్లగా ఊపిరి ఆడనీయకుండా దట్టమైన పొగ అలముకుంది. ఈ ఘటన గురించి తెలుసుకున్న కలెక్టర్ రాజర్షి షా, ఎస్‌పి అఖిల్ మహాజన్ హుటాహుటిన రిమ్స్ ఆసుపత్రికి చేరుకున్నారు. దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టారు. బాధితులను ఓదార్చే ప్రయత్నం చేశారు. 'నేను ఒక పేషెంట్‌ను చూడటానికి వచ్చాను. ఆస్పత్రి డైరెక్టర్‌తో మాట్లాడుతున్న క్రమంలో ఒక నర్సు వచ్చి బ్లాస్ట్ అయ్యి పొగ వస్తుందని చెప్పడంతో అందరం లోపలికి వెళ్లాం. అప్పటికే నల్లటి పొగ కమ్ముకుంది. మొత్తం చీకటిగా ఉంది. కరెంటు కూడా లేదు. కొంతమంది పసిపిల్లలను బయటకు తీసుకొచ్చాం. పొగ కారణంగా మా దుస్తులు మొత్తం నల్లగా అయ్యాయి' అని ప్రత్యక్ష సాక్షి సంతోష్ తెలిపారు. అగ్నిప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఘటనలో ఇద్దరు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని సిఎం ఆదేశించారు.

### ఆస్పత్రిని సందర్శించిన మంత్రి దామోదర రాజనర్సింహ

ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలోని నవజాత శిశు సంరక్షణ విభాగంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపిస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మంగళవారం రిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన ఆయన, ప్రమాద స్థలాన్ని పరిశీలించి చిన్నారులకు అందుతున్న వైద్య సేవలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్, రిమ్స్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ఏసీ యూనిట్‌లో మంటలు చెలరేగి ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. ఘటనలో ముగ్గురు శిశువులు మృతి చెందడం బాధాకరమన్నారు. రిమ్స్‌లో ఎలక్ట్రికల్, ఫైర్, సివిల్ స్ట్రక్చర్ సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. అదనంగా 150 పడకల మదర్ అండ్ చైల్డ్ హెల్త్ భవనాన్ని ఏర్పాటు చేసి, రిమ్స్‌ను 950 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్బందులు...
(మొదటి పేజీ తరువాయి)

నిర్మించి ఉంటే వర్షాభావ సమయంలో వాటిని రైతులకు అందించగలిగేవారమన్నారు.సుమారు 70 టిఎంసిల నీటిని వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. జూరాల బదులు శ్రీశైలం నుంచి ప్రాజెక్టును చేపట్టడంతో నీటిని అధిక ఎత్తుకు ఎత్తిపోసే పరిస్థితి ఏర్పడి, నిర్మాణ వ్యయం, విద్యుత్ వినియోగం, నిర్వహణ భారం పెరిగిందని మంత్రి విమర్శించారు. తక్కువ వ్యయంతో పూర్తయ్యే ప్రాజెక్టును మార్చడం వెనుక ప్రజాప్రయోజనం లేదని ఆరోపించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును రూ.28 వేల కోట్లతో పూర్తి చేశామని బిఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం వాస్తవం కాదని ఉత్తమ్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర జల సంఘానికి సమర్పించిన డీపీఆర్ విలువ సుమారు రూ.55 వేల కోట్లు ఉందన్నారు. పూర్తి స్థాయి కాలువలు, భూసేకరణ, అనుబంధ పనులు కలిపితే మొత్తం వ్యయం రూ.70 వేల కోట్ల నుంచి రూ.80 వేల కోట్ల వరకు ఉండొచ్చని తెలిపారు. గత ప్రభుత్వం సుమారు రూ.27 వేల కోట్లు ఖర్చు చేసినా మూడో వంతు పనులు కూడా పూర్తి కాలేదని విమర్శించారు. 2014లోనే కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, రాజీవ్ భీమా ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని గుర్తుచేసిన ఉత్తమ్.. 2023 డిసెంబర్ వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం నీటిపారుదల రంగంపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఒక్క పెండింగ్ ప్రాజెక్టునూ సంపూర్ణంగా పూర్తి చేయలేదని ఆరోపించారు.ఎస్ఎల్‌బిసి సొరంగాన్ని గత ప్రభుత్వం పదేళ్లపాటు నిర్లక్ష్యం చేసిందని మంత్రి విమర్శించారు. జూన్ 2028 నాటికి సొరంగాన్ని పూర్తి చేస్తామని ప్రకటించారు. ఇది పూర్తయితే శ్రీశైలం జలాశయంలో పోతిరెడ్డిపాడు కంటే తక్కువ నీటిమట్టం నుంచే తెలంగాణకు నీటిని తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలు సరిపోతాయంటూ బిఆర్ఎస్ ప్రభుత్వం నాటి ఎపి ప్రభుత్వంతో లిఖితపూర్వకంగా అంగీకరించిందని తెలంగాణకు ద్రోహం చేసిందన్నారు. పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంపు, రాయలసీమ ఎత్తిపోతల పథకం వంటి పరిణామాలు కూడా బీఆర్ఎస్ పాలనలోనే చోటుచేసుకున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కృష్ణా జలాలను 280.7 టిఎంసీల మేర వినియోగించామని ఉత్తమ్ తెలిపారు. నీటి వినియోగంలో తమ ప్రభుత్వం రికార్డు సృష్టించిందన్నారు.

### కర్ణాటకను నీరు విడుదల చేయాలని కోరాం:

ప్రస్తుత నీటి కొరత నేపథ్యంలో రైతుల పంటలను కాపాడేందుకు కర్ణాటక నుంచి కొంత నీటిని విడుదల చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు ఉత్తమ్ తెలిపారు. నారాయణపూర్ జలాశయం నుంచి నీరు విడుదలైతే ఎగువ కృష్ణా ద్వారా జూరాలకు అదనపు ప్రవాహాలు చేరే అవకాశం ఉందన్నారు. అందుబాటులో ఉన్న నీటిని సాగుతో పాటు రానున్న వేసవిలో తాగునీటి అవసరాలకు సరిపడేలా జాగ్రత్తగా వినియోగిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత పరిస్థితి తెలంగాణలో కృష్ణా ఎగువ ప్రాంతంలో మరిన్ని నీటి నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని మంత్రి అన్నారు. వరదల సమయంలో నీటిని నిల్వ చేసి, వర్షాభావ సమయంలో రైతులకు అందించేలా రిజర్వాయర్లు, ఇతర నిల్వ వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు.

## అణిచివేత ధోరణి వద్దు
(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరగడం ఇదే తొలిసారి. సమావేశంలో సిఎంతో పాటు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, ఎంపిలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు తోట లక్ష్మీ కాంతరావు, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామేల్, మట్టా రాగమయి, వెడ్మ బొజ్జు, మురళీ నాయక్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డిజిపి సి.వి.ఆనంద్, రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జాతీయ ఎస్‌సి కమిషన్ డైరెక్టర్ సునీల్ బాబు, ఎస్‌సి కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రమంగా అయిదేండ్లలో ఎస్‌సి, ఎస్‌టిలపై అట్రాసిటీ కేసులు తగ్గుముఖం పట్టాయని అధికారులు వివరించారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో, ప్రధానంగా 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని నివేదించారు. అక్కడ పోలీసు విభాగం ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరముందని తెలిపారు. జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల మీటింగ్‌లు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని సిఎం అధికారులను ఆదేశించారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీస్ నిరోధక చట్టం కింద బాధితులకు చెల్లించాల్సిన నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని సిఎం అధికారులను ఆదేశించారు. బడ్జెట్ కేటాయింపులతో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేయాలన్నారు. అట్రాసిటీ ఘటనల్లో బాధితుల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించాలని, వారికి సకాలంలో నష్టపరిహారం, సహాయం, పునరావాసం అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఇటీవల షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసులను సిఎం ప్రత్యేకంగా ప్రస్తావించి, బాధిత కుటుబాలకు సత్వర న్యాయం చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రతి ప్రభుత్వ పథకం, కార్యక్రమంలో వారికి తగినంత ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. దళితులు, గిరిజనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటినుంచో సొంత బిడ్డల్లా ఆదరించిందని, అందుకే పల్లెపల్లెనా ఇప్పటికీ ఇందిరమ్మను తలుచుకుంటున్నారని చెప్పారు. పేదలకు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు పట్టాలు అందించిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీదని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్లో ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఎస్‌సి జనాభా దాదాపు 16 శాతం ఉంటే, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో 31 శాతం మంది లబ్ధిదారులు ఎస్‌సిలే ఉన్నారన్నారు. ఎస్‌టిల జనాభా 10 శాతం ఉంటే, వారికి 17 శాతం ఇండ్లను మంజూరు చేశామని సిఎం వివరించారు. రాష్ట్రంలోని 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, దీనివల్ల దళితులు, గిరిజనులు, ఆదివాసీలు సహా పేద కుటుంబాలకు నాణ్యమైన భోజనం అందుతోందన్నారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తోందన్నారు. చదువు ఒక్కటే జీవితాలను మారుస్తుందని, విద్యతోనే సమాజంలో అసమానతలకు, అణిచివేత రుగ్మతలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పిల్లలను చదువుతో పాటు క్రీడల వైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. 'ఈ ప్రభుత్వం ప్రజలది. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసమే పనిచేస్తుంది' అని ముఖ్యమంత్రి అన్నారు.

# ఏషియన్ గేమ్స్‌లో ఇండియాకు తొలి స్వర్ణం

## ఫైనల్‌లో శ్రీలంకపై ఘనవిజయం



ఆసియా క్రీడల్లో భారత మహిళల క్రికెట్ జట్టు సరికొత్త సృష్టించింది. మహిళల టి–20 క్రికెట్ పోటీల్లో భారత జట్టు ఘన విజయాన్ని సాధించి పసిడి పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. బుధవారం నిషిన్లోని కోరోగీ స్పోర్ట్స్ పార్క్ మైదానం వేదికగా జరిగిన పోరులో శ్రీలంక ను 147 పరుగుల తేడాతో చిత్తు చేసి భారత మహిళలు ఈ విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుత ఆసియా క్రీడల్లో భారత్‌కు ఇది మొదటి స్వర్ణ పతకం కావడం విశేషం. గతేడాది ఆసియా క్రీడల ఫైనల్లోనూ శ్రీలంకపైనే గెలిచి పసిడి సాధించిన టీమిండియా ఇప్పుడు వరుసగా రెండోసారి ఛాంపియన్గా నిలిచి ఆసియాలో తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ చారిత్రాత్మక పోరులో టాస్ గెలిచి ఫస్ట్ బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలీ వర్మ తొలి వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి కొండంత స్కోరుకు గట్టి పునాది వేశారు. స్మృతి మంధాన కేవలం 45 బంతుల్లో 7 సిక్సర్లు, 5 ఫోర్లతో 79 పరుగులు చేసి విజృంభించగా.. షెఫాలీ వర్మ 29 బంతుల్లో 48 పరుగులు సాధించింది. చివరిలో వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ కేవలం 22 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో నాటౌట్ గా 49 పరుగులు చేసి జట్టు స్కోరును 200 దాటించింది. అనంతరం 217 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక జట్టు ఆరంభం నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. శ్రీలంక కెప్టెన్ చమరి అటపట్టు 21 బంతుల్లో 29 పరుగులు చేసి టాప్ స్కోర్‌గా నిలవగా.. మిగిలిన బ్యాటర్లు భారత బౌలర్ల ధాటికి చేతులెత్తేశారు. దీంతో లంక జట్టు 15.4 ఓవర్లకే 69 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో శ్రీలంక దారుణ ఓటమిని మూటగట్టుకుంది. దీంతో లంక జట్టు రజత పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. మరోవైపు ఆసియా క్రీడల్లో కాంస్య పతక పోరులో బంగ్లాదేశ్‌ను 31 పరుగుల తేడాతో ఓడించిన పాకిస్తాన్ కాంస్య పతకం సాధించింది. టోర్నీ అంతటా ఆధిపత్యం చెలాయించిన భారత్ క్వార్టర్ ఫైనల్లో జపాన్‌ను, సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌ను, ఫైనల్లో లంకను చిత్తు చేసి ఆసియా క్రీడల్లో భారత రంగాన్ని పసిడితో మెరిపించింది.

# 2 పరుగులే తేడా..పరువు కాపాడుకున్న భారత్


## జపాన్‌తో చరిత్రాత్మక టి–20లో విజయం




ఆసియా క్రీడల నడుమ దౌత్య బంధానికి ప్రతీకగా జరిగిన చరిత్రాత్మక టి–20 మ్యాచ్‌లో జపాన్‌పై టీమిండియా విజయంతో మురిసింది. భారత్, జపాన్ 75 ఏళ్ల ఆత్మీయతకు సాక్షిగా నిలిచిన ఈ ఏకైక మ్యాచ్‌లో శ్రేయాస్ అయ్యర్ సేన ఏదో అలా గెలుపొందింది. ఇరవై ఓవర్ల ఆట అనుకున్నప్పటికీ.. వర్షం కారణంగా ఐదు ఓవర్లే సాధ్యపడగా రెండు పరుగుల తేడాతో ఆతిథ్య జట్టును ఓడించింది మెన్ ఇన్ బ్లూ. పద్దెనిమిదో ఆసియా క్రీడలు కొనసాగుతున్న వేళ.. భారత్, జపాన్ ఏకైక టి20 ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇరుదేశాల మధ్య 75 ఏళ్ల దౌత్య సంబంధాలకు ప్రతీకగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారతజట్టు రెండు పరుగుల తేడాతో విక్టరీ కొట్టింది. కంటోలోని సనోలో ఉన్న సనో ఇంటర్నేషనల్ క్రికెట్ మైదానంలో మంగళవారం పూర్తి ఓవర్ల ఆటకు వర్షం అడ్డుపడింది. తడి ఔట్‌ఫీల్డ్ కారణంగా అంపైర్లు, రిఫరీ 5ఓవర్లు ఆడించారంతే. ఇంకేముంది జపాన్ బౌలర్లను మనోళ్లు బెంబేలెత్తిస్తారనుకుంటే.. అఫ్గనిస్తాన్‌పై ఆఖరి టి–20లో మెరుపు సెంచరీ బాదిన ఓపెనర్ అభిషేక్ శర్మ(0) డకౌటయ్యాడు. **అయ్యర్ ఒక్కడే...**మరో ఓపెనర్ సంజూ శాంసన్(9)ను ఇబ్రహీం తకహాశీ వెనక్కి పంపాడు. అనంతరం.. ఇషాన్ కిషన్(3) సైతం తేలిపోయినా.. అయ్యర్(16) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా ప్రత్యర్థికి 32 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిండియా. ఆపై వాషింగ్టన్ సుందర్(2–13) విజృంభణతో జపాన్ బ్యాటర్లు క్రీజులో నిలవలేదు. ఓపెనర్ పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు. ఫలితంగా ఆతిథ్య జట్టు ఐదు ఓవర్లలో4 వికెట్ల నష్టానికి 32 పరుగులకే పరిమితమైంది. అయితే.. ఈ మ్యాచ్‌లో జపాన్‌లో క్రికెట్ విస్తరణకు కీలక అడుగు పడినట్టైంది. ఇరుదేశాల ద్వైపాక్షిక బంధానికి గుర్తుగా నిర్వహించిన ఈ మ్యాచ్‌పై జపనీయులు ఆసక్తి కనబరిచారు. దాంతో.. రాబోయే రోజుల్లో జపాన్ క్రికెట్‌కు మహర్దశ వచ్చే అవకాశముందంటున్నారు విశ్లేషకులు.

మహిళ

# లింగ సమానత్వంలో వెనుకబడిన భారత్



ప్రపంచ దేశాల్లో లింగ సమానత్వాన్ని పాటిస్తున్న దేశాల జాబితాలో భారత్ ఇంకా వెనుకబడే ఉంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) 'గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ 2026' ప్రకారం, 145 దేశాలు లేదా ఆర్థిక వ్యవస్థల్లో భారత్ 131వ స్థానంలో ఉంది. 2006లో ఈ సూచీ ప్రారంభమైనప్పటి నుంచి భారత్ స్కోరు 4.3 శాతం పాయింట్లు పెరిగినప్పటికీ, ప్రపంచ సగటు 69.2 శాతంతో పోలిస్తే భారత్ ఇంకా వెనుకబడిఉంది. ఆర్థిక భాగస్వామ్యం, విద్య, ఆరోగ్యం, రాజకీయ సాధికారత అనే నాలుగు రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు కూడా ఉన్నారా? లేరా? అనే విషయాన్ని అధ్యయనం చేస్తుంది. భారత్‌లో విద్య, ఆరోగ్యం రంగాలు ప్రధానంగా మెరుగ్గా కనిపిస్తున్నాయి. విద్యా సాధనలో భారత్ 96.6 శాతం సమానత్వాన్ని సాధించింది. మాధ్యమిక, ఉన్నత విద్యలో బాలురు, బాలికల నమోదు విషయంలో భారత్ దాదాపు పూర్తి సమానత్వానికి చేరుకుంది. ఆరోగ్యం, జీవన భద్రత విభాగంలో స్కోరు 95.6 శాతంగా ఉంది. అయితే ఈ రెండు రంగాల్లో సాధించిన పురోగతి మహిళలకు సమానమైన ఆర్థిక అవకాశాలుగా, నాయకత్వ స్థానాలుగా మారడం లేదు. అత్యంత స్పష్టమైన బలహీనత ఆర్థిక భాగస్వామ్యంలో కనిపిస్తుంది. ఈవిభాగంలో భారత్ స్కోరు 41.2 శాతం మాత్రమే. వృత్తిపరమైన, సాంకేతిక ఉద్యోగాల్లో మహిళల ప్రాతినిధ్యం 2006లో ఉన్న స్థాయితో పోలిస్తే దాదాపు రెట్టింపై 49.9 శాతానికి చేరుకున్నప్పటికీ, సీనియర్ అధికారులు, మేనేజర్ల స్థాయిలో మహిళల ప్రాతినిధ్యం కేవలం 13.1 శాతంగా ఉంది. అంటే విద్య, నైపుణ్యం పొందుతున్న మహిళలు ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశించిన తర్వాత ఉన్నతస్థాయి నిర్ణయాధికార స్థానాలకు చేరుకోవడంలో పెద్ద అంతరం కొనసాగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా 2026లో లింగ అంతరంలో 69.2 శాతం మాత్రమే పూడింది. గత ఏడాదితో పోలిస్తే మెరుగుదల 0.4 శాతం పాయింట్లు మాత్రమే. ప్రస్తుత వేగం కొనసాగితే ప్రపంచం పూర్తి లింగ సమానత్వానికి చేరుకోవడానికి సుమారు 120 సంవత్సరాలు పడుతుందని డబ్ల్యుఇఎఫ్ అంచనా వేసింది. ఐస్లాండ్ 93 శాతం సమానత్వంతో వరుసగా 17వఏడాది మొదటిస్థానంలో ఉంది. ఫిన్లాండ్, నార్వే తరువాతి స్థానాల్లో ఉన్నాయి. వాస్తవానికి సూచీలో ఉపయోగించిన నిర్దిష్ట ప్రమాణాల్లో మహిళలు, పురుషుల మధ్య ఎంతఅంతరం ఉందో మాత్రమే కొలుస్తుంది. అయితే, ఈ సూచీలోని అంకెలు వివిధ దేశాలు మహిళల పట్ల అనుసరిస్తున్న తీరును స్పష్టం చేస్తాయి. కాగా, రాజకీయ సాధికారత విభాగంలో భారత్‌కు 24.5 శాతం స్కోరు వచ్చింది. ఈ విభాగంలో భారత్ మొత్తం ర్యాంకు 67. పార్లమెంటులో మహిళల ప్రాతినిధ్యానికి సంబంధించిన సూచీలో లింగ అంతరం 16.1 శాతం మాత్రమే భర్తీ అయింది. మంత్రివర్గ స్థాయిలో ఈస్కోరు 5.9 శాతం. 2019లో నమోదైన 30శాతం గరిష్ఠ స్థాయి నుంచి ఇది గణనీయంగా తగ్గింది. కాబట్టి విద్యలో దాదాపు సమానత్వం సాధించినప్పటికీ, రాజకీయ నిర్ణయ ప్రక్రియలో మహిళల ప్రాతినిధ్యం అదేస్థాయిలో పెరగలేదని గణాంకాలు సూచిస్తున్నాయి. మహిళలు విద్య పూర్తిచేసిన తర్వాత ఉద్యోగాల్లోకి ప్రవేశించడం, ఉద్యోగాలను కొనసాగించడం, నాయకత్వ స్థానాలకు ఎదగడం కీలకం. కుటుంబ సంరక్షణ, పిల్లల పెంపకం, ఇంటి పనుల భారం ఎక్కువగా మహిళలపైనే పడటం దీనికి ఒక ముఖ్యమైన అడ్డంకి. ఉద్యోగం నుంచి కొంతకాలం విరామం తీసుకున్న తర్వాత తిరిగి కెరీర్లోకి రావడంలో మహిళలు ఎదుర్కొనే నష్టం కూడా వారి దీర్ఘకాలిక ఆదాయం, పదోన్నతులపై ప్రభావం చూపుతుంది. ఇదే సమయంలో భద్రత, ప్రజా రవాణా, డిజిటల్ సాంకేతికతకు ప్రాప్యత వంటి అంశాలు కూడా మహిళల ఆర్థిక అవకాశాలను నిర్ణయిస్తాయి. గ్రామీణ మహిళలకు స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, డిజిటల్ ఆర్థిక సేవలు అందుబాటులో లేకపోతే కొత్త ఆర్థిక వ్యవస్థలో వారి భాగస్వామ్యం పరిమితమవుతుంది. పిల్లల సంరక్షణ కేంద్రాలు, తాగునీరు, పారిశుధ్యం వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలు మహిళలపై పడే చెల్లింపులేని శ్రమను తగ్గించగలవు. అందువల్ల లింగ సమానత్వాన్ని కేవలం మహిళల సంక్షేమ అంశంగా చూడటం సరిపోదు. విద్యలో సాధించిన పురోగతిని ఉపాధి, ఆదాయం, ఆస్తిహక్కులు, నాయకత్వం, సాంకేతిక నైపుణ్యాలు, రాజకీయప్రాతినిధ్యంతో అనుసంధానించాలి. గతంలో కంటే ఇప్పుడు చదువుకుంటున్న మహిళల సంఖ్య ఎంతఅనే విషయం కంటే, వారు ఆ విద్యను ఆర్థిక స్వాతంత్ర్యం, నిర్ణయాధికారం, నాయకత్వంగా ఎంతవరకు మార్చుకోగలుగుతున్నారన్నదే కీలకం. ఈ కోణంలో ప్రభుత్వాలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

# భారత మహిళల్లో కేన్సర్ సమస్య



దేశంలోని మహిళల్లో రొమ్ము (బ్రెస్ట్), గర్భాశయ ముఖ ద్వార (సర్వైకల్) కేన్సర్లు ప్రధాన ఆరోగ్య సమస్యలుగా కొనసాగుతున్నాయి. అందుబాటులో ఉన్న జాతీయగణాంకాల ప్రకారం 2021 నుంచి 2025 మధ్య రొమ్ము కేన్సర్ కేసులు సుమారు 2.13 లక్షల నుంచి 2.4లక్షలకు, సర్వైకల్ కేన్సర్ కేసులు 77వేల నుంచి 79 వేలకు పెరిగాయి. మహిళల్లో నమోదయ్యే మొత్తం కేన్సర్లలో ఈ రెండు రకాల క్యాన్సర్లు దాదాపు 40 శాతం వరకు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయితే కేసులు పెరగడం కంటే ముందుగా గుర్తించకపోవడమే ఆందోళన కలిగించే అంశం. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ 5 ప్రకారం భారత్‌లో రొమ్ము కేన్సర్ స్క్రీనింగ్ చేయించుకున్న మహిళలు 1 శాతానికి కూడా చేరలేదు. సర్వైకల్ కేన్సర్ స్క్రీనింగ్ కూడా 2శాతంలోపే ఉంది. గ్రామీణ ప్రాంతాలు, తక్కువ ఆదాయ వర్గాల్లో పరిస్థితి మరింత వెనుకబడి ఉంది. పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంలో ఇబ్బందులు, ఖర్చు, అవగాహన లేకపోవడం, కేన్సర్‌పై నెలకొన్న అనేకానేక అపోహలు ఈఆలస్యానికి కారణమవుతున్నాయి. సర్వైకల్ కేన్సర్ విషయంలో పరిస్థితిని చాలా వరకు మార్చగల అవకాశాలు ఉన్నాయి. హ్యామన్ పాపిలోమావైరస్ (హెచ్‌పివి) టీకా, పాప్స్మియర్ లేదా హెచ్‌పివి పరీక్షలతో ఈ కేన్సర్‌ను ముందుగానే గుర్తించవచ్చు, నివారించవచ్చు. రొమ్ము కేన్సర్ను కూడా ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స విజయావకాశాలు గణనీయంగా పెరుగుతాయి. అందువల్ల లక్షణాలు కనిపించే వరకు ఎదురు చూడకుండా వయసుకు, ప్రమాద కారకాలకు అనుగుణంగా స్క్రీనింగ్ చేయించుకోవడం కీలకం. కేన్సర్ గురించి భయం తగ్గి, ముందస్తు పరీక్షలపై నమ్మకం పెరిగితే మరెన్నో ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది.



# అసైన్డ్ భూములపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి

## డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక డిమాండ్

**ప్రజాపక్షం/జనగామ:** పేదలు, దళితులు, అణగారిన వర్గాలకు ప్రభుత్వం కెటాయించిన అసైన్డ్ భూములపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. డిహెచ్‌పిఎస్ జిల్లా సమావేశం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో పైసా రాములు అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై అనిల్ కుమార్ మాట్లాడుతూ భూమిలేని పేదలకు భూమి పంపిణి చేయడం సామాజిక న్యాయంలో కీలకమైన అంశమన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు భూములు కెటాయించినప్పటికి అనేక మంది అసైన్డ్ భూముల లబ్దిదారులు ఇప్పటికీ పూర్తిస్థాయి హక్కులు, భద్రత లేకుండా జీవిస్తున్నారన్నారు. భూమి కోల్పోయిన అసలు లబ్దిదారులకు ప్రత్యామ్నాయ భూమి లేదా న్యాయబద్ధమైన పరిహారం కల్పించాలని కోరారు. భూమి లేని పేదలకు భూమి ఇవ్వడం మాత్రమే కాదు, ఇచ్చిన భూమిని రక్షించడం కూడా ప్రభుత్వ బాధ్యత అన్నారు. అసైన్డ్ భూములపై వాస్తవాలను ప్రజల ముందుంచాలని, పారదర్శకమైన శ్వేతపత్రం విడుదల చేసి, అర్హులైన లబ్ది దారులకు భూమిపై పూర్తి భద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో జీవన్ కుమార్, యాలాద్రి, పరుశరాములు, తదితరులు పాల్గొన్నారు.

# ఎఐటియుసిలో భారీ చేరికలు




**ప్రజాపక్షం/పాల్వంచ :** పారిశుధ్య కార్మికులు లేకపోతే మానవ జీవన మనుగడకు ఇబ్బంది అని రైతుసంఘం జాతీయ నాయకులు ముత్యాల విశ్వనాథం, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. మండల పరిధి 36 పంచాయితీలలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు మంగళవారం స్థానికంగా కార్యక్రమంలో సిపిఐ అనుబంధ సంఘం ఎఐటియుసిలో చేరారు. వారికి నాయకులు కండువాలు కప్పి సంఘంలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎఐటియుసి రాష్ట్ర నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పారిశుధ్య కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోలేని దీనావస్థలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐటియుసి నేతృత్వంలో వారి హక్కుల కోసం అవిశ్రాంతంగా ఉద్యమిస్తామన్నారు. కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.26,500 ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, అధికారులు, పాలక వర్గాల వేధింపులను నిలిపివేయాలని, ప్రతి ఆదివారం సెలవు ఇవ్వాలని, ఆరోగ్య రీత్యా వెళ్ళిన వారికి వేతనాలతో కూడిన సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, పట్టణ, మండల కార్యదర్శి ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, చంచలపురి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులు కొల్లగొడుతున్న కేంద్ర సర్కార్




## ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్

**ప్రజాపక్షం/వరంగల్ :** కార్మికుల హక్కులను కేంద్రంలోని బిజెపి సర్కార్ కొల్లగొడుతున్నదని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ ఆరోపించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని శివనగర్ తమ్మెర భవన్‌ల్లో ఎఐటియుసి స్లాబ్ లిఫ్ట్ మిల్లర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గంధం శ్రీనివాస్, ఐఎన్‌టియుసి స్లాబ్ లిఫ్ట్ మిల్లర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కానుగంటి రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్మిక చట్టాల సవరణ పేరుతో యాజమాన్యాల కింద కార్మికులు బానిసలుగా పనిచేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. మోదీకి కార్పొరేట్ల రక్షణ తప్ప కార్మిక సంక్షేమం తెలియదన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రపంచీకరణ, మతోన్మాదం, కార్మిక చట్టాల సవరణ ఇప్పుడు అత్యంత వేగంగా ఈ ప్రభుత్వం అమలు చేస్తుందని దీనిని ప్రతిఘటించేందుకు సమరశీల పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలన్నారు. పాలకులు కార్మికులను కాదని యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నాయని, శ్రమకు తగిన వేతనం ఇప్పించడంలో విఫలమవుతున్నాయన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుంతుంటే అదుపు చేయడంలో పాలకులు విఫలమయ్యారని, దీంతో కార్మికులు మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశలు, ఎండి యాకుబ్, మిల్లర్ నాయకులు మంగళ నరసింహం, బైర్పాటి నరసింహ, హస్తం పోషాలు, చొప్పరి రాజు, గంధం రాజు, గంధం విష్ణు, గంధం మహేష్, తూర్పాటి రామకృష్ణ, గంధం రేవంత్, కళ్యాణం, కార్తీక్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

# బహుజన రాజ్యాధికారానికి పోరాడుదాం

## సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

**ప్రజాపక్షం/హనుమకొండ :** బహుజనుల బతుకులు బాగుపడడానికి సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని, బహుజన ప్రజాస్వామిక విప్లవమే బహుజనులకు రాజ్యాధికారాన్ని కల్పించగలదని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, బిసి హక్కుల సాధన సమితి జిల్లా బాధ్యులు తోట భిక్షపతి అన్నారు. మంగళవారం బాలసముద్రంలో సిపిఐ కార్యాలయంలో బిసి హక్కుల సాధన సమితి హనుమకొండ జిల్లా సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు బత్తిని సదానందం అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా కర్రె బిక్షపతి, తోట బిక్షపతి హాజరై మాట్లాడుతూ జన గణనలో కుల గణన చేసి జనాభా ఆధారంగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలని, చట్టసభలలో స్థానికసంస్థలలో బిసి జనాభా ఆధారం గా సీట్ల కేటాయింపు ఉండాలని డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బిసి హక్కుల సాధన సమితి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ సంఘాన్ని నిర్మాణం చేసుకొనుటకు సభ్యత్వం నిర్వహించి మండల, జిల్లా మహాసభలు జరుపుకుని నవంబర్‌లో రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర మహాసభ కు సన్నద్ధం కావాలని కోరారు. సమావేశంలో సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి ఎన్ఎ.స్టాలిన్, నాయకులు నాంపల్లి లక్ష్మయ్య, గోపరాజు కుమారస్వామి, కంచెర్ల కుమారస్వామి, అలకుంట యాకయ్య, పొనుగోటి రాముగోపాల్‌చారి, పూజారి అమృతయ్య, బైరి భాస్కర్ ఎం. చంద్రశేఖర్, తాటికంటి మమత, గుంటీ రజిత, జెట్టి కృష్ణ, పెనుకుల మధు, తురుక శోభన్, కొత్తపల్లి శ్రీకాంత్, గాండ్ల కవిత తదితరులు పాల్గొన్నారు.




# మద్యానికి మంత్రి ఉన్నారు.. విద్యకు ఎందుకు లేరు?



## ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ప్రశ్న

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్

**ప్రజాపక్షం/మెదక్ :** తెలంగాణ ప్రభుత్వంలో మద్యానికి మంత్రి ఉన్నారు కానీ విద్యారంగానికి ప్రత్యేక మంత్రి ఎందుకు లేరని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మెదక్ పట్టణంలోని టిఎన్‌జిఒ భవన్‌లో నిర్వహించిన ఎఐఎస్ఎఫ్ మెదక్ జిల్లా 20వ మహాసభకు మణికంఠరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెదక్ కేంద్రంగా ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పాలిటెక్నిక్ కళాశాలల విలీన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమం చేపడతామని మణికంఠరెడ్డి హెచ్చరించారు. సభలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆశ రాజు, జిల్లా కార్యదర్శి దినకర్, జిల్లా నిర్మాణ బాధ్యులు ఖలీక్, రాష్ట్ర గర్ల్స్ వింగ్ కోకన్వీనర్ కండె విజేత, నాయకులు మచ్చ రమేష్, పాపయ్య, తేజ, శివ, సంజన, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల సాధనకు ఏకం కావాలి



## బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు

**ప్రజాపక్షం/వరంగల్ :** సకల రంగాల్లో బిసిల వాటా సాధించడానికి రాజకీయాలకతీతంగా బిసిలంతా ఏకం కావాలనీ బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. ఖిలా వరంగల్ మండల మహాసభ మార్కండేయ నగర్ బర్ధన్ హాల్‌లో నల్లతీగల కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి చింతకింది కుమారస్వామి, సహాయకార్యదర్శి బొట్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు సువర్ణలతో కలిసి ముఖ్యఅతిథిగా తాటిపాముల వెంకట్రాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో 60 శాతం ఉన్న బిసిల వాటా బిసిలకు ఇవ్వడానికి జనాభా లెక్కలతో పాటు బిసి కులాల వారిగా జనాభా లెక్కలు తీసి సకలరంగాల్లో బిసిల వాటా బిసిలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిసిల ఐక్యత సమీకరణ హక్కుల సాధనే లక్ష్యంగా అక్టోబర్ 15 న వరంగల్ జిల్లా మహాసభలు , నవంబర్ 21,22 తేదీలలో రంగారెడ్డి జిల్లాలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్మియా మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా బిసిలంతా ఏకం చేయడానికి బిసి హక్కుల సాధన సమితి చేపట్టబోయే ఉద్యమాలకు సిపిఐ అండగా ఉంటుందన్నారు. అనంతరం 20 మందితో మండల కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా మౌటం కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా ఓడపెల్లి శ్రీనివాస్, బాషెట్టి రంజిత్, ప్రధాన కార్యదర్శిగా సల్లూరి నరేందర్, సహాయ కార్యదర్శిగా నులతీగల కుమార్, తీగల రాజేందర్, రత్నాల రంజిత్, కోశాధికారిగా కందగట్ల దివ్య, సభ్యులుగా రమేష్ గౌడ్, తోట మల్లన్న, తోట రాజు, పద్మ రజని, వంశీ కుమార్, రాకేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎండి అక్బర్, సుంకరి ,భవాని, దోమల కుమార్ పాల్గొన్నారు.

# విమానాశ్రయాల డిజైన్లలో తెలంగాణ వైభవం

## కాకతీయ కళాతోరణం, రామప్ప శిల్పకళ ఉట్టిపడేలా నిర్మాణాలు

## శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతం చేయాలి : సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ చరిత్ర, సంస్కృతి, శిల్పకళ, వాస్తు సంపదకు ప్రతిబింబాలుగా ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలో నిర్మించనున్న తెలంగాణ భవన్ నిలవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం, పిల్లలమర్రి దేవాలయం వంటి తెలంగాణ చారిత్రక నిర్మాణాల్లోని శిల్ప, వాస్తు కళలను అధ్యయనం చేసి, వాటి ప్రత్యేకతలు ప్రతిబింబించేలా ఆధునిక నిర్మాణాలను తీర్చిదిద్దాలని సూచించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణాలపై సిఎం రేవంత్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన మౌలిక వసతులు, వివిధ శాఖల పరిధిలో ఉన్న పనులు, నిర్మాణాల డిజైన్లపై అధికారులతో చర్చించారు. విమానాశ్రయాల నిర్మాణ ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మార్పు, వాగుల ప్రవాహాల మళ్లింపు, రహదారుల మార్పు, బీఎస్ఎన్ఎల్ లైన్లు, తాగునీటి సరఫరా పైపులైన్లను మార్చాల్సిన అంశాలను అధికారులు సిఎంకు వివరించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఒక్కో శాఖ విడివిడిగా పనులు చేపట్టడం వల్ల సమయం వృథా కావడంతో పాటు భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. విద్యుత్, ఆర్అండ్‌బి, తాగునీటి సరఫరా, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, బిఎస్ఎన్ఎల్ అధికారులతో కూడా సమావేశమై అన్ని పనులు ఏకకాలంలో జరిగేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. విమానాశ్రయాల ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్ అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సిఎం సూచించారు. విమానాశ్రయాల కాంపౌండ్ వాల్‌కు సమీపంగా రహదారులను నిర్మించి, వాటిని జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులతో అనుసంధానం చేయాలని ఆదేశించారు. విమానాశ్రయాలకు వచ్చే, వెళ్లే రహదారులు విశాలంగా ఉండటంతో పాటు ప్రధాన రహదారులకు సులభంగా అనుసంధానమయ్యేలా డిజైన్ చేయాలని చెప్పారు. వాగులు, ఇతర నీటి ప్రవాహాలను మళ్లించాల్సిన పరిస్థితి ఉంటే విమానాశ్రయ ప్రాంగణంలో లేదా సమీప ప్రాంతాల్లో చెరువులు నిర్మించి, వాటి ద్వారా నీటి ప్రవాహాలను మళ్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సిఎం ఆదేశించారు.

**డిజైన్లలో తెలంగాణ శిల్పకళకు ప్రాధాన్యం..**

ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలతో పాటు ఢిల్లీలో నిర్మించనున్న తెలంగాణ భవన్ డిజైన్లను సిఎం పరిశీలించారు. ప్రతి నిర్మాణంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ శిల్పకళ, వాస్తు విశిష్టతలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డిజైన్లలో పలు మార్పులను కూడా ఆయన సూచించారు. ఆధునిక సౌకర్యాలతో పాటు తెలంగాణ చారిత్రక వారసత్వం స్పష్టంగా కనిపించేలా నిర్మాణాలు ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీక్షా సమావేశంలో ఆర్అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపిలు వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, విప్ బీర్ల అయిలయ్య, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, ఆర్అండ్‌బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి గంగాధర్, పవర్‌గ్రిడ్ ఇడి డొమన్ యాదవ్, టిజి ఎన్‌పిడిసిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి, ఎయిర్ కమోడోర్ రాహుల్ శుక్లా, ఏవియేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి, స్థపతి ఈమని శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# జూరాల ప్రాజెక్టుపై రాస్తారోకోలు, అరెస్టులు

## రైతులకు సాగునీటిని విడుదల చేయాలని సిపిఎం, బిజెపి విడివిడిగా ధర్నాలు

**ప్రజాపక్షం/అమరచింత :** జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువ విభాగంలో రైతులకు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున సిపిఐ(ఎం), బిజెపి లు విడివిడిగా మంగళవారం నందిమల్ల క్యాంపు దగ్గర రాస్తారోకోలు చేశారు. తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు హైదరాబాదు నుంచి జూరాల ప్రాజెక్టుకు వస్తున్న సందర్భంలో వారిని భూత్పూర్ దగ్గర పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్లో ఉంచారు. అదేవిధంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు, రాష్ట్ర నాయకులు జూరాల ప్రాజెక్టుకు వస్తుండగా జడ్చర్ల దగ్గర పోలీసులు అరెస్టు చేశారు. ఎక్కడికక్కడ సిపిఐ(ఎం), బిజెపి నాయకులు రాకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ముందస్తుగానే నాయకులను అరెస్టు చేయడం జరిగింది. కాగా ఆయా పార్టీల నాయకులు జూరాల ప్రాజెక్టు దగ్గరకు వచ్చి విడివిడిగా రాస్తారోకోలు చేయడం జరిగింది. పోలీసులకు సవాలుగా ఆయా పార్టీల నాయకులు ప్రాజెక్టులోని ఎడమ కాలువ సెటర్లను తెరిచేందుకు పోలీసులను పక్కకు నెట్టి పురుగులు తీసిన పోలీసులు వారిని వెంబడించి బలవంతంగా అరెస్టు చేయడం జరిగింది. అదేవిధంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంతరెడ్డి, నారాయణపేట్ జిల్లా ఉపాధ్యక్షుడు మేరవరాజు, వనపర్తి జిల్లా అధ్యక్షుడు నారాయణలతో పాటు నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్కు తరలించడం జరిగింది. జూరాల ప్రాజెక్టు క్యాంపు దగ్గర ధర్నా రాస్తారోకోలు చేయడం ద్వారా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

**రైతుల సమస్యలు పరిష్కరించకుండా అరెస్టులు చేయడం సరికాదు : సిపిఐ(ఎం)**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూరాల ప్రాజెక్టు కింద సాగునీరు అందక పంటలు ఎండిపోతున్న రైతులకు తక్షణమే నీటిని విడుదల చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిశీలించేందుకు వెళ్తున్న సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి.సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.వెంకట్రాములును పోలీసులు అరెస్టు చేసి భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించింది. జూరాల కింద సాగు చేసిన పంటలకు నీరు అందక రైతులు కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సిపిఐ(ఎం) పేర్కొంది. నీటి కోసం రైతులు స్వయంగా కాల్వలకు నీటిని విడుదల చేసుకునే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకోవడంతోపాటు వనపర్తి జిల్లాలోనూ సిపిఐ(ఎం) నాయకులను అరెస్టు చేయడంతో పాటు కొందరిని గృహనిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండించింది.

## ‘రిమ్స్’ బాధితులకు పైసా సాయం చేయరా? : కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదిలాబాద్ రిమ్స్ హాస్పిటల్‌లో ప్రమాదం మానవ తప్పిదమేనప్పటికీ, ముగ్గురు చిన్నారులు చనిపోతే బాధిత కుటుంబాలకు పైసా సాయం చేయరా? అని తెలంగాణ రక్షణ సేన(టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కేవలం ఫోటోలు దిగేందుకే ఘటన స్థలానికి వెళ్లారని, కనీస మానవత్వం ప్రదర్శించలేదని ఆరోపించారు. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు తాము బుధవారం ఆదిలాబాద్‌కు వెళ్తున్నామని కవిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వం నుంచి కనీస సాయం అందుతుందని భావిస్తే, ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా బాధితులకు సాయం చేయలేదని ఆరోపించారు. సిఎం రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలనలో ఆదివాసీ జిల్లా ఆదిలాబాద్‌కు ఆరోగ్య రంగం విషయంలో ఏమీ చేయలేదన్నారు. ఎంజీఎం హాస్పిటల్ లో సీలింగ్ కూలిందని, చాలా హాస్పిటల్స్‌లో ఎక్విప్ మెంట్ సక్రమంగా లేవని కవిత ఆరోపించారు.

## రైతుల సమస్యలను ప్రశ్నిస్తే అరెస్టులా?

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆరోపించారు. జూరాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్న బిజెపి నాయకులను పోలీసులు అడ్డుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్తున్న తమను అడ్డుకోవడం సరికాదన్నారు. జూరాల, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలో రైతులు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీటి లభ్యతపై ముందస్తు సమాచారం ఇవ్వకుండా పంటలు వేసిన తర్వాత నీరు అందించలేమని చెప్పడం రైతులకు అన్యాయం చేయడమేనని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడం లేదని ఆరోపించిన ఆయన, ఫసల్ బీమా వంటి పథకాల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టం జరిగితే ఆదుకునే విధంగా బీమా పథకాలను అమలు చేయాలని కోరారు. ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం అందించాలన్నారు. రైతులు, నిర్వాసితుల పక్షాన బిజెపి పోరాటం కొనసాగిస్తుందన్నారు.

**బిజెపి నేతల హౌస్ అరెస్టులను ఖండించిన ఎంపి డి.కె. అరుణ**

జూరాల ప్రాజెక్టు ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి చేపట్టిన జూరాల ప్రాజెక్టు సందర్శన కార్యక్రమాన్ని అడ్డుకోవడంపై మహబూబ్ నగర్ ఎంపి డి.కె. అరుణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గద్వాల జిల్లా బిజెపి అధ్యక్షుడు రామాంజనేయులు, యువ నాయకురాలు డి.కె. స్నిగ్ధా రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బండల వెంకట్రాములు తదితర నాయకులను పోలీసులు హౌస్ అరెస్టు చేయడాన్ని ఆమె ఖండించారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా, శాంతియుత నిరసనలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని అన్నారు. జూరాల ఆయకట్టు పరిధిలో పంటలు నీరందక ఎండిపోతున్నాయని, ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నప్పటికీ సాగునీరు విడుదల చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## గణేశ్ నిమజ్జనానికి ప్రత్యేక రైళ్లు

### -25, 26 తేదీల రాత్రుల్లో 11 నుంచి ఉదయం 5 గంటల వరకు 8 ఎంఎంటిఎస్‌లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గణేశ్ నిమజ్జనం సందర్భంగా నగరంలో పెరగనున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) ప్రత్యేక ఎంఎంటిఎస్ రైళ్లను నడపనుంది. ఈ నెల 25–26, 26–27 మధ్య రాత్రుల్లో రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు మొత్తం ఎనిమిది ప్రత్యేక సర్వీసులను అందుబాటులోకి తీసుకురానుంది. నిమజ్జన కార్యక్రమాలు ముగించుకుని ఇళ్లకు చేరుకునే భక్తులు, ప్రజలకు రాత్రివేళ రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు ఎస్‌సిఆర్ తెలిపింది. ప్రత్యేక రైళ్లలో భాగంగా సికింద్రాబాద్–హైదరాబాద్ జిఎస్‌హెచ్1 రైలు రాత్రి 11.50 గంటలకు బయలుదేరి 12.20 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్–లింగంపల్లి జిహెచ్ఎల్2 రైలు రాత్రి 12.30 గంటలకు బయలుదేరి 1.20 గంటలకు లింగంపల్లి చేరుతుంది. అనంతరం లింగంపల్లి–హైదరాబాద్ జిఎల్‌హెచ్3 రైలు 1.50 గంటలకు బయలుదేరి 2.40 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. హైదరాబాద్–సికింద్రాబాద్ జిహెచ్ఎస్4 రైలు తెల్లవారుజామున 3.30 గంటలకు బయలుదేరి 4 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. అదేవిధంగా హైదరాబాద్–లింగంపల్లి జిహెచ్ఎల్5 రైలు రాత్రి 11.10 గంటలకు బయలుదేరి 11.55 గంటలకు లింగంపల్లి చేరుతుంది. లింగంపల్లి–ఫలక్‌నుమా జిఎల్ఎఫ్6 రైలు అర్ధరాత్రి 12.10 గంటలకు బయలుదేరి 1.50 గంటలకు ఫలక్‌నుమా చేరుతుంది. ఫలక్‌నుమా–సికింద్రాబాద్ జిఎఫ్ఎస్7 రైలు 2.20 గంటలకు బయలుదేరి 3 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. సికింద్రాబాద్–హైదరాబాద్ జిఎస్‌హెచ్8 రైలు తెల్లవారుజామున 4 గంటలకు బయలుదేరి 4.40 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

**అన్ని ఎంఎంటిఎస్ స్టేషన్లలో ఆగేలా ఏర్పాట్లు..**

ప్రత్యేక రైళ్లకు మార్గమధ్యంలోని అన్ని ఎంఎంటిఎస్ స్టేషన్లలోనూ నిలుపుదల ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే స్పష్టం చేసింది. గణేశ్ నిమజ్జనం సందర్భంగా రాత్రివేళ భారీగా తరలివచ్చే ప్రజలకు ఈ అదనపు సర్వీసులు ఉపయోగపడనున్నాయి.

# ‘మహాలక్ష్మి ’లో రోజుకు 37 లక్షల ప్రయాణాలు!

## ఉచిత బస్సు ప్రయాణంతో రూ.2,428 కోట్లకు పైగా ఆదా

## రద్దీకి అనుగుణంగా మరిన్ని బస్సులు : ఎండి నాగిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్న ‘మహాలక్ష్మి’ పథకం ఆర్టీసీలో కొత్త రికార్డు సృష్టించింది. పథకం ప్రారంభమైన సమయంలో రోజుకు సగటున 29.42 లక్షలుగా ఉన్న మహిళా ప్రయాణాలు.. ప్రస్తుతం రోజుకు 37.09 లక్షలకు చేరాయి. ఉచిత ప్రయాణం ద్వారా 2026–27 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ వరకు మహిళలు రూ.2,428.47 కోట్ల మేర ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని టిజిఎస్‌ఆర్‌టిసి వెల్లడించింది. ఉద్యోగాలు, విద్య, కుటుంబ అవసరాల కోసం నిత్యం ప్రయాణించే మహిళలకు ఈ పథకం ఆర్థికంగా ఉపయోగపడుతోందని ఆర్టీసీ పేర్కొంది. పెరుగుతున్న మహిళా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను క్రమబద్ధీకరిస్తున్నామని టిజిఎస్‌ఆర్‌టిసి ఎండి వై. నాగిరెడ్డి తెలిపారు. విద్యార్థినులకు ఇబ్బందులు కలగకుండా పాఠశాలలు, కళాశాలల వేళల్లో ప్రత్యేక ట్రిప్పులు నడుపుతున్నట్లు చెప్పారు. మహాలక్ష్మి పథకం కారణంగా బస్సు సర్వీసులు తగ్గించారన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. 2025–26తో పోలిస్తే 2026–27 ఆగస్టు వరకు మహాలక్ష్మి ప్రయాణికుల సౌకర్యార్థం 96.50 లక్షల కిలోమీటర్లు అదనంగా బస్సు సర్వీసులు నడిపినట్లు ఎండి తెలిపారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని కొత్త బస్సులు, సౌకర్యాలు అందుబాటులోకి తెస్తామని, ప్రతి మహిళకు సురక్షితమైన, గౌరవప్రదమైన ప్రయాణాన్ని అందించడమే సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ బస్‌భవన్‌లో అన్ని జోన్ల ఇడిలు, ఆర్ఎంలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మహాలక్ష్మి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఎండి నాగిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## సిఎంఆర్ఎల్ ముడుపుల కేసులో

# విచారణకు కేరళం ప్రభుత్వం ఆదేశం

## మాజీ సిఎం విజయన్, వీణ, మహమ్మద్ రియాస్‌లపై చర్యలకు ఇడి నివేదిక



**తిరువనంతపురం :** సిఎంఆర్ఎల్ ముడుపుల కేసులో కేరళం ప్రభుత్వం పోలీసులు విచారణకు ఆదేశించింది. మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తె వీణ టి, ఆమె భర్త పి.ఎ. మహమ్మద్ రియాస్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సమర్పించిన నివేదిక ఆధారంగా, కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇడి నివేదికపై విచారణ బాధ్యతను డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)కు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని హోం మంత్రి రమేష్ చెన్నితల తెలిపారు. ఈ విచారణ ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే రాష్ట్ర పోలీసు విభాగంలోని ‘క్రైమ్ బ్రాంచ్’ నిర్వహిస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇడి నివేదికపై తదుపరి చర్యల విషయంలో నిర్ణయం తీసుకునే బాధ్యతను రాష్ట్ర పోలీసులకే వదిలివేస్తూ అడ్వకేట్ జనరల్ (ఎజి) ఇచ్చిన న్యాయపరమైన సలహాను ప్రభుత్వం పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఎ) కింద జరిపిన దర్యాప్తు, సోదాల సమయంలో సేకరించినట్లు చెబుతున్న సాక్ష్యాల ఆధారంగా... ప్రస్తుతం ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న విజయన్, వీణ, రియాస్‌లపై అవినీతి నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ ఇడి రాష్ట్ర పోలీసు చీఫ్ రావడ ఎ. చంద్రశేఖర్‌కు లేఖ రాసింది. ఎజి లేఖను డిజిపి స్వీకరించి, దానిని హోం శాఖ కార్యదర్శికి పంపారని చెన్నితల తెలిపారు. ఆ తర్వాత హోం శాఖ కార్యదర్శి తదుపరి చర్యలపై ఆదేశాలు కోరుతూ ఆ లేఖను ప్రభుత్వం ముందు ఉంచారు. మంగళవారం ముఖ్యమంత్రి వి.డి. సతీశన్‌తో ఈ విషయంపై చర్చించానని, విచారణకు ఆదేశించాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. అనంతరం ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. అవినీతి కేసులతో సహా కొన్ని రకాల కేసుల్లో, అందిన సమాచారం ద్వారా 'కాగ్నిజబుల్ అఫెన్స్' (పోలీసులు వారెంట్ లేకుండానే అరెస్టు చేయగలిగే నేరం) జరిగినట్లు స్పష్టంగా తెలియకపోతే, ప్రాథమిక విచారణ చేపట్టవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన లలితా కుమారి’ తీర్పును కూడా ఆయన ప్రస్తావించారు. ఈ కేసులో ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాతే, ఈ విచారణ బాధ్యతను డిజిపికి అప్పగించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెన్నితల తెలిపారు. విచారణ తదుపరి ప్రక్రియపై డిజిపి నిర్ణయం తీసుకుంటారన్నారు. ఐటి కన్సల్టెన్సీ సేవల ముసుగులో, వీణకు చెందిన ‘ఎక్సలాజిక్ సొల్యూషన్స్’ (ప్రస్తుతం మూతపడిన సంస్థ)కు ‘కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సిఎంఆర్ఎల్) రూ. 2.78 కోట్ల మేర అక్రమ చెల్లింపులు జరిపిందని ఇడి ఆరోపించింది. తిరువనంతపురంలోని అద్దె ఇంట్లో అప్పట్లో విజయన్‌తో కలిసి నివసిస్తున్న వీణకు సంబంధించిన ప్రదేశాలలో జూన్ నెలలో కేంద్ర దర్యాప్తు సంస్థ (ఇడి) సోదాలు నిర్వహించి, ఆ తర్వాత ఆమెను విచారించింది.

**చట్టపరంగా, రాజకీయంగా ఎదుర్కొంటాం : బేబీ**

సిఎంఆర్ఎల్ ముడుపుల కేసులో ప్రభుత్వం విచారణకు ఆదేశించడాన్ని సిపిఐ(ఎం) తీవ్రంగా తప్పుబట్టింది. ప్రతిపక్ష నాయకులపై కేంద్ర దర్యాప్తు సంస్థల వినియోగం విషయంలో కాంగ్రెస్ నాయకత్వం అనుసరిస్తున్న వైఖరిని ఆ పార్టీ ప్రశ్నించింది. ఈ వ్యవహారాన్ని చట్టపరంగా, రాజకీయంగా ఎదుర్కొంటామని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ పేర్కొన్నారు. బిజెపి రాజకీయ లక్ష్యాలను సాధించడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ఉపయోగించిన సందర్భాలు చాలా ఉన్నాయన్నారు. ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకోవడానికి, నాయకులను బెదిరించడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించిన సందర్భాలు అనేకం ఉన్నాయని, తద్వారా వారిలో కొందరిని బిజెపిలో చేర్చుకున్నారని ఆయన చెప్పారు. కేరళంలోని కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కోణంలో విశ్లేషించుకోవాలని, అలాగే కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం కూడా దీనిని పరిశీలించాలని ఆయన అన్నారు. ‘నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ పరిధిలోని సంస్థలు కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్న తీరుపై జాతీయ స్థాయి కాంగ్రెస్ నాయకత్వం వైఖరి ఏమిటి?’ అని బేబీ ప్రశ్నించారు.



## ‘ఖేలో తెలంగాణ’కు శ్రీకారం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్రీడలను కేవలం పోటీలకే పరిమితం చేయకుండా ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగం చేయడం, ప్రజల్లో శారీరక చైతన్యాన్ని పెంచడం, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా తెలంగాణ క్రీడా శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో ‘ఖేలో తెలంగాణ’ పేరుతో నిరంతర క్రీడా ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ప్రజల వయస్సుతో సంబంధం లేకుండా రోజువారీ జీవితంలో వ్యాయామం, ఫిట్‌నెస్, క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చేలా ఈ కార్యక్రమాన్ని దశలవారీగా విస్తరించనున్నారు. సచివాలయంలో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ‘ఖేలో తెలంగాణ’ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఎ.పి. జితేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జె.ఎ.సి రంజన్, స్పోర్ట్స్ అథారిటీ ఎండిడాక్టర్ సోనీ బాలాదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డితో పాటు క్రీడా శాఖ అధికారులు పాల్గొన్నారు. ‘ఖేలో తెలంగాణ బంధన్’లో భాగంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం రోజుకు కనీసం 30 నిమిషాలు కేటాయించేలా ప్రజలను ప్రోత్సహించనున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా తమకు అనుకూలమైన నడక, జాగింగ్, యోగా, ఇతర శారీరక వ్యాయామాలను నిత్య జీవితంలో భాగం చేసుకునేలా కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. ‘ఖేలో తెలంగాణ బంధన్’లో భాగంగా నైన్ ప్లస్ నైన్ ప్లస్ నైన్ ప్లస్ ఫిట్‌నెస్ ఛాలెంజ్ నిర్వహించనున్నారు. వాకింగ్, జాగింగ్, యోగా తదితర ఫిట్‌నెస్ కార్యకలాపాల్లో పాల్గొని వాటికి సంబంధించిన 27 సెకన్ల వీడియోను సోషల్ మీడియా వేదికల్లో పోస్టు చేయాలి. అనంతరం తొమ్మిది మంది మిత్రులను ట్యాగ్ చేసి, మరో తొమ్మిది మందిని ఈ ఛాలెంజ్‌లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించే విధంగా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. ఇలా ఒకరి నుంచి మరొకరికి ఫిట్‌నెస్ సందేశం విస్తరించేలా ప్రణాళిక రూపొందించారు. ‘ఖేలో తెలంగాణ’ను ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర క్రీడా ఉద్యమంగా కొనసాగించేందుకు వివిధ క్రీడాంశాల్లో లీగ్ పోటీలను ప్రోత్సహించనున్నారు. పాఠశాల స్థాయి నుంచి అన్ని వయస్సుల వారికి క్రీడల్లో పాల్గొనే అవకాశాలను పెంచడంతో పాటు ఆయా క్రీడలపై అవగాహన, ఆసక్తి, ప్రేక్షకాదరణను విస్తరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

### ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ

## విద్యా వ్యవస్థలో అంతర్భాగం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీని ఒక ప్రత్యేక కార్యక్రమంగా కాకుండా టీచర్ ట్రైనింగ్, అసెస్మెంట్, మెంటరింగ్, అటెండెన్స్, టెక్నాలజీతో సహా విద్యా వ్యవస్థలో ఒక అంతర్భాగంగా పరిగణించాలని తెలంగాణ విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణ అన్నారు. న్యూయార్క్‌లో జరిగిన యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ (యుఎన్‌జిఎ) 2026లో ‘ప్రభుత్వ భాగస్వామ్యం, సంస్థాగత మార్పులు, విద్యా సంస్కరణలు’ అనే అంశంపై నిర్వహించిన మినిస్టీరియల్ బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో యోగితా రాణ స్పీకర్‌గా పాల్గొన్నారు. ఈ సెషన్‌లో భారత్, ఇథియోపియా, కెన్యా, రువాండా, కంబోడియా దేశాలకు చెందిన ప్రభుత్వ ప్రతినిధులు, విద్యావేత్తలతో పాటు గ్లోబల్ స్కూల్ ఫోరం సభ్యులు, రైసింగ్ అకాడమీస్, లుమినాస్ ఫండ్, యునైటెడ్ వరల్డ్ స్కూల్స్ వంటి సంస్థలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా యోగితారాణ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేయడానికి తెలంగాణ అనుసరిస్తున్న నిరంతర మూల్యాంకన విధానాలు, క్లాస్‌రూమ్‌లెవల్ అసెస్మెంట్ విధానాన్ని, 1నుండి 5 తరగతుల విద్యార్థుల కోసం డైలీ రెమీడియేషన్ పీరియడ్‌తో అనుసంధానం చేసినట్లు వివరించారు.

# మాదకద్రవ్యాల కట్టడిలో తెలంగాణకు జాతీయ గుర్తింపు

## ఏడు కీలక అంశాల్లో 80 శాతానికి పైగా మార్కులు..

## తెలంగాణ ఈగిల్ ఫోర్స్ ప్రతిభ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాదకద్రవ్యాల మహమ్మారిపై తెలంగాణ పోలీసు సాగిస్తున్న పోరాటానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నార్కోటిక్స్ బ్యూరో, ఈగిల్ ఫోర్స్ పనితీరుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జాతీయ స్థాయి అంచనాలో ఏడు కీలక అంశాల్లో తెలంగాణ 80 శాతానికి పైగా మార్కులు సాధించింది. దీంతో దేశంలోని యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్‌ల పనితీరులో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు దక్కింది. న్యూఢిల్లీలో మంగళవారం ప్రారంభమైన మూడో జాతీయ యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ అధిపతుల సదస్సులో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా తెలంగాణ ఈగిల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య రాష్ట్ర పోలీసుల తరపున జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో జరుగుతున్న ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్‌ల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**ఏడు అంశాల్లో ప్రతిభ :** దేశంలోని రాష్ట్రాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్‌ల పనితీరును కేంద్ర ప్రభుత్వం ఏడు కీలక అంశాల ఆధారంగా అంచనా వేసింది. ఇంటెలిజెన్స్ ఆపరేషన్లు, ప్రీకర్సర్ కెమికల్స్–సింథటిక్ డ్రగ్స్ నియంత్రణ, కేసుల దర్యాప్తు–ప్రాసిక్యూషన్, డ్రగ్స్ డిమాండ్–హాని నివారణ, అంతర్‌శాఖల సమన్వయం–సామర్థ్య పెంపు, పరిశోధన–విశ్లేషణ, పరిపాలన–లాజిస్టిక్స్ అంశాలను ఇందులో పరిగణనలోకి తీసుకున్నారు. ఈ అన్ని విభాగాల్లో తెలంగాణ 80 శాతానికి పైగా మార్కులు సాధించింది. డ్రగ్స్ కేసుల్లో సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌కు రాష్ట్రంలో ప్రత్యేక వ్యవస్థలను కూడా బలోపేతం చేశారు. న్యాయపరమైన పరిశీలన, కోర్టు కేసుల విశ్లేషణ, సాక్షుల రక్షణ, ప్రాసిక్యూషన్‌కు అవసరమైన సహకారం అందించే విధంగా ప్రత్యేక మద్దతు వ్యవస్థలను ఏర్పాటు చేశారు.డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ఈగిల్ ఫోర్స్‌తో పాటు జిల్లా పోలీసు యంత్రాంగం కూడా సమన్వయంతో పనిచేయాలని డిజిపి సి.వి. ఆనంద్ నిరంతరం ఆదేశాలు జారీ చేస్తున్నారు. జిల్లా పర్యటనలు, సమీక్షా సమావేశాల్లో డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై నిఘా, సమాచార సేకరణ, కేసుల దర్యాప్తు, నిందితులపై చట్టపరమైన చర్యలు, కోర్టుల్లో సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. ఈగిల్ ఫోర్స్, జిల్లా పోలీసు విభాగాలు సమన్వయంతో చేపట్టిన చర్యలు జాతీయ స్థాయి అంచనాలో తెలంగాణ మెరుగైన మార్కులు సాధించేందుకు దోహదపడ్డాయి. జాతీయ గుర్తింపు సాధించినందుకు ఈగిల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్యతో పాటు అధికారులు, సిబ్బందిని సి.వి.ఆనంద్ అభినందించారు. సైబర్ క్రైమ్ తర్వాత యాంటీ నార్కోటిక్స్‌లోనూ అగ్రస్థానం పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యత కలిగిన రెండు విభాగాల్లో తెలంగాణ జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించిందని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. సైబర్ క్రైమ్ నియంత్రణ, పనితీరుతో పాటు యాంటీ నార్కోటిక్స్ చర్యల్లోనూ రాష్ట్ర పోలీస్ శాఖ అగ్రస్థాయి పనితీరును నమోదు చేసింది. ఇదే స్ఫూర్తితో ఇతర విభాగాల్లోనూ పనితీరును మెరుగుపరచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సి.వి. ఆనంద్ దిశానిర్దేశం చేస్తున్నారు.



## దుబాయ్‌లో అరెస్ట్ అయిన భర్తను విడిపించేందుకు సహాయపడండి

- 'సిఎం ప్రజావాణి'ని ఆశ్రయించిన బాధితురాలు..

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్కట్ నుంచి దుబాయ్‌లోకి చొరబడినందుకు తెలంగాణ వాసిని అరెస్టు చేయడంతో ఆయన కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని సిఎం ప్రజావాణి స్టేట్ ఇన్‌చార్జ్ , తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షురాలు గద్వాల్ విజయలక్ష్మిని కోరారు. మస్కట్ నుంచి దుబాయిలోకి అక్రమంగా చొరబడ్డ జగిత్యాల జిల్లా బీమారం మండలం మోత్కురావుపేట గ్రామానికి చెందిన ఏగుర్ల మల్లేశం అనే గల్ఫ్ కార్మికుడిని మార్చి 8న దుబాయి పోలీసులు అరెస్ట్ చేశారు. మల్లేశంను విడిపించేందుకు న్యాయ సహాయం చేయాలని ఆయన భార్య లత సిఎం ప్రజావాణిని ఆశ్రయించింది. దీనిపైన గద్వాల విజయలక్ష్మి స్పందిస్తూ మల్లేష్‌ను విడిపించేందుకు ప్రభుత్వం తరపున సహాయం చేస్తామని భరోసానిచ్చారు.

## 'సిఎం ప్రజావాణి'ని సందర్శించిన 'బిహార్ ట్రైన్ కలెక్టర్స్'

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజల నుంచి 'సీఎం ప్రజావాణి'లో దరఖాస్తుల స్వీకరణ నిమ్మితం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో ఏర్పాటు చేసిన శాఖల వారి డెస్క్‌లను బీహార్ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్స్ బృందం మంగళవారం సందర్శించింది. సిఎం ప్రజావాణికి వచ్చే ప్రజలకు దరఖాస్తులను రాసి ఇచ్చేందుకు ప్రత్యేక డెస్క్ ఉండడం, అత్యవసర ఆరోగ్య సమస్యలు ఏర్పడితే ప్రాథమిక చికిత్స అందించేందుకు హెల్త్ డెస్క్,సీఎం ప్రజావాణి స్టేట్ ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను బీహార్ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్స్ ప్రత్యక్షంగా గమనించారు. సీఎం ప్రజావాణి పనితీరు అద్భుతంగా ఉందని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని, ఈ పద్ధతులను తమ రాష్ట్రంలోనూ అవలంభించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ సద్వినియోగం

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. మొగుదాల సత్తయ్యకు రూ.27 వేలు, గోధుమ గడ్డ లలిత రూ.21,000 , బొలగాని శేఖర్‌కు రూ.60 వేల చెక్కులను అనారోగ్యంతో చికిత్స పొందిన బాధితులకు సీఎంఆర్ ద్వారా మంజూరైన రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం అందక ఎవరు ఇబ్బంది పడకూడదని అవసరమైతే వారికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చుని గాలయ్య, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## 'విబి–జి రామ్‌జి' వ్యవసాయానికి అనుసంధానంతో రైతులకు మేలు



- విబి–జిరామ్ జి రాష్ట్ర స్పెషల్ కమిషనర్ లక్ష్మి

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** వ్యవసాయ రంగానికి వి బి జి రామ్ జి పథకాన్ని అనుసంధానం చేయడంతో రైతులకు, వ్యవసాయానికి లబ్ది చేకూరుతుందని వి బి జి రామ్ జి స్పెషల్ కమిషనర్ లక్ష్మి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని చిన్న లక్ష్మాపురం గ్రామంలో మంగళవారం గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి సంతోష భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో డిప్యూటి కమిషనర్, జిల్లా అధికారులతో కలిసి పాల్గొన్న రాష్ట్ర కమిషనర్ లక్ష్మి మాట్లాడుతూ వి బి జి రామ్ జి పథకం కింద ఎలాంటి పనులు జరుగుతున్నాయో సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. 164 కుటుంబాల నుండి ప్రతిరోజు పనులు చేస్తున్న కూలీల అందరి పక్షాన గ్రామ పంచాయతీ 2027–28 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.86.74 లక్షల లేబర్ బడ్జెట్‌ను ప్రకటించారని తెలిపారు. స్పెషల్ కమీషనర్, డిప్యూటీ కమిషనర్ సరిత సంబంధిత అధికారుల సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో గ్రామంలో పర్యటించి సమస్యలు నేరుగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సరిత, డిఆర్డిఏ నాగిరెడ్డి, జెడ్పీ సీఈవో శోభారాణి, డిపిఓ శ్రీనివాస్ రెడ్డి, డిఎల్‌పిఓ శ్రీకాంత్ రెడ్డి, ఎంపిడిఓ గీతారెడ్డి, ఏపీడి నవీన్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఈసీలు యశోద, రాజశేఖర్, సంబంధిత అధికారులు గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచ్ ముడావత్ పార్వతీ చిన్న నాయక్, వార్డు మెంబర్లు సరిత నవీన్ రెడ్డి, బోల్లు నరసింహ, మహేష్ యాదవ్, ఓర్సు రాములు, మోత్కుపల్లి రాజు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పోచంపల్లి ఇక్కత్ చేనేత వస్త్రాలకు ప్రపంచంలోనే యూనిక్ ఐడెంటిటీ


- తమిళనాడు స్టేట్ హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ ప్రిన్సిపల్ సెక్రటరీ టిఎన్.వెంకటేష్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** భూదాన్ పోచంపల్లి ఇక్కత్ చేనేత వస్త్రాలు ప్రపంచంలోనే యూనిక్ ఐడెంటిటితో ప్రఖ్యాతి గాంచి మగువల, వినియోగదారుల మనసు దోచుకుంటున్నాయని తమిళనాడు స్టేట్ హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ ప్రిన్సిపల్ సెక్రటరి టిఎన్ వెంకటేష్ కొనియాడారు. సోమవారం ఆయన పోచంపల్లిని సందర్శించి క్షేత్రస్థాయిలో చేనేత కార్మికులు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఎక్స్‌పోజర్ ఆఫ్ తెలంగాణలో భాగంగా నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలను పర్యటించినట్లు సోమవారం పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమ కార్మికుల స్థితిగతులను తెలుసుకునేందుకు వచ్చినట్లు చెప్పారు. టూరిజం పార్కు, సహకార సంఘం, పలు మగ్గాలు నేసే కార్మికుల ఇళ్లకు వెళ్ళి చీరలు నేసే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. పరిశ్రమ అభివృద్ధి కోసం వ్యాపారాల్లో లాభాలు కార్మికుల జీవన ప్రమాణాలు మారుతున్న కాలానికి తగ్గట్టుగా వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నూతన డిజైన్‌లతో చేనేత వస్త్రాల తయారీకి కావలసిన ప్రభుత్వాలు అందివ్వాల్సిన సహకారాలను ఢిల్లీలో మాట్లాడుతానని హామి ఇచ్చారు. సహకార సంఘం అధ్యక్షులు భారత లవకుమార్ జిల్లా ఏడి శ్రీనివాస్ రావు సంఘం సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

### నెల రోజులు 5,000 క్యూసెక్కుల


# నీటిని విడుదల చేయండి

- కృష్ణా జలాలు విడుదల చేయాలని కర్ణాటక సిఎంకు తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేల విజ్ఞప్తి
- జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఆయకట్టు పంటలను కాపాడేందుకే భేటీ




**ప్రజాపక్షం /హైదరాబాద్:** దక్షిణ తెలంగాణలోని రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కృష్ణా నది నుంచి సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్ రెడ్డిల బృందం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో భేటీ అయ్యింది. ప్రస్తుతం జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఆయకట్టు పరిధిలో పంటలు కీలక దశలో ఉన్నందున, వాటిని కాపాడేందుకు కర్ణాటక నుంచి కృష్ణా జలాలను విడుదల చేయాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దృష్టికి తెలంగాణ ప్రతినిధి బృందం తీసుకెళ్లింది. ఈ నాలుగు సాగునీటి పథకాల కింద దాదాపు 5.5 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని, ఈ ప్రాంతాల్లో వేలాది రైతు కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాయని వివరించారు. ప్రస్తుత దశలో నీటి కొరత ఏర్పడితే పంట దిగుబడులతో పాటు రైతుల ఆదాయం, జీవనోపాధిపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. ఒక నెల పాటు ప్రస్తుత పంటలను కాపాడేందుకు కృష్ణా నది నుంచి 5,000 క్యూసెక్కుల నీటిని నిరంతరాయంగా ఒక నెల రోజుల పాటు విడుదల చేయాలని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను మంత్రులు, ఎమ్మెల్యేల బృందం కోరింది. ఈ నీటితో కీలక దశలో ఉన్న పంటలకు సకాలంలో సాగునీరు అందించి రైతులను ఆదుకోవచ్చని వివరించింది. మిగిలిన రుతుపవన కాలంలో కృష్ణా పరివాహక ప్రాంతంలో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రస్తుతం నియంత్రిత పద్ధతిలో నీటిని విడుదల చేస్తే అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని ప్రతినిధి బృందం వివరించింది. రైతుల పంటలు, వారి జీవనోపాధిని కాపాడటమే ప్రధాన లక్ష్యంగా కర్ణాటక ముఖ్యమంత్రితో ఈ భేటీ జరిగింది. పొరుగు రాష్ట్రాల మధ్య సహకార స్ఫూర్తితో కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు కోరారు.

## వారం రోజుల్లో నియామక పత్రాల ప్రక్రియ పూర్తి: గద్వాల్ విజయలక్ష్మి





**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్టీసీ ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ (టిఎస్టి), మెకానికల్ సూపర్వైజర్ ట్రైనీ (ఎంఎస్‌టి) పోస్టులకు ఎంపికైన 186 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు త్వరగా అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షురాలు, సిఎం ప్రజావాణి రాష్ట్ర స్థాయి ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన '257వ సీఎం ప్రజావాణి' కార్యక్రమానికి టిఎస్‌టి,ఎంఎస్‌టి పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో వచ్చి తమ సమస్యను గద్వాల విజయలక్ష్మి దృష్టికి తీసుకొచ్చారు. ఎంపిక ప్రక్రియ పూర్తై, ఫలితాలు మే నెలలోనే ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు తమకు నియామక ఉత్తర్వులు అందలేదని వారు తెలిపారు. దీనిపైన గద్వాల్ విజయలక్ష్మి స్పందిస్తూ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ శ్రీనివాస్ రావుతో ఫోన్లో మాట్లాడి నియామక ప్రక్రియపై చర్చించారు. ఎంపికైన అభ్యర్థులు మరింతకాలం వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా, మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి. వారం రోజుల్లో నియామక పత్రాలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### భారీ వర్షాల నేపథ్యంలో..

## సమన్వయంతో చర్యలు చేపట్టాలి

హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా తీవ్ర అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర ఇన్‌చార్జ్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. నగరంలోని వర్షపాతం, వరద పరిస్థితులపై జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్‌లతో ఆయన ఫోన్‌లో మాట్లాడి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. నగరంలో నీరు నిలిచే ప్రధాన ప్రాంతాల వద్ద జిహెచ్ఎంసి సిబ్బందిని నిరంతరం అందుబాటులో ఉంచాలని, నిలిచిన నీటిని తక్షణమే తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్, హైడ్రా, జిహెచ్ఎంసి, పోలీస్, ట్రాఫిక్ తదితర అన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి సమన్వయంతో పని చేస్తూ వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఒకవైపు నగరంలో గణేశ్ నిమజ్జన వేడుకలు విస్తృతంగా కొనసాగుతున్నందున, మరోవైపు వర్షాల తీవ్రత దృష్ట్యా అధికారులు మరింత అదనపు శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచే స్థలాల వద్ద సిబ్బంది పహారా కాయాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్, ట్రాఫిక్ విభాగాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అత్యవసర సమయాల్లో తక్షణమే స్పందించి ప్రజలకు సాయం అందించాలని ఆదేశించారు. ప్రజలు కూడా అత్యవసరం అయితే తప్ప బయటకు రాకుండా తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, వర్షాల పట్ల జాగ్రత్తగా ఉండాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రతకే ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పరిస్థితిని క్షణక్షణం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని రక్షణ చర్యలు చేపడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

## ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హన్మకొండలో ఈనెల 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ పిలుపునిచ్చింది. ఇందుకు సంబంధించిన వార్షికోత్సవాల పోస్టర్‌ను మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ మాట్లాడుతూ.. 1936 ఆగస్టు 12న లక్నోలో ఎఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని, దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న తొలి విద్యార్థి సంఘంగా ఏఐఎస్ఎఫ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పల ఉదయ్, లెనిన్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలతో పాటు విద్యా రంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించామని తెలిపారు. పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా పోరాటాలు చేపట్టామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి ప్రకటించిన రూ.1,000 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని, ప్రైవేటు యూనివర్సిటీలను ప్రోత్సహించడం కాకుండా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ ఓయూ సహాయ కార్యదర్శి అశ్విన్, ఉపాధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

## పంజాబ్‌లో చదువులు.. హైదరాబాద్‌లో డ్రగ్స్ దందా

- రూ.2.40 లక్షల విలువైన మత్తు పదార్థాలు పట్టివేత
- 9.6 గ్రాముల ఒజి కుష్, 14 గ్రాముల ఎండిఎంఎ స్వాధీనం
- ఇద్దరు విద్యార్థుల అరెస్ట్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చదువుల కోసం పంజాబ్ వెళ్లిన ఇద్దరు యువకులు డ్రగ్స్‌కు బానిసలై.. వాటి కోసం డబ్బు సంపాదించేందుకు హైదరాబాద్‌లోనే మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడుతున్నట్లు ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు గుర్తించారు. ఉప్పల్ పరిధిలో డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరిని ఎస్‌టిఎఫ్ సిటీమ్ పట్టుకుని వారి వద్ద నుంచి 9.6 గ్రాముల ఒజి కుష్, 14 గ్రాముల ఎండిఎంఎను స్వాధీనం చేసుకుంది. పట్టుబడిన డ్రగ్స్ విలువ సుమారు రూ.2.40 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అనంతపురానికి చెందిన దేవరకొండ విద్యశ్రీ, హైదరాబాద్‌కు చెందిన కోడూరు విష్ణువర్ధన్‌రెడ్డి పంజాబ్‌లోని ఓ నేషనల్ కాలేజీలో చదువుతున్నట్లు అధికారులు తెలిపారు. అక్కడే ఇద్దరూ డ్రగ్స్‌కు అలవాటుపడినట్లు పేర్కొన్నారు. మత్తు పదార్థాల కోసం అవసరమైన డబ్బు సరిపోకపోవడంతో పంజాబ్ నుంచి డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చి.. ఇక్కడ ఓ గదిని అద్దెకు తీసుకుని విక్రయాలు సాగిస్తున్నట్లు ఎస్‌టిఎఫ్ విచారణలో తేలిందని తెలిపారు. సరస్వతీ కాలనీ, ఉప్పల్ ప్రాంతంలో డ్రగ్స్ విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ సిటీమ్ నిఘా పెట్టింది. ఈ క్రమంలో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద డ్రగ్స్ లభించినట్లు అధికారులు వెల్లడించారు.విద్యశ్రీ, విష్ణువర్ధన్‌రెడ్డిని అరెస్టు చేసి, స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలతో పాటు ఉప్పల్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఎస్‌టిఎఫ్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు.కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

## క్రీడలకు ప్రాధాన్యం


క్రీడల హబ్‌గా కొత్తగూడెం: ఎమ్మెల్యే కూనంనేని




**ప్రజాపక్షం/పాల్వంచ:** క్రీడాభివృద్ధికి, క్రీడాకారులను తయారు చేయటానికి ప్రాధాన్యతను ఇస్తున్నామని కొత్తగూడెం నియోజకవర్గాన్ని క్రీడల హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ శ్రీనివాసకాలనీ మినీ స్టేడియంలో శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్ క్రీడలు ఐదవ రోజు మంగళవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌కు ఆతిధ్యం ఇచ్చిన శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ చైర్మన్ సురేష్‌రెడ్డికి, 75, 80 సంవత్సరాల వయసుతో క్రీడల్లో పాల్గొన్న సాయి రాంబాబు, భాస్కర్‌రావులకు ముందుగా అభినందనలు తెలిపారు. క్రీడలు మానసిక ఒత్తిడిని జయించడమే కాకుండా గెలవాలనే పట్టుదలను పెంచుతాయని, శారీరక దృఢత్వాన్ని, మానసిన ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. జిల్లా నుండి అధిక సంఖ్యలో క్రీడాకారులను తయారు చేసేందుకు కొత్తగూడెం నియోజక వర్గాన్ని క్రీడల హబ్‌గా తీర్చి దిద్దేందుకు పాటుతున్నామని చెప్పారు. శ్రీనివాస కాలనీ మిని స్టేడియం అభివృద్ధికి 70 లక్షల నిధులను, కొత్తగూడెంలో ప్రగతి మైదానంతో పాటుగా మరో స్టేడియం ఏర్పాటుకు 18 ఎకరాల స్థలాన్ని కేటాయించామన్నారు. . కొత్తగూడెం, పాల్వంచ నుండి సిఎం కప్‌లో విజేతలుగా నిలిచారని వారిని మరింత ప్రోత్సహిస్తే రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి గొప్ప పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకొని క్రీడా స్ఫూర్తిని ప్రిృంచి స్ఫూర్తిని నింపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, చీఫ్ రిటైర్డ్ జడ్జి రామక్రిష్ణ, జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్ రావు, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ కమీషనర్ కే. సుజాత, డిప్యూటి చైర్మన్ సిరిపురపు లలితకుమారి, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, సిపిఐ నాయకులు డి. సుధాకర్, శనగారపు శ్రీనివాసరావు, వైఎస్‌గిరి, 45 డివిజన్ కార్పోరేటర్ దంతెబోయిన నరేష్, టెన్నిస్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు యుగంధర్‌రెడ్డి, కార్యదర్శి జకరయ్య, వై. వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఆర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ గిగ్ వర్కర్‌కు సిఎంఆర్ఎఫ్ అండ

- కొండల్‌రెడ్డికి రూ.2.77 లక్షల ఆర్థిక సాయం.. నిమ్స్‌లో పూర్తి చికిత్సకు హామీ
- సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వివేక్ వెంకటస్వామికి టిజిపిడబ్ల్యూయు కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాలుగో దశ కాలేయ, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌తో బాధపడుతూ పని చేయలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిగ్ వర్కర్ మెట్టుకుపల్లి కొండల్‌రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో సిఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2,77,500 ఆర్థిక సాయం అందించడంతో పాటు పంజాగుట్టలోని నిమ్స్‌లో ఆయనకు పూర్తి చికిత్సను ప్రభుత్వమే అందిస్తుందని హామీ ఇచ్చింది. కొండల్‌రెడ్డి గత 9 సంవత్సరాల 7 నెలలుగా ఉబర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. 4.76 స్టార్ రేటింగ్‌తో ఇప్పటివరకు 7,620 ట్రిప్పులు పూర్తి చేశారు. ప్రస్తుతం క్యాన్సర్ కారణంగా విధులకు హాజరు కాలేకపోతుండటంతో కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. పాఠశాలకు వెళ్లే ఇద్దరు కుమార్తెలు ఉండగా, కుటుంబానికి కొండల్‌రెడ్డే ఏకైక సంపాదనా ఆధారంగా ఉన్నారు. ఉబర్ ఇండియాకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన రాకపోవడంతో తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యూయు) ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లింది. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కొండల్‌రెడ్డికి అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ అయిన కొండల్‌రెడ్డికి కష్టకాలంలో ప్రభుత్వం అండగా నిలవడాన్ని టిజిపిడబ్ల్యూయు స్వాగతించింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ.. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, సిఎంకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కష్టాల్లో ఉన్న గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లకు ప్రభుత్వం నుంచి లభించిన ఈ సహా యం భరోసానిస్తుందని పేర్కొన్నారు.

## విద్యార్థుల జీవితాలను మార్చేది గురువులే

- నల్లగొండలో 9 శాతం పెరిగిన విద్యార్థుల నమోదు
- ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యకు ప్రత్యేక కార్యాచరణ : మంత్రి కోమటిరెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ/నల్లగొండ టౌన్:** విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్ది, వారికి సరైన దిశానిర్దేశం చేసేది గురువులేనని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అభినందించారు. గత సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల నమోదు శాతం 10 శాతం తగ్గగా, నల్లగొండ జిల్లాలో మాత్రం 9 శాతం పెరగడం ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారా మెరుగైన విద్యను అందిస్తున్నప్పటికీ చాలామంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపు వెళ్తున్నారని, ప్రైవేట్ పాఠశాలల్లో బట్టీ విధానం, ఇంగ్లీష్ మీడియం వంటి అంశాలు ప్రభావం చూపుతున్నాయని అన్నారు. పదో తరగతి అనంతరం ఇంటర్మీడియట్‌లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అవుతున్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి అన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, నల్లగొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవార్, జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, కార్పొరేటర్ గుమ్మల జానకి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
23-09-2026
www.prajapaksham.in

"శ్రీకాంత్ కొడుకు రోషన్ మేక, ప్రీతి ముకుందన్ జంటగా శైలేష్ కొలను దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'ఏమో ఏమో ఇది'. యువతను ఆకట్టుకునే ఆహ్లాదకరమైన ప్రేమకథా చిత్రంగా రూపొందుతున్న 'ఏమో ఏమో ఇది' విడుదల తేదీ ఖరారైంది."

రీల్

## అక్టోబర్ 30న 'ఏమో ఏమో ఇది'



శ్రీకాంత్ కొడుకు రోషన్ మేక, ప్రీతి ముకుందన్ జంటగా శైలేష్ కొలను దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'ఏమో ఏమో ఇది'. యువతను ఆకట్టుకునే ఆహ్లాదకరమైన ప్రేమకథా చిత్రంగా రూపొందుతున్న 'ఏమో ఏమో ఇది' విడుదల తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ శీతాకాలంలో ప్రేక్షకులకు ఓ సరికొత్త ప్రేమానుభూతిని అందించేందుకు సినిమా సిద్ధమవుతోంది.'హిట్' ఫ్రాంచైజ్ తో బ్లాక్‌బస్టర్ విజయాలను అందుకున్న రచయిత, దర్శకుడు శైలేష్ కొలను తొలిసారి ఓ ఆహ్లాదకరమైన ప్రేమకథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తనదైన థ్రిల్లర్ కథాంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన, 'ఏమో ఏమో ఇది'తో పూర్తిగా భిన్నమైన కథా ప్రపంచాన్ని ఆవిష్కరించబోతున్నారు. రోషన్ మేక, ప్రీతి ముకుందన్‌ల ఫ్రెష్ పెయిర్ ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది.ఇప్పటికే విడుదలైన 'ది ఫస్ట్ బ్లీడ్ ఆఫ్ ' ఏమో ఏమో ఇది' వీడియోకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ వీడియో సినిమాపై పాజిటివ్ బజ్‌ను క్రియేట్ చేయడంతో పాటు, చిత్రంలోని ప్రేమకథ ఎలా ఉండబోతోందనే ఆసక్తిని పెంచింది.సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ ఎస్., సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండగా, వంశీ పచ్చిపులుసు సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.


## సుబ్బు క్యారెక్టర్ డిఫరెంట్‌గా ఉంటుంది



హీరోయిన్ కయాదు లోహర్

నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్‌ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్కేల్‌లో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ కయాదు లోహర్ మీడియా తో చిట్ చాట్ నిర్వహించారు. 'ప్యారడైజ్'లో సుబ్బు లక్ష్మి పాత్రలో కనిపిస్తాను. తనని అందరూ సుబ్బు అని పిలుస్తుంటారు. ఇందులో చాలా సర్‌ప్రైజులు ఉన్నాయి. అవన్నీ మీరు బిగ్ స్క్రీన్ మీద చూడాలి. జడల్ జర్నీలో లవ్ పోర్షన్‌గా కనిపిస్తాను. అలాగే నాకంటూ ఒక జర్నీ ఉంటుంది. అది చాలా డిఫరెంట్‌గా ఉంటుంది.నాది చాలా పెర్ఫార్మెన్స్ స్కోప్ ఉన్న పాత్ర. అలాగే కథలో చాలా కీలకమైన పాత్ర. సుబ్బు క్యారెక్టర్ గురించి అప్పుడే ఎక్కువ రివీల్ చేయకూడదు. నేను చేసిన పాత్రలన్నిటికి ఇది చాలా డిఫరెంట్. నాని గారు, శ్రీకాంత్ గారు, అనిరుధ్ గారితో కలిసి ఇలాంటి పెద్ద ప్రాజెక్ట్ లో భాగం కావడం గొప్ప ఎక్స్‌పీరియన్స్.డ్రాగన్ సినిమా చూసిన తర్వాత నేను ఈ క్యారెక్టర్ చేయాలని శ్రీకాంత్ బిలీవ్ చేశారు. కథ చెప్పారు. తర్వాత లుక్ టెస్ట్ చేసి ఓకే చేశారు. అలా నటించడం, యాక్షన్ చేయడం అంత ఈజీ కాదు. నాకు చాలా చాలెంజెస్ ఇచ్చారు. మేము పడిన కష్టానికి తగిన ఫలితం వస్తుందని నమ్ముతున్నాను.ఇందులో నాని క్యారెక్టర్ నా ఫేవరెట్. ప్రతి పరిశ్రమ నుండి నాకు ఎంతో ప్రేమ లభిస్తుంది. ఈ విషయంలో నేను చాలా అదృష్టవంతురాలిని. అన్ని పరిశ్రమల్లో పని చేసే అవకాశం రావడం, ప్రేక్షకుల ప్రేమ దక్కడం ఆనందంగా ఉంది.సుధాకర్ చాలా స్వీట్ అండ్ జెన్యూన్ పర్సన్. ఆయనకు సినిమాల పట్ల చాలా ప్యాషన్ ఉంటుంది. ఆయన నిర్మాణంలో పని చేయడం చాలా హ్యాపీగా ఉంది. ఇది చాలా భారీ ప్రాజెక్ట్. ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు.ప్యారడైజ్ బిగ్ స్క్రీన్ పై ఎక్స్‌పీరియన్స్ చేయాల్సిన సినిమా. స్టోరీ, యాక్షన్, మ్యూజిక్.. అంతా ఫుల్ కమర్షియల్ ప్యాకేజ్‌లా ఉంటుంది. అడ్రినలిన్ రష్ ఇస్తుంది.సూర్య తో ఒక సినిమా చేస్తున్నాను. అలాగే మారి సెల్వరాజ్ తో ఒక సినిమా చేస్తున్నాను.

## 'ఏందయ్య సామీ'.. సాంగ్ రిలీజ్



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. 19వ శతాబ్దంలో పెళ్లి సందడి ఎంత సంప్రదాయంగా ఉండేదో 'ఏందయ్య సామీ..' పాటలో అందంగా రూపొందించారు. ఈ పాటను అజయ్ అతుల్ మెలోడియస్ గా కంపోజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి అద్భుతమైన లిరిక్స్ అందించగా, శ్వేతా మోహన్, అజయ్ గోగవలే మధురంగా పాడారు. 'ఏందయ్య సామీ..' పాట ఎలా ఉందో చూస్తే 'ఏందయ్య సామీ ఇట్ల గస్సాంది వెన్నెల, ఊపేస్తా ఉంది సిత్తరాల ఉయ్యాల, వీచే గాలికి అత్తరద్దిందెవ్వరు, మారే ఝూముకి మందుపెట్టిందెవ్వరు, మాయ దారి మనస్సాగక జాగరమన్నరా...' అంటూ మళ్లీ మళ్లీ వినాలనిపించేలా సాగుతుందీ పాట. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా 'రణబాలి' సినిమా రూపొందుతోంది. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్ లో ఆసక్తి కలిగిస్తోంది. రీసెంట్ గా రిలీజ్ చేసిన ఈ చిత్ర టీజర్ మూవీపై అంచనాలు మరింతగా పెంచేసింది.

## సస్పెన్స్ నేపథ్యంలో 'మిస్ కాళికా మిస్సింగ్'



జెఎస్ వి వి ఎంటర్ టైన్ మెంట్స్ మరియు ఎస్ఎస్ ఆర్ట్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మిస్ కాళికా మిస్సింగ్'. సత్య ధనేకుల దర్శకత్వంలో రామకృష్ణ, పదిమల యమున సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకుంది. మునిపెన్నడూ చూడని కథనంతో ఈ మూవీ చిత్రీకరణ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది .ఈ చిత్రాన్ని అక్టోబర్ నెలలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాము' అని అన్నారు . ఈ చిత్రంలో హీరో హీరోయిన్స్ గా వినీత్ చంద్ర, డాలీషా తో పాటు ఎస్తేర్,అజయ్ ఘోష్, బ్రహ్మాజీ ,ఆలీ ,జ్యోతి, నాగ మహేష్, గుండు సుదర్శన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహం :శివ దేవరకొండ , మ్యూజిక్ : లీండర్ లీ మార్టీ , నిర్మాతలు :రామకృష్ణ, పదిమల యమున, దర్శకత్వం :సత్య ధనేకుల.

## పేద సినీ కార్మికులను ఆదుకోవడమే 'మనం సైతం' లక్ష్యం



నటుడు కాదంబరి కిరణ్

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం.. ఆర్థికంగా వెనుకబడిన వారికి భరోసా ఇవ్వడం.. ఒంటరిగా మిగిలిన వృద్ధులకు తోడుగా నిలవడం.. సేవను ఒక కార్యక్రమంగా కాకుండా బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్న 'మనం సైతం' ఫౌండేషన్ మరో బృహత్తర సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'సపర్య – వుయ్ కేర్ ఫర్ అన్ కేర్డ్' పేరుతో నూతన ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నటుడు కాదంబరి కిరణ్ ప్రకటించారు.హైదరాబాద్‌లోని తెలుగు ఫిలిం ఛాంబర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కాదంబరి కిరణ్ మాట్లాడుతూ.. గత 13 ఏళ్లుగా 'మనం సైతం' ద్వారా సమాజంలో ఆపదలో ఉన్నవారికి, అవసరార్థులకు వివిధ రూపాల్లో సహాయాన్ని అందిస్తున్నామని తెలిపారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలనే ఉద్దేశంతో 'సపర్య' ప్రాజెక్టును రూపొందించినట్లు చెప్పారు.'సపర్య' ప్రాజెక్టులో భాగంగా అనాథాశ్రమం, వృద్ధాశ్రమం, పేదలకు అందుబాటులో ఉండే 'జనతా వైద్యం' ఆసుపత్రి ఏర్పాటు చేయనున్నట్లు కాదంబరి కిరణ్ తెలిపారు. ఈ ఏడాది నుంచి 'క్వాలిటీ థాట్ ఫ్యూచర్ స్కిల్స్ ఫౌండేషన్' భాగస్వామ్యంతో సినీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు ప్రత్యేక విద్యా పథకాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.తన 40 ఏళ్ల సినీ ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నానని కాదంబరి కిరణ్ గుర్తుచేసుకున్నారు. తనకు సాధ్యమైనంత మేరకు సాటి మనిషికి సాయం చేయడంలోనే నిజమైన తృప్తి ఉందనే భావనతో 'మనం సైతం'ను ప్రారంభించానని చెప్పారు. ''పేదవాళ్లే నా పేరెంట్స్.. పేదవాళ్లే నా కుటుంబం. భగవంతుడు మనల్ని పైకి తీసుకువచ్చినప్పుడు మన రెండో చెయ్యి చాచి వందలాది మంది పేదలను ఆదుకోవాలి'' అని ఆయన అన్నారు.

## అక్టోబర్ 17న 'గరివిడి లక్ష్మి '

భారీ స్థాయి సినిమాలతో అలరించే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన లెజెండరీ జానపద గాయని గరివిడి లక్ష్మి కథని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుంది. గరివిడి లక్ష్మి పాత్రలో ఆనంది మెరుస్తోంది. గౌరి నాయుడు జమ్ము ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు.చెప్పడమే కాదు, ఓ ఉద్యమంగా మార్చిన లక్ష్మి జీవితాన్ని ఈ సినిమా ఆవిష్కరించనుంది. టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న 'గరివిడి లక్ష్మి ' ఓ పాటతో వేలాది హృదయాల్లో నిలిచిపోయిన లెజెండరీ జానపద గాయని జీవితాన్ని రిక్రియేట్ చేస్తోంది.తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. అక్టోబర్ 17న సినిమా రిలీజ్ కానుంది.''అక్టోబర్ 17న మీ అభిమాన థియేటర్లలో మా గరివిడి లక్ష్మి ఆడి పాడి అలరించబోతోంది' అంటూ మేకర్స్ రిలీజ్ చేసిన వీడియో



అందరినీ ఆకట్టుకుంటుంది.ఈ చిత్రంలో నరేష్, రాశి, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మణ్, కంచరపాలెం కిషోర్, శరణ్య ప్రదీప్, కుశాలిని నటిస్తున్నారు.

## నాలుగు డిమాండ్లపై సర్కార్ సానుకూలం..!

**ఉద్యోగ సంఘాలతో చర్చలు మరో సారి వాయిదా....**
**నేడు సిఎస్‌తో చర్చలు.. అనంతరం ప్రకటన..?**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగ సంఘాల డిమాండ్లపైన రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోనుంది. నాలుగు డిమాండ్లపైన ప్రభుత్వం సానుకూలమైన నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. రెండు డిఎలను చెల్లించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్టు సమాచారం. మంగళవారం ఉద్యోగ సంఘాలతో జరగాల్సిన చర్చలు మరోసారి వాయిదాపడ్డాయి. అదే సమయంలో ఉద్యోగ సంఘాల డిమాండ్లపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు చర్చించినట్టు తెలిసింది. ఇందులో నాలుగు ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు ఉద్యోగ సంఘాల నాయకులు వెల్లడించారు.కాగా పెండింగ్ బిల్లుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.వెయ్యి కోట్లకు మరో రూ. 500ల కోట్లను అదనంగా చెల్లించే అవకాశాలు ఉన్నాయి. తొలుత పెండింగ్ బిల్లులను రూ.500ల కోట్లు, ఆ తర్వాత రూ.ఒక వెయ్యి కోట్ల ను చెల్లిస్తోంది. అయితే ఈసారి రూ.2వేల కోట్లను చెల్లించాలని ఉద్యోగ సంఘాలు పట్టుపడుతున్న నేపథ్యంలో రూ1500 కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది . అయితే ముందుగా నిర్దేశించిన ప్రకారం మంగళవారం సాయంత్రం ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సచివాలయానికి చేరుకున్నారు. కానీ ఉద్యోగుల డిమాండ్ల అంశంపైన సంజయ్ జాజు సిఎం, డిప్యూటీ సిఎంతో చర్చించారు. అలగే సిఎం అధ్యక్ష తన జరిగే సమావేశంలో పాల్గొన్నారు. దీంతో ఉద్యోగ సంఘాల నాయకులు సచివాలయం నుంచి వెళ్లిపోయారు. అయితే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో బుధవారం మధ్యాహ్నం ఉద్యోగ సంఘాలతో చర్చలు జరగనున్నట్టు టిజిఒ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ రావు, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) రాష్ట్ర అధ్యక్షులు కె. గౌతమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్.రమన్ రెడ్డి వెల్లడించారు.

## జోధ్‌పూర్‌లో 26 నుంచి తరంగ్ శక్తి విన్యాసాలు

**17 రోజులపాటు ఏడుదేశాల**
**వైమానిక బలగాల ప్రదర్శన**
**తొలిసారి రంగంలోకి అమెరికా ఎఫ్– 35 ఫైటర్ జెట్**



**న్యూఢిల్లీ:** జోధ్‌పూర్‌లో ఏడు దేశాల వైమానిక దళాల సైనికశక్తి విన్యాసాలు సెప్టెంబరు 26వ తేదీ నుండి అక్టోబరు 12వ తేదీ వరకూ జరుగుతాయి. అతిథేయ దేశం భారత్‌తోపాటు అమెరికా,ఫ్రాన్స్,జర్మనీ,ఆస్ట్రేలియా,బంగ్లాదేశ్,శ్రీలంక,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల వైమానిక బలగాలు గగనతల యుద్ధ విన్యాసాల్లో పాల్గొంటాయి. జోధ్‌పూర్‌లో ''తరంగ్ శక్తి'' అనే పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.భారత్–జపాన్ దేశాలమధ్య సెప్టెంబరు 9 నుండి 22వ తేదీ వరకూ ''వీర్ గార్డియన్'' విన్యాసాలు పూర్తయిన నాలుగు రోజుల వ్యవధిలోనే ఈ ''తరంగ్‌శక్తి'' విన్యాసాలు మొదలవుతున్నాయి. ఈ తరంగ్‌శక్తి విన్యాసాలలో ప్రత్యేకత ఏమిటంటే అమెరికాకు చెందిన బహుముఖ సామర్థ్యాలు ప్రదర్శించగల శక్తిమంతమైన ఎఫ్–35 స్టెల్త్ ఫైటర్ జెట్ మొదటిసారి పాల్గొంటున్నది. గతంలో ఏరో ఇండియా–2025 విన్యాసాలలో పాల్గొన్నప్పటికీ తరంగ్ శక్తి విన్యాసాలలో అమెరికా ఎఫ్–35 ఫైటర్ జెట్ పాల్గొనడం ఇదే మొదటిసారి.
ఈ విన్యాసాలలో భారతదేశం తన రాఫెల్, మిరేజ్–2000, జాగ్వార్, తేజస్,మిగ్–29, సు–30 ఎంకెఐ యుద్ధ విమానాలను, ఇతర గగనతల ఆస్తులను ప్రదర్శిస్తుంది. ఫ్రాన్స్‌దేశం కూడా తన రాఫెల్ యుద్ధ విమానాలుప్రదర్శిస్తుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఎఫ్–16 యుద్ధ విమానాలను,బంగ్లాదేశ్ సి–130 జె యుద్ధ విమానాలను ప్రదర్శిస్తాయి. జోధ్‌పూర్ ఎయిర్ ఫోర్స్ కేంద్రంలో రెండు వారాలపాటు ఈ యుద్ధ విమానాలు విడిదిచేసి ఉంటాయి. ఈ విన్యాసాలకు సంబంధించి సీనియర్ ఐఎఎఫ్ అధికారులు మంగళవారం న్యూఢిల్లీలో ఒక పిపిటి ప్రెజంటేషన్ ఇచ్చారు. ఆ తర్వాత వైమానికదళ ఉప ప్రధానాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ మీడియాకు ఈ ''తరంగ్ శక్తి'' విన్యాసాలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ ఏడాది 65 మిత్ర దేశాలకు ఆహ్వానాలు పంపామని ఆయన చెప్పారు. ఐతే ప్రస్తుతం కొనసాగుతున్న భౌగోళిక,రాజకీయ అనిశ్చితి తక్కువ దేశాలు పాల్గొనడానికి కారణమా? అని ప్రశ్నించగా ఈ విన్యాసాలకు,భౌగోళిక పరిస్థితులకు సంబంధం లేదన్నారు. 2024లో 11 దేశాలు రెండు దశల్లో సాగిన విన్యాసాలలో పాల్గొన్నాయని,45 విమానాలు 800 విన్యాసాలు చేశాయని, మొత్తం 1000 గంటల కార్యక్రమాన్ని ఆనాడు నమోదు చేశామని చెప్పారు.

## తీవ్ర వాయుగుండం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్– మల్కాజిగిరి, సంగారెడ్డి, మెదక్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. మంగళ, బుధవారాల్లో వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశముందన్నారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముండటంతో ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశామన్నారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్ధిపేట, జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించామన్నారు. ఈ సమయంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని హెచ్చరించారు. బుధ, గురువారాల్లో కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, జనగామ, సిద్ధిపేట జిల్లాల్లో అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశముందని చెప్పారు. శుక్ర, శనివారాల్లో ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాల ప్రభావం కొనసాగనుందన్నారు. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముండగా, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్– మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఆది, సోమవారాల్లో ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముండగా, మిగిలిన ఉత్తర, తూర్పు జిల్లాల్లో భారీ వర్షాలు కొనసాగనున్నాయన్నారు. అనంతరం ఆదివారం నుంచి వర్షాల తీవ్రత క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని, రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే కురిసే అవకాశముందన్నారు.

హైదరాబాద్‌లో వర్షం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది.

కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కాప్రా, బోయిన్‌పల్లి, దుండిగల్, గాంధీనగర్, రామ్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, అంబర్‌పేట, ఎస్ఆర్‌నగర్, బోరబండ, కోఠి, లక్డీకాపూల్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై నీరు చేరింది. షేక్‌పేట ఫ్లైఓవర్ వద్ద భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. భారీ వర్షం కురుస్తున్న సమయంలో అనవసర ప్రయాణాలు రద్దు చేసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

## పూర్తిస్థాయిలో అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నాలాలు, డ్రైనేజీల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని, కంట్రోల్ రూమ్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉంటూ పరిస్థితిని పర్యవేక్షించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

## అద్భుత విజయం

(మొదటి పేజీ తరువాయి)



డీ లింకే పార్టీ పగ్గాలు చేపట్టేస్థాయికి ఎదిగి ఈనాడు ఈ ఘన విజయాన్ని నమోదు చేశారు. డీ లింకే పార్టీ బెర్లిన్ ఎన్నికల్లో 26 శాతం ఓట్లు సంపాదించింది. 16 శాతం ఓట్లు సాధించిన ఎ.ఎఫ్.డి కంటే అధికార సిడియు పార్టీ కొద్దిశాతం ఓట్లు ఎక్కువ సంపాదించింది. ఇతర రాష్ట్రాలలో ఎన్నికల తరహాలోనే బెర్లిన్ రాష్ట్రంలో కూడా తామే ఘన విజయం సాధిస్తామని జాత్యాహంకార ఎ.ఎఫ్.డి విర్రవీగి చివరకు చతికిలపడింది. ఎ.ఎఫ్.డిని దేశంలోని ప్రధాన స్రవంతి పార్టీలన్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.జర్మనీ పార్లమెంటును కూడా కైవసం చేసుకుంటామంటూ ముందుకు దూసుకుపోతూ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్‌ను గడగడలాడించిన ఎ.ఎఫ్.డికి వామపక్ష డీ లింకే పార్టీ ముకుతాడువేసి అడ్డుకుంది. అంతేకాకుండా డీ లింకే అధినేత్రి ఎలిఫ్ ఎరాల్ఫ్ మేయర్ పదవి చేపట్టేందుకు మార్గం సుగమం చేసింది.ఎలిఫ్ ఎరాల్ఫ్ టర్కీ దేశస్థురాలు. ఆ దేశంలో తిరుగుబాటు హింసను తప్పించుకునేందుకు ఆమె కుటుంబం జర్మనీ వచ్చి స్థిరపడింది.ఆమె హేంబర్గ్ యూనివర్సిటీలో చదువుకుని లాయర్‌గా ప్రాక్టీస్‌చేస్తూ వామపక్ష డీ లింకేపార్టీ నాయకత్వ బాధ్యతల్లో ఉన్నారు.

ఫెడరల్‌స్థాయిలో అధికారం చెలాయిస్తున్న సిడియు పార్టీ వినాశకరమైన ఫలితాలు చవిచూడటంతో చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ రాజకీయంగా పెద్ద సంక్షోభంలో పడ్డారు. తమ పార్టీ పెద్ద నష్టాని చవిచూసిందని ఆయన అంగీకరించారు. కానీ అధికారంలో కొనసాగుతామని, అధికారాన్ని నిలబెట్టుకుంటామని బలంగా వాదించారు.జాత్యాహంకార ఎ.ఎఫ్.డిని అడ్డుకోవడంలో అత్యంత బలహీనమైన నాయకుడుగా మిగిలిపోయారని సొంత పార్టీ నుండే ఆయనపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రెండు వారాలక్రితం శాగ్సొనీ – అన్హాల్ట్ రాష్ట్ర ఎన్నికల్లో గెలిచిన ఎఎఫ్‌డి అధికారానికి ఆమడదూరంలో ఆగిపోయింది. భాగస్వాములకోసం వెతుకుతోంది. ఐతే ఏ రాష్ట్రంలోనూ ఎ.ఎఫ్.డిని అధికారపార్టీ భాగస్వామిగా ఉండనివ్వబోమని, వారి ప్రయత్నాలు ఎప్పటికీ సఫలం కాబోవని మెర్జ్ ఉద్ఘాటించారు. వారిని ఎక్కడా అధికారం చేపట్టకుండా బలంగా అడ్డుకుంటామన్నారు.ఇతర పార్టీలు కూడా ఇదే వైఖరి అవలంబిస్తాయన్నారు. ఐతే తాము అధికారం పంచుకోవడానికి ఏ రాజకీయపార్టీతోనైనా చర్చలకు సిద్ధంగా ఉన్నామని ఎ.ఎఫ్.డి ప్రకటించింది.

ఒకరకంగా చెప్పాలంటే యూరప్ అంతటా మితవాదం పేట్రేగుతోంది. ఈ మితవాదాన్ని అడ్డుకోవడానికి,ప్రతిఘటించడానికి వామపక్షాలు వామపక్షాలు బలమైన శక్తిగా ఉద్భవిస్తున్నాయి. ఎన్నికల విజయాలు సాధిస్తున్నాయి. ట్రంప్ నేతృత్వంలోని 'మాగా' ఉద్యమాన్ని ఎ.ఎఫ్.డి. జర్మనీలో దాదాపుగా అనుకరిస్తోంది. మేక్ జర్మనీ గ్రేట్ ఎగైన్ అనే నినాదం చేపట్టింది. ఐతే యూరప్‌తో ట్రంప్ అనుసరిస్తున్న పెడసరితనం,వ్యతిరేక ధోరణి నేపథ్యంలో ప్రపంచస్థాయిలో ఒక ప్రత్యేక ఖండాంతర గుర్తింపు ఉండాలని యూరప్ దేశాలు కోరుకుంటున్నాయి.ఈ పూర్వరంగంలో యూరప్‌లో పచ్చిమితవాదులు విజృంభించే అవకాశాలు తలెత్తాయి.పలు యూరప్ దేశాలలో జాతీయవాదం బలంగా ముందుకు వస్తోంది.గతంలో ఈ విధమైన గుడ్డి జాతీయవాదాలే యూరప్ నుండి వచ్చి రెండు ప్రపంచ యుద్ధాలకు దారితీశాయి.ఒకవైపు యూరప్‌లో పచ్చిమితవాదం,మరోవైపు అమెరికా నుండి డోనాల్డ్ ట్రంప్ అనాలోచిత ఆర్థిక విధానాలు,దూకుడు పద్ధతులమధ్య తీవ్ర జాతీయవాద ధోరణులు,వాటి పర్యవసానాల తరుణంలో వామపక్షాలు అప్రమత్తంగా వ్యవహరించాలి.ఒకవైపు ఫాసిజం,మరోవైపు సోషలిజాన్ని వ్యతిరేకించే సామ్రాజ్యవాద విధానాలమధ్య యూరప్‌లో యువతరం వామపక్షాలను గుర్తించి ఆదరించి ఎన్నికల్లో గెలిపించడం ఒక సానుకూల పరిణామం.

## ధాన్యం కొనుగోళ్లు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఈ ఏడాది ఏలాంటి ఇబ్బందులు కల్గకుండ ముందస్తుగానే పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశానలు జారీ చేశారు. కొనుగోళ్లలో నిల్వ సామర్థ్యానికి కొరత రాకుండా వినియోగంలో లేని రైస్ మిల్లులు, ఫంక్షన్ హాళ్లు, ఇతర ప్రత్యామ్నాయ నిల్వ ప్రదేశాలను కూడా ముందుగానే గుర్తించి . కేంద్రాల్లో ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్‌కు సరిపడా హమాలీలను అందుబాటులో ఉంచాలని అధికారులు ఆదేశించారు.తప్పుడు రికార్డులు సృష్టించినా, లెక్కల్లో మోసాలకు పాల్పడినా రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జీలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

**ఈ ఏడాది 7 సన్న రకాలకే బోనస్**

తగ ఏడాది మాదిరిగానే సన్న రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించనున్నారు అయితే ఈసారి ప్రభుత్వం గుర్తించిన 7 రకాల సన్నాలు బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం 1638, డబ్ల్యూజీఎల్ 44, కేఎన్ఎం 7715 రకాలకు మాత్రమే ఈ బోనస్ అందజేయనున్నారు. ఈ బోనస్ పొందేందుకు రైతులకు అగ్రిస్టాక్ ఫార్మర్ ఐడీ తప్పనిసరి అని ప్రభుత్వం స్పష్టం చేసింది. నిబంధనలకు అనుగుణంగా ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో బోనస్ నేరుగా జమ చేయనున్నారు.

## గవర్నర్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేషన్(సిఎంసి) నగర పాలక సంస్థల పరిధిలో ఈ చట్టం అమలు కానుంది. క్యూర్ చట్టం ద్వారా హైదరాబాద్ నగర పరిపాలనలో డిజిటల్ ఆధారిత విధానాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పౌర సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించేలా చర్యలు చేపట్టనున్నారు. నగర విస్తరణ, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా పాలనా విధానాలను ఆధునీకరించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంది. ఈ చట్టం ద్వారా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కు చట్టపరమైన గుర్తింపు లభించడంతో పాటు మరిన్ని అధికారాలు అందనున్నాయి. నగరంలోని చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, విపత్తుల నిర్వహణ వంటి అంశాల్లో హైడ్రా పాత్ర మరింత బలోపేతం కానుంది. క్యూర్ పరిధిలోకి వచ్చే మూడు కార్పొరేషన్‌లలో ఒకే విధమైన పాలనా విధానాన్ని అమలు చేయడంతో పాటు పాత, కాలం చెల్లిన నిబంధనలను తొలగించి ప్రస్తుత నగర అవసరాలకు సరిపోయేలా చట్టంలో మార్పులు చేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌కు ఆధునిక పాలనా నమూనాను అందించడమే క్యూర్ చట్టం లక్ష్యంగా ప్రభుత్వం వెల్లడించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com